PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 176 | విజయవాడ, మంగళవారం 28 జనవరి 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Tuesday 28 January 2025 | Rs



శామ్‌సంగ్ కార్మికుల యూనియన్‌కు గుర్తింపు

7



ఐసిసి వన్డే క్రికెటర్ ఆఫ్ ది ఇయర్‌గా మంధాన

8

దిగజారిన ఆర్థికస్థితి

ఇలా అయితే ఏ రాష్ట్రంలోనైనా పన్నుల భారం తప్పదు

విలేకరుల సమావేశంలో చంద్రబాబు



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఊహించని స్థాయికి దిగజారిపోయిందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. రాష్ట్ర సచివాలయంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల నీతి ఆయోగ్ దేశంలోని 18 పెద్ద రాష్ట్రాల ఆర్థిక పరిస్థితిని సమీక్షించి నివేదిక రూపొందించిందని, ఈ నివేదికలో రాష్ట్రం అన్ని రాష్ట్రాల తక్కువగా 17వ స్థానంలో నిలిచిందన్నారు.' ఏ రాష్ట్రంలో నైనా ఆర్థిక పరిస్థితి క్షీణిస్తు ప్రజలకు ఇబ్బందులు తప్పవు. సంక్షేమ పథకాలు ఇవ్వలేం. ప్రజల పై పన్నుల భారం పడుతుంది' అని చెప్పారు. జిఎస్‌డిపి పెరుగుదల రేటు కంటే చెల్లించే వడ్డీ పెరుగుదల రేటు అధికంగా ఉంటే రుణాలు పొందేందుకు అవకాశం ఉండదని తెలిపారు. రుణ సామర్థ్యం టిడిపి హయాంలో 22.7 శాతం ఉండగా, వైసిపి పాలనలో 'సున్నా'కు చేరుకుందని చెప్పారు. రాష్ట్రాన్ని మళ్లీ ఆర్థికంగా గాడిన పెట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. 'ఆరోగ్యంపై మనం ఎప్పుడూ దృష్టి పెడతాం. ఆరోగ్యం బాగుంటేనే ఏదైనా చేయగలం. అనారోగ్యంతో ఉంటే ఇంట్లో అందరికీ ఇబ్బందులు వస్తాయి. రాష్ట్ర ఆర్థిక స్థితి కూడా అంతే. బాగాలేకపోతే అభివృద్ధి పనులు చేయలేం. ఇదే కొనసాగితే చివరకు బాధ పడేదే ప్రజలే' అని ఆయన అన్నారు. 15 శాతం వృద్ధి సాధిస్తేనే రాష్ట్రం ఆర్థికంగా కోలుకునే పరిస్థితి ఉంటుందని తెలిపారు. అందుకు తగిన ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. జూన్‌కు మెగా డిఎస్సి అమలు చేయనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం మూలధన వ్యయంలో భాగంగా 8,258 కోట్లుతో జలవనరులు, రోడ్లు, ఇతర పనులు చేపట్టామని, పంచాయతీరాజ్‌కు రూ.1,443 కోట్లు ఆర్థిక సంఘం నిధులు కేటాయించామని అన్నారు. వైసిపి హయాంలో చెల్లించాల్సిన బకాయిలతో కలిపి రూ.9.75 లక్షల కోట్లు అప్పులు ఉన్నాయని తెలిపారు. కేంద్ర సాయంతో అప్పుల రీ షెడ్యూల్‌కు ప్రయత్నం చేస్తున్నామని, మారిటోరియం కూడా కోరుతున్నట్లు చెప్పారు.' వైసిపి హయంలో తలసరి ఆదాయం పెరగలేదు. కానీ తలసరి అప్పు పెరిగింది. రాష్ట్రాన్ని గాడిన పెట్టడానికి కొంచెం ఆలస్యం అవుతుంది.' అని చెప్పారను.వివిధ సంస్థలు రాష్ట్రంలో రూ.6,33,568 కోట్లు పెట్టుబడులు పెట్టుబోతున్నాయని, తద్వారా 4,10,125 ఉద్యోగాలను కల్పించనున్నట్లు చెప్పారు. 20 లక్షల ఉద్యోగాల కోసం కృషి చేస్తున్నట్లు చెప్పారు.

వక్ఫ్ సవరణలు ఏకపక్షం

- బిల్లుపై ప్రతిపక్షాల సవరణలకు 'నో'
- ఎన్‌డిఎ ప్రతిపాదనలకు జెపిసి ఆమోదం
- ప్రతిపక్షాల ఆగ్రహం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

వక్ఫ్ సవరణ బిల్లును పరిశీలించిన సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జెపిసి) పార్లమెంటరీ సంప్రదాయాలకు తిలోదకాలిచ్చింది. సోమవారం పార్లమెంటు హాలులో సమావేశమైన జెపిసి ఎన్‌డిఎ సభ్యుల ప్రతిపాదించిన 14 సవరణలను ఆమోదించింది. అదే సమయంలో ప్రతిపక్ష సభ్యులు ప్రతిపాదించిన 44 సవరణలను తిరస్కరించింది. జెపిసి ఛైర్మన్ జగదాంబికా పాల్ వ్యవహార తీరును నిరసిస్తూ ప్రతిపక్ష సభ్యులు ఆందోళనకు దిగారు. ప్రజాస్వామ్య ప్రక్రియను ఆయన తుంగలో తొక్కారని విమర్శించారు. సమావేశం అనంతరం జెపిసి ఛైర్మన్, బిజెపి ఎంపి అయిన జగదంబికా పాల్ విలేకరులతో మాట్లాడుతూ ఆమోదించిన సవరణలు చట్టానికి మరింత మెరుగైన, సమర్థవంతమైన రూపాన్ని ఇస్తాయని సెలవిచ్చారు.. ప్రజాస్వామ్య ప్రక్రియను ఆయన అపహాస్యం చేశారని ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. కమిటీ కార్యకలాపాలు సక్రమంగా జరగలేదని, నివేదిక ఇప్పటికే సిద్ధం చేశారని డిఎంకె ఎంపి ఎ.రాజా అన్నారు. దీనిపై సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామన్నారు. అధికార పక్ష సభ్యుల సవరణలన్నీ ఆమోదించి, ప్రతిపక్ష ఎంపిల సవరణలను తిరస్కరించడం ద్వారా ప్రభుత్వానికి రబ్బర్ స్టాంప్‌గా జెపిసి మారిందని కాంగ్రెస్ నాయకులు గౌరవ గొగోయ్ విమర్శించారు. 'ఇదో ప్రహసన కసరత్తు. మా గోడు ఎవరూ వినలేదు. పాల్ ఓ నియంతలా వ్యవహరించారు' అని టిఎంసి ఎంపీ కల్యాణ్ బెనర్జీ ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికార పక్షానికి చెందిన 16 మంది ఎంపీలు సవరణల్ని సమర్థించగా ప్రతిపక్షానికి చెందిన 10 మంది వ్యతిరేకించారు. ముసాయిదా నివేదికను వక్ఫ్ ప్యానల్ సభ్యులకు మంగళవారం పంపిణీ చేస్తారు. ఐదు వందలకు పైగా పేజీలున్న తుది నివేదికను బుధవారం లాంఛనంగా ఆమోదిస్తారు.

కమ్యూనిస్టుల త్యాగాలు చిరస్మరణీయం



నెల్లూరు నగర డప్పు కళాకారుల విన్యాసం, సింహపురి సాంస్కృతికోత్సవం ప్రారంభం సందర్భంగా నగారా మోగిస్తున్న తమ్మారెడ్డి భరధ్వాజ (ఇన్‌సెట్‌లో)

ప్రజాశక్తి- నెల్లూరు ప్రతినిధి

కమ్యూనిస్టుల త్యాగాలు చిరస్మరణీయమైవని, పుచ్చపల్లి సుందరయ్య, చంద్ర రాజేశ్వరరావు వంటి ఎందరో పార్టీ కోసం ఆస్తిని సైతం త్యాగం చేశారని సినీ నిర్మాత, దర్శకులు తమ్మారెడ్డి భరద్వాజ అన్నారు. సిపిఎం 27వ రాష్ట్ర మహాసభ సందర్భంగా నెల్లూరు నగరంలోని ముత్తుకూరు గేట్ సెంటర్‌లో నిర్వహించిన సింహపురి సాంస్కృతికోత్సవాలను ఆయన ఢంకా మోగించి ప్రారంభించారు. అనంతరం భరద్వాజ మాట్లాడుతూ, తాను కమ్యూనిస్టు కుటుంబంలో పుట్టి పెరిగానని, కమ్యూనిస్టు నాయకులను చూశానని, ఎందరో కమ్యూనిస్టులు చేసిన త్యాగాలు ఇప్పటికీ ప్రజలకు గుర్తున్నాయని అన్నారు. పార్టీ కోసం ఆస్తులు, జీవితాలు త్యాగాలు చేసిన చరిత్ర కమ్యూనిస్టులదని తెలిపారు. దేశ భవిష్యత్తు, ప్రజల కోసం చేసిన త్యాగాలు చెప్పడానికి రోజులు సరిపోవని తెలిపారు. తన అమ్మ కమ్యూనిస్టుల గురించి ఎన్నో కథలు కథలుగా చెప్పారని గుర్తు చేసుకున్నారు. తమ కాలనీ కమ్యూనిస్టు కాలనీగా గుర్తింపు పొందిందన్నారు. ఈ రోజు ఈ విషయాలు ఎందుకు చెబుతున్నానంటే ఎక్కడ ఉండాల్సిన వాళ్లం ఇప్పుడు ఎక్కడ ఉన్నామో అందరూ గుర్తించాలన్నారు. 'సిపిఎం మహాసభ సాంస్కృతిక ఉత్సవాలకు పిలిచారు. మాట్లాడాం. వెళ్లిపోయాం అని కాకుండా నా మనస్సులో ఉన్న బాధను చెప్పుకుంటాను' అని అన్నారు. కమ్యూనిస్టు పార్టీలన్నీ కలవాలని సూచించారు. అందరూ కలిసి ఈ దేశాన్ని కాపాడాలని కోరారు. సుందరయ్య పుట్టిన గడ్డలో సిపిఎం రాష్ట్ర మహాసభ జరగడం గర్వకారణమన్నారు. కమ్యూనిస్టుల మిగతా 7లో

స్థలమిచ్చిన రెండేళ్లలో ఇంటి నిర్మాణం

- 'అందరికీ ఇళ్లు' మార్గదర్శకాల విడుదల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం అందించే ఇళ్ల పట్టాల్లో రెండేళ్లలోగా నిర్మాణాలు పూర్తిచేయాలని రెవెన్యూశాఖ ఉత్తర్వులు విడుదల చేసింది. పేదలకు ఇళ్ల స్థలాలను అందించేందుకు ఇటీవల జరిగిన మంత్రివర్గ సమావేశం నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. 'అందరికీ ఇళ్లు' పేరుతో ఈ స్థలాలను ప్రభుత్వం అందించనుంది. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను జిఓ 23 పేరుతో రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పి సిసోడియా సోమవారం విడుదల చేశారు. గ్రామీణ ప్రాంతంలో 3 సెంట్లు, పట్టణ ప్రాంతంలో 2 సెంట్లు చొప్పున ప్రభుత్వం దారిద్ర్య రేఖకు దిగువన (బిపిఎల్) ఉన్న కుటుంబంలోని మహిళల పేరుతో ఈ స్థలాలు కేటాయించనుంది.

పట్టణ ప్రాంతంలో ప్రభుత్వ స్థలం అందుబాటులో లేకపోతే ఇళ్లను నిర్మించి టిడ్కో, యుఎల్‌బి ఇతర ఏదైనా ప్రభుత్వ పథకంలో భాగంగా ప్రభుత్వం అందిస్తుంది. కేటాయించిన తేదీ నుంచి పదేళ్ల తరువాత లబ్ధిదారులకు కేటాయించిన స్థలాలు, ఇళ్లపై హక్కులు వస్తాయని పేర్కొంది. స్థలం కేటాయించిన రెండేళ్లలోపు అందులో నిర్మాణం చేపట్టాలనే నిబంధన విధించింది. ఇళ్ల స్థలాల కోసం ప్రభుత్వ, ఇతర భూములు అందుబాటులో లేనిచోట అసైన్డ్ భూములు కేటాయించిన లబ్ధిదారుల నుంచి తిరిగి తీసుకోవాలని ఆదేశించింది. గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలి. ఈ దరఖాస్తులను విఆర్‌ఒ గానీ, ఆర్‌ఐ గానీ విచారణ జరిపి అర్హులైన వారి పేరుతో డ్రాఫ్ట్ జాబితాను సచివాలయాల్లో ప్రదర్శిస్తారు. గ్రామ, వార్డు సభ నిర్వహించి వీటిపై వచ్చిన అభ్యంతరాలను పరిశీలించి తుది జాబితాను విడుదల చేయాలి. తహశీల్దారు, మున్సిపల్ కమిషనర్ ద్వారా తన దగ్గరకు వచ్చిన తుది జాబితాలను జిల్లా కలెక్టర్ ఖరారు చేస్తారు. లబ్ధిదారులు నివసించే గ్రామంలో స్థలం అందుబాటులో లేకపోతే పక్క గ్రామంలో కేటాయించాలి.

అర్హతలు ఇవే...

బిపిఎల్ కార్డు ఉన్న లబ్ధిదారుల పేరుమీద రాష్ట్రంలో ఎలాంటి ఇళ్లు, ఇంటి స్థలం లేకపోతేనే ఈ పథకానికి అర్హులు. ఐదేకరాల మెట్ట, 2.5 ఎకరాల మాగాణి భూమి ఉన్నవారు అనర్హులుగా పేర్కొంది. రెండు కలిపి ఐదేకరాలు ఉన్నా అనర్హులుగా తెలిపింది. గతంలో ప్రభుత్వం లబ్ధిదారులకు కేటాయించిన స్థలంపై కోర్టు కేసు ఉంటే దానిని రద్దు చేసి కేటాయిస్తామని తెలిపింది. శ్మశానం, గుంతల ప్రాంతాలు, ఇతర గ్రామాల్లో ప్రభుత్వం కేటాయించిన స్థలాల్లో నిర్మాణం ప్రారంభించకపోతే వాటిని రద్దు చేసుకుని కొత్త దరఖాస్తు చేసుకోవచ్చునని వివరించింది.

భూముల గుర్తింపు బాధ్యత కలెక్టర్లదే

గ్రామ, పట్టణాన్ని యూనిట్‌గా తీసుకొని ఇళ్ల స్థలాల కోసం భూములను గుర్తించే బాధ్యతను జిల్లా కలెక్టర్లకు ప్రభుత్వం అప్పజెప్పింది. ప్రభుత్వ సంస్థలు, కార్పొరేషన్లు, స్థానిక సంస్థలకు కేటాయించిన భూములను తీసుకోవచ్చునని తెలిపింది. ఇండస్ట్రియల్ పార్కుల కోసం ఎపిఐఐసి గుర్తించిన స్థలాలను కూడా పరిశీలించాలని తెలిపింది. ల్యాండ్‌పూలింగ్ పథకంలో గుర్తించాలని తెలిపింది. గ్రామకంఠంలో నివసిస్తున్న వారికి సొంత పట్టాలివ్వాలని పేర్కొంది.

కమిటీ ఏర్పాటు

రెవెన్యూశాఖ మంత్రి ఛైర్మన్ అధ్యక్షతన రాష్ట్రస్థాయి పర్యవేక్షణ కమిటీని ప్రభుత్వం నియమించింది. అడిషనల్ సిసిఎల్‌ఎ కన్వీనర్‌గా ఉండే ఈ కమిటీలో మున్సిపల్, గృహ నిర్మాణశాఖల మంత్రులు, రెవెన్యూ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (ల్యాండ్), సిసిఎల్‌ఎ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, మున్సిపల్‌శాఖ కార్యదర్శి, గృహ నిర్మాణశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి సభ్యులుగా ఉంటారు. జిల్లాస్థాయిలో ఆ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఛైర్మన్‌గా కమిటీ ఉంటుంది. ఇతర శాఖల మధ్య సమన్వయం చేసుకునేందుకు రాష్ట్రస్థాయిలో రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఛైర్మన్‌గా ఒక కమిటీ ఏర్పాటు చేసింది.

ఉత్తరాఖండ్‌లో ఏకీకృత పౌరస్మృతి అమలు

న్యూఢిల్లీ : వివాదాస్పదమైన ఏకీకృత పౌర స్మృతి (యుసిసి)ని ఉత్తరాఖండ్ ప్రభుత్వం సోమవారం నుండి అమల్లోకి తీసుకొచ్చింది. యుసిసి సర్వీసుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను సులభతరం చేసేందుకు ఉద్దేశించిన కొత్త వెబ్‌సైట్‌ను ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ దామి ప్రారంభించారు. పౌరులందరికీ అందుబాటులో వుండేలా, ఏకీకృత పౌర స్మృతి (యుసిసి) చట్రపరిధి కింద సర్వీసులు పారదర్శకంగా అందుబాటులోకి తీసుకురావడానికి, నమోదు చేసుకోవడానికి ఈ వెబ్‌సైట్ ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఎస్‌టిలు, రాష్ట్రం వెలుపలకు వలస వెళ్లిన రాష్ట్ర ప్రజలకు ఈ పౌర స్మృతి అమలు నుండి మినహాయింపు ఇచ్చారు.

వివాహం, విడాకులు, వారసత్వం, సహజీవనం వంటి అంశాలపై ఉమ్మడి చట్టాన్ని ఆమోదించిన మొదటి రాష్ట్రంగా ఉత్తరాఖండ్ నమోదైంది. ఆధార్ ప్రాతిపదికన వెరిఫికేషన్, కృత్రిమ మేథస్సు (ఎఐ) ప్రాతిపదికన 22 భారతీయ భాషల్లో అనువాద సర్వీసులు పోర్టల్ ద్వారా అందజేయబడతాయి. మరణవాంగ్మూలం లేని వారసత్వం కోసం చట్టబద్ధమైన వారసులను ప్రకటించేందుకు, వీలునామా రిజిస్ట్రేషన్‌కు, అప్పీళ్లకు సంబంధించిన డేటా, సమాచారం ఈ పోర్టల్‌లో అందుబాటులో వుంటుంది.

రూ.9 లక్షల కోట్ల సంపద ఉఫ్ !



ముంబయి : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆంక్షలతో, అనాలోచిత నిర్ణయాలతో ఇప్పటికే బెంబేలిత్తిపోయిన భారత మదుపర్లు తాజాగా కేంద్ర బడ్జెట్‌లో కూడా పెద్ద ఊరడింపులేమీ ఉండవన్న సంకేతాలతో భయాందోళనలకు గురయ్యారు. దీంతో దేశీయ స్టాక్ మార్కెట్లపై సెంటిమెంట్ భారీగా సన్నగిల్లుతోంది. ఇప్పటికే వరుస నష్టాలు చవిచూసిన ఇన్వెస్టర్లు సోమవారం మరోమారు దెబ్బతిన్నారు. సోమవారం సెషన్‌లో కుప్పకూలిన మార్కెట్లతో ఒక్క పూటలోనే మదుపర్ల సంపద రూ.9 లక్షల కోట్లు పైగా హరించుకుపోయింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ 900 పాయింట్లు పైగా కోల్పోగా.. నిఫ్టీ 23వేల దిగువకు పడిపోయింది. బిఎస్‌ఇ సెన్సెక్స్ తుదకు 824 పాయింట్లు లేదా 1.08 శాతం పతనంతో 75,366కు దిగజారింది. అదే బాటలో ఎన్‌ఎస్‌ఇ నిఫ్టీ 263 పాయింట్లు లేదా 1.14 శాతం నష్టంతో 22,829 వద్ద ముగిసింది. బిఎస్‌ఇలో లిస్టెడ్ కంపెనీల మార్కెట్ కాపిటలైజేషన్ రూ.9.43 లక్షల కోట్లు తుడుచుకు పెట్టుకుపోయి రూ.410.08 లక్షల కోట్లకు పరిమితమయ్యింది. దీంతో అమ్మకాల ఒత్తిడితో వరుసగా రెండో సెషన్‌లోనూ దలాల్ స్ట్రీట్ పతనాన్ని చవి చూసినట్లయ్యింది.

ప్రతికూలాంశాలు..

అమెరికా వాణిజ్య విధానంపై అనిశ్చితి, భారత ఆర్థిక వ్యవస్థలో బలహీన సంకేతాలు మదుపర్లను తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నాయి. సెప్టెంబర్ త్రైమాసికంలో జిడిపి 5.4 శాతానికి పరిమితమై.. దాదాపు రెండేళ్ల కనిష్టానికి పడిపోయింది. డిసెంబర్ త్రైమాసికంలో అదే పరిస్థితి చోటు చేసుకోవచ్చనే భయాలు ఇన్వెస్టర్లను వెంటాడుతున్నాయి. ఇదే సమయంలో కార్పొరేట్ కంపెనీల ఆర్థిక ఫలితాలు అంచనాలను చేరకపోవడం సెంటిమెంట్‌ను దెబ్బ తీశాయి. విదేశీ సంస్థాగత మదుపర్లు తమ భారత ఈక్విటీలను వరుసగా విక్రయిస్తున్నారు. జనవరి 24 నాటికి రూ.64,156 కోట్లు విలువ చేసే షేర్లను ఉపసంహరించుకున్నారు. మరోవైపు డాలర్‌తో రూపాయి మారకం విలువ మరో 11 పైసలు కోల్పోయి 86.33 కనిష్ట స్థాయి వద్ద నమోదయ్యింది. భారత్‌పై ట్రంప్ టారీఫ్‌ల పెంపు భయాలు మార్కెట్లను వెంటాడుతున్నాయి. బుధవారం యుఎస్ ఫెడ్ వడ్డీ రేట్ల ప్రకటన నేపథ్యంలోనూ మదుపర్లు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. వీటికి తోడు ప్రధానంగా ఫిబ్రవరి 1న మోడీ సర్కార్ ప్రవేశపెట్టనున్న కేంద్ర బడ్జెట్‌పై కూడా మదుపర్లకు పెద్దగా ఆశల్లేకపోవడం మార్కెట్లలో నిరాసక్తతకు కారణమని నిపుణులు అంచనా వేస్తున్నారు.

విఒఎల పోరుబాట

- కలెక్టరేట్ల వద్ద దీక్షలు ప్రారంభం

2



అనకాపల్లి కలెక్టరేట్ వద్ద దీక్షలు చేపట్టిన విఒఎలు

ఫిబ్రవరి నుంచి కొత్త రిజిస్ట్రేషన్ విలువలు

- రాజధాని ప్రాంతానికి మినహాయింపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో కొత్త రిజిస్ట్రేషన్ విలువలు ఫిబ్రవరి ఒకటి నుంచి అమల్లోకి వస్తాయని రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖల మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. సచివాలయంలోని తన కార్యాలయంలో విలేకరులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. రాజధాని గ్రామాల్లో మాత్రం ఎలాంటి మార్పు ఉండదన్నారు. రాష్ట్రంలో గ్రోత్ సెంటర్లుగా ఉండి, మార్కెట్ విలువ 10 రెట్లు అదనంగా ఉన్న ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్ విలువలు పెరిగాయని చెప్పారు. కొన్ని ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్ విలువలు అక్కడి మార్కెట్ విలువల కన్నా ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. ఇటువంటి ప్రాంతాల్లో తగ్గుతాయని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో తహశీల్దార్లను అడ్డం పెట్టుకుని పెద్ద యెత్తున భూ ఆక్రమణలకు పాల్పడ్డారని విమర్శిం చారు. పేదల భూములను అక్రమ పద్ధతుల్లో స్వాధీనం చేసుకున్న వారందరినీ వదిలే ప్రసక్తే లేదని హెచ్చ రించారు. భూ వివాదాలకు సంబంధించి సమగ్రంగా అధ్యయనం చేసేందుకు 22ఎ భూములు, 596 జిఓలతో పాటు మరో నాలుగు అంశాలపై కలెక్టర్లతో కమిటీలను ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. ప్రజలకు ఇచ్చిన హామీలపై కూటమి ప్రభుత్వం వెనక్కి తగ్గడం లేదన్నారు.

ఉపాధికి నిధుల కొరత

- 2024-25లో అదనపు కేటాయింపులు నిల్
- పేరుకుపోతున్న వేతన బకాయిలు
- మెటీరియల్ ఖర్చులోనూ వాటా చెల్లించని కేంద్రం



న్యూఢిల్లీ : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని తీవ్రమైన నిధుల కొరత వెంటాడుతోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ పథకానికి ఎలాంటి అదనపు కేటాయింపులు జరపలేదు. ఫలితంగా కార్మికులకు వేతనాల చెల్లింపులో అసాధారణ జాప్యం జరుగుతోంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఈ పథకం కింద వేతనాల కోసం రూ.4,315 కోట్లు ఇవ్వాల్సి ఉంది. అందుకోసం నిధుల బదలాయిస్తూ ఆదేశాలు (ఎఫ్‌టిఒ) జారీ చేశారు. ఉపాధి హామీ చట్టంలోని సెక్షన్ 3 (3) ప్రకారం దినసరి వేతనాలను వారానికి ఒకసారి చొప్పున అందజేయాల్సి ఉంటుంది. ఒకవేళ ఆలస్యమైనా పని పూర్తయిన తర్వాత పక్షం రోజులు దాటకూడదు.

ఉపాధి పథకానికి మెటీరియల్ రూపంలో కేంద్రం తన వాటాగా రూ.5,715 కోట్లు బకాయి పడింది. పనుల కోసం ఉపయోగించే సామగ్రి కొనుగోలుకయ్యే వ్యయంలో కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40 శాతం భరించాల్సి ఉంటుంది. కేంద్రం తన వాటాను విడుదల చేయడంలో జాప్యం కారణంగా భవిష్యత్ ప్రాజెక్టులపై ప్రభావం పడుతోంది. మెటీరియల్ ఖర్చును చెల్లించడంలో జరుగుతున్న నిరంతర జాప్యం ఫలితంగా ముడి సరుకును సరఫరా చేసే స్థానిక వ్యాపారులు విముఖత చూపుతున్నారు. దీంతో పనులకు అంతరాయం ఏర్పడుతోంది.

2024 మధ్యంతర బడ్జెట్‌లో ఉపాధి పథకానికి ప్రభుత్వం రూ.86,000 కోట్లు కేటాయించింది. లోటు కన్పిస్తున్నప్పటికీ ఆర్థిక మంత్రిత్వశాఖ బడ్జెట్‌ను సవరించలేదు. గ్రామీణాభివృద్ధి శాఖ నుండి పలు విజ్ఞాపనలు వచ్చినప్పటికీ ఆర్థికశాఖ పట్టించుకోలేదు. పథకానికి తక్కువ నిధులు కేటాయించడంపై గత సంవత్సరం విమర్శలు చెలరేగడంతో ప్రభుత్వం స్పందిస్తూ ఇది డిమాండ్‌ను బట్టి నడిచే పథకమని, అవసరమైనప్పుడు అదనపు కేటాయింపులు జరుపుతామని తెలిపింది. ఉదాహరణకు 2020-21 ఆర్థిక సంవత్సరంలో... అంటే కోవిడ్ సమయంలో కార్మికులు పెద్ద సంఖ్యలో నగరాల నుండి స్వస్థలాల బాట పట్టారు. ఆ సమయంలో ప్రభుత్వం పథకానికి కేటాయింపును రూ.61,500 కోట్ల నుండి రూ.1,11,500 కోట్లకు పెంచింది. ఆ తరువాత భారీగా కోత పెట్టింది. బడ్జెటరీ కేటాయింపులు తక్కువగా ఉండడంతో కృత్రిమంగా డిమాండ్ తగ్గుతోందని పథకాన్ని నిశితంగా పరిశీలిస్తున్న నిపుణులు, హక్కుల కార్యకర్తలు అభిప్రాయపడ్డారు. గ్రామీణాభివృద్ధిపై ఏర్పాటు చేసిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ గత సంవత్సరం ఫిబ్రవరిలో సమర్పించిన నివేదికలో ఉపాధి హామీకి నిధుల కొరత అంశాన్ని ప్రస్తావించింది. వేతనాలను, మెటీరియల్ వ్యయంలో వాటాను సకాలంలో విడుదల చేయకపోవడంతో ఉపాధి హామీ పనులు మందగించాయి.

వైఎస్ జగన్‌కు ఊరట

- బెయిల్ రద్దు పిటిషన్ కొట్టేసిన సుప్రీం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సుప్రీంకోర్టులో ఊరట లభించింది. జగన్ బెయిలు రద్దు చేయాలని, కేసుల విచారణను ఇతర రాష్ట్రాలకు బదిలీ చేయాలని కోరుతూ శాసన సభ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణ రాజు వేసిన పిటిషన్‌ను జస్టిస్ బివి నాగరత్న, జస్టిస్ సతీష్ చంద్రశర్మతో కూడిన సుప్రీం ద్విసభ్య ధర్మాసనం సోమవారం కొట్టేసింది. జగన్ బెయిల్ రద్దుకు కారణాలేవీ లేవని, కాబట్టి రద్దు చేయాల్సిన అవసరం లేదని ధర్మాసనం తేల్చి చెప్పింది. అలాగే కేసులను మరో రాష్ట్రానికి బదిలీ చేయలేమని కూడా చెప్పింది. ఇప్పటికే విచారణ జరుగుతున్నందున ఇప్పుడు వేరే రాష్ట్రానికి మార్చాల్సిన అవసరం లేదని పేర్కొంది. బెయిల్ రద్దు పిటిషన్ విషయంలో పిటిషన్ ఉపసంహరించుకుంటారా? లేదా డిస్మిస్ చేయాలా? అని రఘురామ కృష్ణరాజు తరపున న్యాయవాది బాలాజీ శ్రీనివాసన్‌ను ప్రశ్నించింది. అందుకు బాలాజీ శ్రీనివాసన్ డిస్మిస్ చేయొద్దని, హైకోర్టుకు వెళ్లేందుకు అవకాశం ఇవ్వాలని కోరారు. అందుకు సుప్రీంకోర్టు ధర్మాసనం స్పందిస్తూ తాము హైకోర్టుకు వెళ్లేందుకు అవకాశం ఇవ్వలేమని పేర్కొంటూ, పిటిషన్ ఉపసంహరించుకుంటారా? లేదా డిస్మిస్ చేయాలా? అని మరోసారి అడిగింది. దీంతో పిటిషన్‌ను ఉపసంహరించుకుంటున్నామని చెప్పారు. జగన్ తరపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించారు.

సులభతర వాణిజ్యంలో మొదటి స్థానమే లక్ష్యం

- అధికారులకు సిఎస్ ఆదేశం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



సులభతర వాణిజ్యంలో రాష్ట్రాన్ని మొదటి స్థానంలో నిలిపేందుకు కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ తెలిపారు. గత పదేళ్లలో ఎక్కువసార్లు దేశంలో ఎపి మొదటి స్థానంలో ఉందని, దాన్ని నిలబెట్టుకోవాలని సూచించారు. రాష్ట్రంలో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌పై సోమవారం రాష్ట్ర సచివాలయంలో సంబంధిత శాఖల అధికారులతో సిఎస్ సమీక్షించారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అనేది ప్రపంచ బ్యాంకు గ్రూప్ స్థాపించిన ర్యాంకింగ్ వ్యవస్థ అని తెలిపారు. బిజినెస్ రిఫార్మ్స్ యాక్షన్ ప్లాను (బిఆర్‌ఎపి)-2024కు సంబంధించి ఫిబ్రవరి 15 తుది గడువని, ఆలోపు అన్ని విభాగాలు కార్యాచరణ పూర్తి చేయాలని చెప్పారు. రాష్ట్ర వాణిజ్య పరిశ్రమలశాఖ కార్యదర్శి ఎన్ యువరాజ్ బిఆర్‌ఎపి 2024కు సంబంధించిన పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. 28 శాఖలకు చెందిన 58 అంశాల్లో 435 రిఫార్మ్స్‌కు చర్యలు తీసుకోవాల్సి ఉందని అన్నారు.

ఎపిఐఐసి విసి అండ్ ఎమ్‌డి అభిషిక్త్ కిషోర్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల శాఖ ఐజి హరినారాయణ, న్యాయశాఖ కార్యదర్శి వి సునీత పాల్గొన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు సిసోడియా, అనంతరాము, వాణిప్రసాద్, ముఖ్య కార్యదర్శులు సురేష్‌కుమార్, శశిభూషణ్‌కుమార్ తదితరులు వర్చువల్‌గా పాల్గొన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడు తున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

సచివాలయ వ్యవస్థ నిర్వీర్యానికి కుట్ర

- వైసిపి అధికార ప్రతినిధి శివశంకర్‌రెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సచివాలయాల రేషనలైజేషన్ నిర్ణయంతో వ్యవస్థను నిర్వీర్యం చేసే కుట్ర చేస్తున్నారని వైసిపి అధికార ప్రతినిధి పుత్తా శివశంకర్‌రెడ్డి ఆరోపించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు.

ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని కోరారు. వలంటీర్లకు ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం వారి వేతనాలు పెంచడంతోపాటు జూన్ నుండి పెండింగ్ వేతనాలను అందించాలని కోరారు. పంచాయతీరాజ్‌శాఖలో రహస్య జిఒలు విడుదల చేస్తున్నారని వైసిపి అధికార ప్రతినిధి నాగార్జున యాదవ్ విమర్శించారు. రహస్య జిఒలన్నీ కాంట్రాక్టర్లకు పనులు అప్పజెప్పేవి, కన్సల్టెన్సీలకు బిల్లులు చెల్లించేవే ఉన్నాయని అన్నారు. ప్రతిపక్షంలో ఉండగా నీతులు చెప్పిన చంద్రబాబు... ఏడు నెలల్లో 78 రహస్య జిఒలు విడుదల చేశారని పేర్కొన్నారు.

విఒఎల పోరుబాట

- కాలపరిమితి రద్దు చేయాలి
- పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలి
- జిల్లా కలెక్టరేట్ల వద్ద మూడురోజుల దీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి - యంత్రాంగం

ఏడు నెలల బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని, మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలని, టిడిపి కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఎపి వెలుగు యానిమేటర్స్ (విఒఎ) ఉద్యోగుల సంఘం, సిఐటియు ఆధ్వర్యాన సోమవారం రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో కలెక్టరేట్ల ఎదుట విఒఎలు మూడు రోజుల దీక్షలను ప్రారంభించారు. విఒఎల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. వేతన బకాయిలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఎన్నికల హామీలను అమలు చేయాలని నినదించారు.

విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిరాహార దీక్షలు నిర్వహించారు. అనకాపల్లి కలెక్టరేట్ వద్ద చేపట్టిన సామూహిక దీక్షలను ఉద్దేశించి సంఘం రాష్ట్ర అధ్యక్షులు అధ్యక్షులు సిహెచ్.రూపాదేవి మాట్లాడారు. ఆరు నెలల వేతన బకాయిలు చెల్లించాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గత నెల 16న సెర్ప్ సిఇఒతో జరిగిన చర్చల్లో సంక్రాంతి ముందే వేతన బకాయి చెల్లిస్తామని హామీనిచ్చినా అమలుకు నోచుకోలేదన్నారు. నెలాఖరులోగా సమస్యలను పరిష్కరించకుంటే వచ్చే నెల ఒకటో తేదీ నుంచి పనులన్నీ నిలుపుదల చేస్తామని హెచ్చరించారు.

తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్ బొమ్మూరులోని కలెక్టరేట్ వద్ద నిరసన దీక్షలు చేపట్టారు. గుంటూరు కలెక్టరేట్ వద్ద దీక్షలను యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు దండా లక్ష్మీనారాయణ, పల్నాడు జిల్లా నరసరావుపేటలో సిఐటియు పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు గుంటూరు విజయకుమార్ ప్రారంభించి ప్రసంగించారు. విజయవాడ కలెక్టరేట్ ఎదుట ధర్నా, అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ లక్ష్మీ శకు అందజేశారు. దీనిపై కలెక్టర్ మాట్లాడుతూ.. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. కృష్ణా జిల్లా బందరు కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో కలెక్టరేట్‌కు వెళ్లే మార్గంలో విస్సాకోడేరు వంతెన దిగువ ప్రాంతంలో చేపట్టిన నిరాహార దీక్షలను సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ డి.కళ్యాణి ప్రారంభించి మాట్లాడారు. ప్రకాశం జిల్లా కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియాకు వినతిపత్రం అందించారు. పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టరేట్ వద్ద చేపట్టిన దీక్షలను సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు ప్రారంభించారు. శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట దీక్షలు చేపట్టారు.



తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం కలెక్టరేట్ వద్ద నిరసన దీక్ష చేస్తున్న విఒఎలు

మున్సిపాలిటీల్లో చైర్మన్, వైస్ చైర్మన్ల ఎన్నికకు నోటిఫికేషన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో పలు మున్సిపాలిటీల్లో ఖాళీగా ఉన్న చైర్మన్లు, వైస్ చైర్మన్ల ఎంపికకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్ని సోమవారం నోటిఫికేషన్ జారీ చేశారు. ఎన్నికకు సంబంధించి ఈ నెల 30, ఫిబ్రవరి మూడో తేదీల్లో ఎంపిక చేయాల్సిన స్థానిక సంస్థల్లో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేయాలని ఆయా జిల్లాల కలెక్టర్లు, ఇతర అధికారులను ఆదేశించారు. ఎన్‌టిఆర్ జిల్లాలోని నందిగామ, సత్యసాయి జిల్లాలోని హిందూపురం, పార్వతీపురం మన్యం జిల్లాలోని పాలకొండ మున్సిపాలిటీలకు చైర్మన్లను ఎన్నుకోవాల్సి ఉంది. నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెంలో ఇద్దరు చైర్మన్లు, ఏలూరు జిల్లా నూజివీడు, కాకినాడ జిల్లా తుని, పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో వైస్ చైర్మన్లను ఎన్నుకోవాల్సి ఉంది.

8 పర్యాటక ప్రాజెక్టులకు ఒప్పందాలు

- ప్రాంతీయ పర్యాటక పెట్టుబడిదారుల సదస్సులో మంత్రి దుర్గేష్
- గిరిజన చట్టాలను సవరించాలన్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు



సదస్సులో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

పర్యాటక రంగంలో సింగిల్ విండో ద్వారా అనుమతులు జారీ చేస్తామని, ఇన్వెస్టర్లకు అన్ని విధాలుగా సహకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. టూరిజం అభివృద్ధికి 1/70 వంటి గిరిజన చట్టాలను సవరించాలని రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు గిరిజన వ్యతిరేక ప్రతిపాదన చేశారు. ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో విశాఖపట్నం వేదికగా నిర్వహిస్తున్న రెండో ప్రాంతీయ పర్యాటక పెట్టుబడిదారుల సదస్సు బీచ్ రోడ్డులోని నోవాటెల్ హోటల్‌లో సోమవారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ.. సదస్సులో రూ.1,217 కోట్ల విలువైన ఎనిమిది పర్యాటక ప్రాజెక్టుల ఎంఒయులపై సంతకాలు జరిగాయన్నారు. ఈ ప్రాజెక్టుల ద్వారా విశాఖపట్నం, తిరుపతి, అమరావతి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో 825 టూరిజం రూమ్‌ల ఏర్పాటుకు ఇన్వెస్టర్లు ముందుకు వచ్చారని తెలిపారు. తద్వారా 2,567 ఉద్యోగాలు కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. పరిశ్రమ రంగానికిచ్చే రాయితీలు పర్యాటక రంగానికి ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ నెల 31 నుంచి ఫిబ్రవరి రెండు వరకూ జరిగే అరకు ఫెస్టివల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు.

పెట్టుబడిదారులకు ఆటంకం లేకుండా చూడాలి

స్పీకర్ సిహెచ్.అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ, గిరిజన ప్రాంతాల్లో గిరిజనేతరులు పెట్టుబడులు పెట్టేందుకు 1/70 చట్ట ప్రకారం ఆటంకంగా ఉందని, పెట్టుబడులు ముందుకు రావడం లేదని అన్నారు. 1/70 చట్టంలో మార్పులు తీసుకురావాల్సి వస్తే, అందుకు అధికారులు సంబంధిత చట్టంపై అధ్యయనం చేయాలని సూచించారు. పర్యాటక ప్రాంతాల్లో పెట్టుబడులు పెట్టే వారికి ఆటంకాలు లేకుండా చూడాలన్నారు. లంబసింగిని, పాడేరు అమ్మవారి దేవాలయాన్ని, స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు పార్కును, పురాతన బొజ్జన్న కొండను మరింత అభివృద్ధి చేయాల్సిఉందని తెలిపారు. 150 మందికిపైగా ఇన్వెస్టర్లు హాజరైన ఈ సదస్సులో టూరిజం ఎండి ఆమ్రపాలి, స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్‌జైన్, ఉత్తరాంధ్ర జిల్లాల కలెక్టర్లు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. గిరిజన చట్టాలను భారత రాష్ట్రపతి అనుమతి లేనిదే మార్చడం సాధ్యం కాదని, కొత్త సమస్యలు తలెత్తుతాయని కొందరు అధికారుల మధ్య చర్చ జరిగింది.

'యువగళం' హామీలు నిలబెట్టుకుంటా

- విశాఖ ఉక్కు ప్రైవేటు కానివ్వం
- మంత్రి నారా లోకేష్

ప్రజాశక్తి- కలెక్టరేట్ (విశాఖపట్నం)

యువగళం పాదయాత్రలో తానిచ్చిన ప్రతి హామీనీ నిలబెట్టుకుంటానని రాష్ట్ర ఐటి, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ అన్నారు. 'సాక్షి' పత్రికపై వేసిన పంష్టం కేసులో సోమవారం విశాఖ కోర్టుకు ఆయన హాజరయ్యారు. ఆ పత్రిక తరపు న్యాయవాది వ్యక్తిగత కారణాలతో కోర్టుకు హాజరు కాకపోవడంతో కేసు విచారణ ఫిబ్రవరి 28కి వాయిదా పడింది. కోర్టు బయట మీడియాతో లోకేష్ మాట్లాడుతూ స్థిరమైన ప్రభుత్వం వల్లే పెట్టుబడులు వస్తున్నాయన్నారు. చట్టాన్ని ఉల్లంఘించిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ఐదేళ్లలో విశాఖలో ఐదు లక్షల మందికి ఐటి ఉద్యోగాలు రానున్నాయన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ జరగనివ్వబోమనే హామీకి కట్టుబడి ఉన్నామన్నారు. 'సాక్షి' పత్రికపై పరువు నష్టం కేసులో ఆలస్యమైనా నిజం గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. తల్లి, చెల్లిపైనే జగన్‌కు నమ్మకం లేదని, అటువంటి వ్యక్తికి పార్టీ నాయకులపై ఏం నమ్మకం ఉంటుందని అన్నారు. వైసిపికి ఒక్కొక్కరు రాజీనామా చేస్తున్నారని పేర్కొన్నారు. చట్టాన్ని ఉల్లంఘించిన నేతలను, అధికారులను వదిలిపెట్టేది లేదని, దర్యాప్తు జరుగుతోందని తెలిపారు. కాకినాడ పోర్టును అడ్డగోలుగా, తుపాకీ పెట్టి లాక్కున్నారని, రూపాయిని ఆరు పైసలు పెట్టి విజయసాయిరెడ్డి కొట్టేశారని ఆరోపించారు. అందుకే కేసు పెట్టామన్నారు. దీనిపై ఇడి విచారిస్తోందని తెలిపారు. విశాఖలో భూ కబ్జాలపైనా చర్యలు తీసుకుంటామని ఒక ప్రశ్నకు బదులుగా చెప్పారు.

కేప్టివ్ మైన్స్ అర్థంలేని వాదన

దేశంలో అనేక ఉక్కు పరిశ్రమలు ప్రైవేటీకరణ జరుగుతుంటే విశాఖ ఉక్కును కాపాడుకోగలిగామని లోకేష్ అన్నారు. ఏడు నెలల్లో స్టెబిలిటీ కోసం రూ.1,600 కోట్లు ఖర్చు పెట్టామని, ఇప్పుడు కేంద్రం నుంచి రూ.11 వేల కోట్ల నిధులు తీసుకొచ్చామని, రాష్ట్రం నుంచి రూ.2,500 కోట్లు ఇస్తున్నామన్నారు. దేశం కోసం మనం తిరిగి ఇవ్వాల్సిన అవసరం ఉందని, ఇదంతా ఈక్విటీ రూపంలో వస్తుందని తెలిపారు. కేప్టివ్ మైన్స్ అర్థంలేని వాదనని, కేప్టివ్ మైన్స్ లేకుండానే ఎన్‌ఎండిసితో టై అప్ అయి ఆర్సెలార్ మిట్టల్ పెట్టుబడులు పెడుతోందని ఒక ప్రశ్నకు బదులుగా చెప్పారు. విశాఖ ఉక్కును లాభాల్లోకి తీసుకొస్తామన్నారు.

తాను హైదరాబాద్‌లో ఇల్లు కట్టుకున్నప్పుడు విశాఖ స్టీల్‌నే వాడానని, ఇప్పుడు అమరావతిలో కూడా విశాఖ స్టీల్‌నే వినియోగిస్తామని తెలిపారు. విద్యార్థులను ఇబ్బంది పెట్టే కాలేజీ యాజమాన్యాలపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజల కోసం మూడు నెలల్లో రుషికొండ భవనాలను ఓపెన్ చేస్తామని, విద్యా దీవెన విషయంలో పిల్లలకు ఎలాంటి ఇబ్బందీ లేదని, నేరుగా కాలేజీల యాజమాన్యాలకే నిధులు చెల్లిస్తామని అన్నారు. కేంద్రం నుంచి నిధులు రావాల్సి ఉందని తెలిపారు.



విశాఖ కోర్టుకు హాజరైన నారా లోకేష్



కానిస్టేబుల్ అభ్యర్థుల ఆశలపై సర్కారు నీళ్లు

- ప్రిలిమ్స్ అర్హత సాధించినా..ఫిజికల్ టెస్ట్‌కు తిరస్కరణ
- న్యాయం చేయాలని డివైఎఫ్ఐ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కానిస్టేబుల్ నియామక ప్రక్రియలో ప్రిలిమ్స్ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థుల ఆశలపై రాష్ట్ర ప్రభుత్వం నీళ్లు కుమ్మరించింది. ప్రభుత్వ స్వీయ తప్పిదాలతో కాలయాపన కారణంగా ప్రిలిమ్స్ ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థుల్లో కొందరి వయస్సు పెరిగిపోవడంతో ఇప్పుడు వారందరినీ ఫిజికల్ పరీక్షలకు హాజరుకాకుండానే తిరస్కరిస్తున్నారు. ప్రభుత్వం చేసిన తప్పిదాలకు తమను శిక్షించడమేంటని అభ్యర్థులు నిలదీస్తున్నారు. ప్రిలిమ్స్‌లో అర్హత సాధించిన అందరికీ న్యాయం చేయాలని, ఫిజికల్ పరీక్షలకు అనుమతించాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) విన్నవించింది. ఇదే డిమాండ్‌తో కానిస్టేబుల్ అభ్యర్థులతో కలిసి విజయవాడలోని ధర్నాచౌక్‌లో డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి రామన్న, అధ్యక్షులు వై రాము మాట్లాడుతూ రెండేళ్లు పరీక్షలు నిర్వహించని ప్రభుత్వం ఇప్పుడు వయసు పైబడిందన్న కారణంతో ప్రిలిమ్స్‌లో అర్హత సాధించినవారిని ఫిజికల్ పరీక్షలకు అనుమతించకుండా తిరస్కరించడం అన్యాయమన్నారు. 2022లో విడుదల చేసిన 6,100 పోస్టుల కానిస్టేబుల్ నియామక పరీక్షలో 95,208 మంది అభ్యర్థులు అర్హత సాధించారని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికలు, కోర్టు కేసుల వల్ల రెండేళ్ల నుంచి ప్రభుత్వం భౌతిక పరీక్షలను వాయిదా వేస్తూవచ్చిందన్నారు. దీంతో కొందరికి వయో కారణంగా అనర్హులంటూ తిరస్కరించడరం సరికాదన్నారు. ప్రిలిమ్స్‌లో అర్హత సాధించిన అభ్యర్థులందరినీ భౌతిక పరీక్షలకు అనుమతించాలని, వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

హోంగార్డు రిజర్వేషన్లు తగ్గించి నిరుద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పోలీస్ శాఖలో 20 వేల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వీటిని భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే భౌతిక పరీక్షలో మృతి చెందిన అభ్యర్థుల కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి కృష్ణ, ఎన్ నాగేశ్వరరావు, నాయకులు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బాలానందన్ స్ఫూర్తితో సరళీకరణ విధానాలపై పోరు

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

సిఐటియు అఖిల భారత మాజీ అధ్యక్షులు ఇ.బాలానందన్ స్ఫూర్తితో సరళీకరణ విధానాలకు వ్యతిరేకంగా పోరాడతామని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు అన్నారు. బాలానందన్ శత జయంతి సభ జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో జరిగింది. ముందుగా ఆయన చిత్రపటానికి నర్సింగరావు, విశాఖ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కెఎం.శ్రీనివాస్, ఆర్‌కెఎస్‌వి.కుమార్‌లు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నర్సింగరావు మాట్లాడుతూ.. బాలానందన్ తన జీవితాన్ని మొత్తం కార్మిక వర్గ ప్రయోజనాల కోసమే అంకితం చేశారని కొనియాడారు. కార్మిక హక్కుల కోసం అలుపెరగని పోరాటం చేశారన్నారు. సిద్ధాంత వక్రీకరణ పట్ల ఏమాత్రం సడలింపులకూ రాజీపడని పోరాట యోధుడని అన్నారు. వ్యవస్థ మార్పునకు, కార్మిక వర్గ రాజ్య స్థాపనకు కడదాకా పోరాడారని కొనియాడారు. ఎమర్జెన్సీ కాలంలో ప్రభుత్వ నిరంకుశ నిర్బంధాన్ని ఎదుర్కొని అనేక పోరాటాలు నిర్వహించారన్నారు. ఆరు నెలల పాటు జైలు శిక్షను అనుభవించారని గుర్తు చేశారు. విద్యుత్, బిఎస్‌ఎన్‌ఎల్ కార్మికులను ఐక్యం చేసి వారి సంఘాలను ఏర్పాటు చేయడంలో కీలక పాత్ర పోషించారన్నారు. నేడు ప్రయివేటీకరణ విధానాలు శరవేగంగా అమలు జరుగుతున్న తరుణంలో ఆయన స్ఫూర్తితో కార్మికవర్గాన్ని ఐక్యం చేసి మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. బాలానందన్ కేరళ అసెంబ్లీ సభ్యునిగా, ఎంపిగా మంచి పాలన సాగించారన్నారు. కార్మిక చట్టాలను యాజమాన్యాలకు అనుకూలంగా మార్చేసి లేబర్ కోడ్స్‌ను తీసుకురావడానికి ప్రయత్నిస్తోన్న మోడీ సర్కారును తీవ్రంగా వ్యతిరేకించాలని కోరారు. లేబర్ కోడ్స్ రద్దు కోసం ఫిబ్రవరి ఐదున జరిగే ప్రదర్శనలో కార్మిక వర్గం పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఎస్.జ్యోతీశ్వరరావు, బి.జగన్, పి.మణి, అప్పలరాజు, ఎం.సుబ్బారావు, కెఎం.కుమారమంగళం, వై.రాజు, టి.నూకరాజు, పి.వెంకటరావు, రామస్వామి పాల్గొన్నారు.




బాలానందన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నర్సింగరావు తదితరులు

ప్రతి ఇంటిలో ఎఐ నిపుణులు

- ఆర్‌టిజిఎస్ పమీక్షలో సిఎం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



ప్రతి ఇంటిలోనూ ఒక ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఎఐ) నిపుణులుఉండాలనేది ప్రభుత్వ ఆశయమని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. రాష్ట్ర సచివాయలంలో ఆర్‌టిజిఎస్‌పై సోమవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి కుటుంబలోనూ ఎఐని వినియోగించుకునే విధంగా ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. ఒకప్పుడు ఐటిని సొంతం చేసుకున్నామని, ప్రభుత్వంలో టెక్నాలజీని ఉపయోగించుకోవడం వల్ల పని మెరుగవుతుందని, మరిన్ని సేవలు అందించగలుగుతామని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు ఏ విధంగా చేరుతున్నాయి, ఎక్కడైనా లోపాలున్నాయా, ఉంటే ఎందుకున్నాయనే అంశాలను రియల్‌టైమ్‌లో విశ్లేషించాలని తెలిపారు. 15 నుండి 20 శాతం వృద్ధి లక్ష్యంగా ప్రభుత్వ శాఖలన్నీ పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ శాఖలు తమ డేటాను ఆర్‌టిజిఎస్‌తో అనుసంధానం చేస్తే దాన్ని ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ద్వారా విశ్లేషించి ఆయా ప్రభుత్వ శాఖల్లో అమలు చేయదగ్గ విషయాలను గూగూల్ సంస్థ సూచిస్తుందని తెలిపారు. దీనికోసం ఇప్పటికే గూగుల్‌తో ఒప్పందం చేసుకున్నట్లు వివరించారు. వాట్సాప్ గవర్నెన్స్ సేవలు త్వరలో ప్రారంభించనున్నామని చెప్పారు.

జనన మరణ ధృవీకరణ పత్రాలు కూడా వాట్సాప్ ద్వారా పౌరులు పొందేందుకు సదుపాయం కల్పించాలన్నారు. అయితే ఈ సర్టిఫికెట్ల జారీ ద్వారా ఎలాంటి అపోహలకు విమర్శలకు తావివ్వకుండా పకడ్బందీగా చేయాలన్నారు. ఆర్‌టిజిఎస్ ముఖ్యకార్యనిర్వహణాధికారి కె.దినేష్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వశాఖల డేటాను అనుసంధానం చేసే ప్రక్రియ వేగవంతం చేస్తున్నట్లు చెప్పారు. సేకరించిన డేటా ఆధారంగా ప్రతిగ్రామానికి ఒక ప్రత్యేక ప్రొఫైల్ రూపొందిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వంలో 40 శాఖలకు సంబంధించి వివిధ శాఖాధిపతులు, విభాగాధిపతుల వద్ద ఉన్న డేటాను సేకరించి అనుసంధానిస్తామని అన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ డేటాలో లేకుండా ఉన్న పౌరులకు సంబంధించిన వివరాలనూ సేకరించామని చెప్పారు. 2024 సెప్టెంబరులో రాష్ట్రంలో 1,67,63,812 గృహాలుంటే ఉంటే ఆ సంఖ్య జనవరి 2025 నాటికి 1,69,63,228కి పెరిగిందని చెప్పారు. రాష్ట్ర జనాభా సెప్టెంబరు 2024 నాటికి 4,90,83,312 మంది ఉంటే, జనవరి 2025 నాటికి 5,12,45,147కు చేరిందని చెప్పారు. 24 లక్షల మంది రాష్ట్రంలోనే ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతానికి వలస వెళ్లారని అలాంటి వారి డేటాను సేకరించి వారికి స్థానికంగా అనుసంధానం చేస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలో 1.69 కోట్ల కుటుంబాలకుగాను 1.63 కోట్ల కుటుంబాలను జియో ట్యాగింగ్ చేసినట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, సిఎం కార్యదర్శులు రాజమౌళి, పిఎస్.ప్రద్యుమ్న, రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పి సిసోడియా, వైద్యఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు, పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్, ఆర్‌టిజిఎస్ కార్యదర్శి కాటంనేని భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగాన్ని బలహీనపరిచే కుట్ర

- కార్పొరేట్ విద్య కోసమే ఇంటర్ ఫస్టియర్ పరీక్షల రద్దు
- ఇంటర్మీడియట్ బోర్డు సంస్కరణలపై ఎస్‌ఎఫ్ఐ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇంటర్మీడియట్ విద్యామండలి ఇంటర్ విద్యలో చేసిన ప్రతిపాదనలు కార్పొరేట్ విద్యాసంస్థల వ్యాపార అభివృద్ధికి దోహదపడేవిగా, ప్రభుత్వ విద్యా సంస్థలను బలహీన పరిచేవిధంగా ఉన్నాయని ఎస్‌ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పేర్కొంది. ఈ ప్రతిపాదనలను వ్యతిరేకిస్తున్నట్లు ఇంటర్మీడియట్ విద్యామండలికి మెయిల్ ద్వారా ఎస్‌ఎఫ్ఐ తరపున ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎ అశోక్, కె ప్రసన్నకుమార్ తెలిపారు. రాష్ట్రంలో భౌతిక పరిస్థితికి అనుగుణంగా ప్రతిపాదనలు లేవని పేర్కొన్నారు. సిలబస్‌లో నూతన మార్పులు, విద్యార్థులకు పరీక్షల మనోధైర్యాన్ని నింపేందుకు, శాస్త్రీయతకు అద్దం పట్టేలా ఉండాలని కోరారు. కేంద్రం రూపొందించే సిలబస్ అబద్ధాలు, అశాస్త్రీయతతో నిండిపోతున్న తరుణంలో విద్యార్థుల్లో నైపుణ్యం ఎలా పెరుగుతుందని ప్రశ్నించారు. కర్కిక్యులమ్, బోధనపరమైన అంశాల్లో రాష్ట్రాల నియంత్రణ చాలా ముఖ్యమని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక, సామాజిక స్థితిగతుల నేపథ్యానికి అనుగుణంగా, జాతీయ పరీక్ష పోటీల్లో ముందుండేలా విద్యా విధానాన్ని రూపొందించాలని సూచించారు. సబ్జెక్ట్ కాంబినేషన్ అమలు జరగాలంటే ప్రభుత్వ విద్యాసంస్థలో బోధన సిబ్బంది సరిపడా ఉండాలని, లేదంటే ప్రైవేట్, కార్పొరేట్ సంస్థల్లో విద్యార్థులు చేరే ప్రమాదం ఉందని వివరించారు. ఇంగ్లీష్‌ను పాఠ్యాంశంగా గుర్తించి, మాతృభాషను పాఠ్యాంశంగా గుర్తించకపోవడం దుర్మార్గమన్నారు. మాతృభాషను పాఠ్యాంశంగా తప్పనిసరి చేయాలని కోరారు. పరీక్షల్లో అంతర్గత మార్కులను చూపించి ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యార్థులపై ఒత్తిడి చేస్తారని తెలిపారు. దీంతో ఫీజులను ఇష్టానుసారంగా వసూలు చేయడంతోపాటు పరీక్షల్లో మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడతాయని పేర్కొన్నారు. మొదటి సంవత్సర పరీక్షలు రద్దుకు ప్రతిపాదించడం విద్యార్థులపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుందని తెలిపారు. మార్కులు, ర్యాంకుల మోజులో కార్పొరేట్ సంస్థలు విద్యార్థులపై ఒత్తిడి చేస్తారనే అంశాలను గుర్తించాలని కోరారు. పరీక్షల రద్దు వల్ల విద్యార్థులు చెడు వ్యసనాల బారిన పడే ప్రమాదం ఉందని, ప్రభుత్వ విద్యాసంస్థలు కుదేలవుతాయని పేర్కొన్నారు. పరీక్షలను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీ, తరగతుల సమయాన్ని, సెలవుల్లో తరగతుల నిర్వహణ వంటి వాటిని నియంత్రించి విద్యార్థుల్లో ఒత్తిడి తగ్గించే అంశాలపై దృష్టి సారించాలని కోరారు.

ప్యాకేజీ తాత్కాలిక పరిష్కారమే

- ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి -ఉక్కునగరం (విశాఖపట్నం)



విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు కేంద్రం ప్రకటించిన ప్యాకేజీ తాత్కాలికంగా ఊరటనిచ్చేదే తప్ప శాశ్వత పరిష్కారం కాదని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు సోమవారం నాటికి 1446వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో స్టీల్‌ప్లాంట్ పలు విభాగాలకు చెందిన ఐఎన్‌టియుసి కార్మికులు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఐఎన్‌టియుసి నాయకులు నీరుకొండ రామచంద్రరావు మాట్లాడుతూ.. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు ఇప్పటివరకు వచ్చిన ప్యాకేజీ బ్యాంకు చెల్లింపులకు, ఇతర ఖర్చులకే సరిపోయిందని, స్టీల్‌ప్లాంట్ అభివృద్ధి ఎలా జరుగుతుందని ప్రశ్నించారు. స్టీల్ ప్లాంటును కాపాడడానికి కనీసం రూ.18 వేల కోట్లు కావాలన్నారు. దీంతోపాటు సొంత గనులు కేటాయించడం వల్ల లాభాలు ఆర్జించవచ్చని తెలిపారు. ఇవేవీ లేకుంటే స్టీల్‌ప్లాంట్‌ను ఆర్థికంగా ఎలా కాపాడగలుగుతారని ప్రశ్నించారు. ప్లాంట్ ప్రయివేటీకరణను కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని, కార్మికుల వేతనాలు సక్రమంగా చెల్లించాలని డిమాండ్‌చేశారు.

ఎస్‌పి ఆఫీసు వద్ద మహిళ ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు జిల్లా పోలీసు కార్యాలయంలో ఓ మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. పోలీసుల వివరాల మేరకు.. త్రిపురాంతకంకు చెందిన పేరం సౌభాగ్యమ్మ (55) కు అక్క, ముగ్గురు సోదరులు ఉన్నారు. ముగ్గురు సోదరుల్లో ఒకరు చనిపోగా, ఇంకొకరు గుంటూరులో, మరొకరు త్రిపురాంతకంలో ఉంటున్నారు. సౌభాగ్యమ్మ 15 ఏళ్ల క్రితం తన భర్త నుంచి విడాకులు తీసుకొని త్రిపురాంతకంలో నివసిస్తున్నారు. కూలి పనులకు వెళ్తూ కూడబెట్టిన సొమ్ముతో 2.5 సెంట్ల స్థలాన్ని కొనుగోలు చేశారు. ఇటీవల ఆ స్థలం డాక్యుమెంట్లను తన సోదరుని కుమారుడు దౌర్జన్యంగా లాక్కున్నాడు. ఈ విషయమై త్రిపురాంతకం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోకపోవడంతో ఒంగోలు జిల్లా పోలీస్ కార్యాలయంలో జరిగే గ్రీవెన్స్‌కు ఆమె హాజరయ్యారు. గ్రీవెన్స్‌కు వచ్చిన ఐదు నిమిషాలకే ఎలుకల మందు తిని ఆమె స్పృహ తప్పి పడిపోయారు. పోలీసులు ఆమెను హుటాహుటిన ఒంగోలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తరలించారు. సౌభాగ్యమ్మ ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగా ఉందని జిజిహెచ్ వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా మీడియాతో సౌభాగ్యమ్మ మాట్లాడుతూ.. తాను కష్టపడి దాచుకున్న డబ్బుతో స్థలం కొనుగోలు చేశానని, మేనల్లుడు వాసు ఆ స్థలం డాక్యుమెంట్లు బలవంతంగా తీసుకున్నాడని, స్థలంలోకి వస్తే చంపుతానని బెదిరిస్తున్నాడన్నారని పేర్కొన్నారు. స్థలం డాక్యుమెంట్లు ఇప్పించాలని, తన సోదరుడి కుమారుడి నుంచి ప్రాణహాని ఉందని, వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.







సిపిఎం రాష్ట్ర మహాసభ సందర్భంగా నెల్లూరులో ప్రారంభమైన కళా ప్రదర్శనలు

తమ్మారెడ్డి భరద్వాజను సత్కరిస్తున్న దృశ్యం

కావలిలో ముమ్మరంగా ప్రచారం



కావలిలో ఫ్లెక్సీ బోర్డులను కడుతున్న కార్యకర్తలు




పొదలకూరులో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-కావలి,వెంకటాచలం

సిపిఎం రాష్ట్ర 27వ మహాసభ సందర్భంగా నెల్లూరు జిల్లా కావలి పట్టణంలో ప్రచారం ముమ్మరంగా సాగుతోంది. ప్రధాన కూడళ్లలో ఫ్లెక్సీ బోర్డులను ఏర్పాటు చేశారు. పట్టణంలో కరపత్రాలను పంచుతూ, వాల్ పోస్టర్లను అతికించారు. ఇంటింటికీ తిరుగుతూ మహాసభను జయప్రదం చేయాలని ప్రజలను కోరుతున్నారు. ఫిబ్రవరి మూడో తేదీ వి.ఆర్.కాలేజీ గ్రౌండ్‌లో జరిగే బహిరంగ సభలో సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బృందాకరత్, ఎం.ఎ. బేబీ, బివి రాఘవులు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ గఫూర్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.రమాదేవి, జిల్లా కార్యదర్శి మూలం రమేష్ ప్రసంగిస్తారని, ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి పి. పెంచలయ్య, పట్టణ కమిటీ సభ్యులు వై.కృష్ణమోహన్, బి.కృష్ణయ్య, మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

సిపిఎం రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ పొదలకూరులో వాల్‌పోస్టర్‌ను సిపిఎం నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ సభ్యులు అల్లాడి గోపాల్, కె.పెంచలనరసయ్య మాట్లాడుతూ.. ప్రజాసమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహించే సిపిఎం రాష్ట్ర మహాసభ 47 ఏళ్ల తర్వాత నెల్లూరు నగరంలో జరుగుతున్నాయన్నారు. కార్మికులు, కర్షకులు పాల్గొని మహాసభను జయప్రదం చేయాలని కోరారు. జిల్లా సమగ్రాభివృద్ధి కోసం పాదయాత్రలు చేశామని, సోమశిల హైలెవెల్ కెనాల్ పూర్తి చేయాలని, దెబ్బతిన్న ఆప్రాన్ పనులను పూర్తి చేయాలని అనేక ఉద్యమాలు నిర్వహించామని తెలిపారు. ఈ తరుణంలో జరుగుతున్న రాష్ట్ర మహాసభకు ప్రజానీకం తోడ్పాటు అందించి మహాసభను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి బి.మనోహర్, నాయకులు మణి, వెంకటేశ్వర్లు, రంగయ్య, కుమార్, రమేష్, తదితరులు పాల్గొన్నారు. నెల్లూరు 30వ డివిజన్ కొత్తూరు రామాలయం సెంటర్ వద్ద పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం ఇంటింటికీ తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. మహాసభను జయప్రదం చేయాలని దగదర్తిలో ప్రచారం నిర్వహించారు.



నిబద్ధతకూ, నిజాయితీకి మారు పేరు గుంటూరు బాపనయ్య



జననం : 1919 మరణం : 25-3-78

ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ కార్మికులు, దళితులు తదితర బలహీన వర్గాల శ్రేయస్సు కోసం నిర్విరామంగా కృషి చేసిన కమ్యూనిస్టు యోధుడు గుంటూరు బాపనయ్య. 1919లో కృష్ణా జిల్లా మోపిదేవి మండలం నాగాయతిప్పలో ఓ నిరుపేద దళిత వ్యవసాయ కుటుంబంలో జన్మించారు. వారి తల్లిదండ్రులు సోమమ్మ, రామస్వామి. పేదల అభ్యున్నతి కోసం తన జీవితాన్ని అంకితం చేశారు. కష్టజీవుల రాజ్య స్థాపనకు మార్క్సిస్టు- లెనినిస్టు సిద్ధాంతమే మార్గదర్శిగా భావించి, జీవితాంతం కమ్యూనిస్టుగా పాటుపడ్డారు. రాష్ట్రంలో వ్యవసాయ కార్మికోద్యమం నిర్మాణానికి శాయశక్తులా కృషి చేశారు. ఆ క్రమంలో సుమారు ఐదేళ్ళ నిర్బంధానికి గురై జైలు జీవితం గడిపారు. 1952, 1962, 1978 ఎన్నికల్లో శాసనసభ్యులుగా ఎన్నికయ్యారు. 1968-72 మధ్య శాసనమండలి సభ్యులుగా ఉన్నారు.


బాపనయ్య యువకుడిగా ఉన్నప్పుడు అవనిగడ్డలో చదువుకునేందుకు పడవ మీద వెళ్తుండేవాడు. దళితుడు పడవెక్కడానికి వీల్లేదంటూ ఓ రోజు పెత్తందారీ యువకులు అడ్డగించారు. తన అమ్మమ్మ గారింటికి వచ్చి అదే పడవపై తిరిగి వెళ్తున్న కమ్యూనిస్టు నేత మాకినేని బసవపున్నయ్య దీన్ని గమనించారు. అప్పటికే కమ్యూనిస్టు పార్టీలో పనిచేస్తున్న స్థానికులు కంఠంనేని పెద అచ్యుత రామయ్య, చిన అచ్యుత రామయ్య, గరికిపాటి మల్లయ్య తదితర యువకులను పోగుచేసి కుల వివక్షను ఎదిరించి పోరాడారు. ఈ సంఘటన బాపనయ్యను కమ్యూనిస్టు పార్టీవైపు ఆకర్షింపచేసింది. తరువాత కాకినాడ పిఆర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతూ, విద్యార్థి ఉద్యమంలో పనిచేశారు. 1940లో చదువు పూర్తయ్యాక స్వగ్రామం చేరి కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం స్వీకరించారు. దివి తాలూకాలో చల్లపల్లి నారాయణరావుతో కలిసి వ్యవసాయ కార్మిక సంఘాన్ని ఏర్పరిచారు.

1942 నుంచి చల్లపల్లి జమీందారుకు వ్యతిరేకంగా మంగళాపురంలో ముదిరాజులకే బంజరు చెందేటట్లు సాగిన పోరాటానికి చండ్ర రాజేశ్వరరావు, చల్లపల్లి నారాయణ రావుతోపాటు నాయకత్వం వహించారు. 1946లో 17 వేల ఎకరాల చల్లపల్లి జమీందారీ భూముల్లో 'గట్ల ఉద్యమాన్ని' నడిపించారు. 'తేలిన లంక కోటపాలు - మునిగిన లంక ఏటిపాలు' అన్న చందంగా ఉన్న తీరును అడ్డుకొని, కృష్ణానది తీరంలో వేలాది ఎకరాలను రైతులకు స్వాధీనం చేసిన పోరాటంలో పాల్గొన్నారు. ఆ పోరాటం ద్వారా సుమారు ఆరువేల ఎకరాల లంక భూములు రైతులకు దక్కాయి. 1947లో రాష్ట్రవ్యాప్తంగా పాలేర్ల జీతాల పెంపుదలకూ, పని గంటల తగ్గింపు కోసం జరిగిన పోరాటానికీ బాపనయ్య నాయకత్వం వహించారు. 1948లో జమీందారీ విధానం రద్దు, దున్నేవాడికే భూమి కోసం ఉవ్వెత్తుగా సాగిన పోరాటాల తరువాతనే భూ సంస్కరణల చట్టాలు, బంజరు భూములను పేదలకు పంచే ఎసైన్‌మెంట్ చట్టాలు వచ్చాయి. ఆ సందర్భంగా ప్రభుత్వం బాపనయ్యను అరెస్టు చేసి రాజమండ్రి, కడలూరు జైళ్లలో 1951 వరకూ నిర్బంధించింది.

1964లో పార్టీలో మితవాదాన్ని ఎదిరించి సిపిఎం వైపునకు వచ్చిన 32 మంది జాతీయ కౌన్సిల్ సభ్యుల్లో ఆంధ్రప్రదేశ్ నుంచి సుందరయ్య, బసవపున్నయ్య, మోటూరు హనుమంతరావు, నండూరి ప్రసాదరావు, బాపనయ్య ఉన్నారు. సిపిఎం ఆవిర్భావాన్ని అడ్డుకునేందుకు ప్రభుత్వం వారిని 1964 నుంచి 1966 వరకూ హైదరాబాద్ సెంట్రల్ జైలులో ఉంచింది. 1967లో ఏర్పడ్డ నక్సలైట్ విచ్ఛిన్నాన్ని ఎదిరించిన బాపనయ్య కష్టజీవులను సిపిఎం వెనుక నిలిపారు. రాష్ట్రంలో భూస్వామ్య వెట్టి చాకిరి వ్యతిరేక ఉద్యమానికి పునాది వేసింది సుందరయ్య అయితే- ఆ పిలుపునందుకొని ముందడుగు వేసింది బాపనయ్య. ఆయనకు ప్రజాసేవ తప్ప ఇతర వ్యాపకాలుండేవి కావు. తన శత్రువుకు సైతం సాయం చేసే సహృదయుడైనప్పటికీ సిద్ధాంతం విషయంలో ఆయనేనాడూ రాజీపడలేదు. ప్రజా ఉద్యమాలపై ప్రభుత్వాలు సాగించిన నిర్బంధాన్ని తిప్పికొట్టి పార్టీనీ, కార్యకర్తలను కాపాడేందుకు ఒక దౌత్య యోధుడిలా కృషి చేశారు. 1977 దివిసీమ ఉప్పెన సమయంలో పార్టీ ఆధ్వర్యంలో కోడూరు, నాగాయలంక, బందరు శారదానగర్‌లలో రెండు నెలలపాటు అవిశ్రాంతంగా సహాయ పునరావాస కార్యక్రమాలను నిర్వహించారు. బాపనయ్య 1964 నుంచి సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులుగా పనిచేశారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులుగానూ, కార్యదర్శిగానూ చివరివరకూ పనిచేశారు. ప్రజాప్రతినిధిగా పొందిన గౌరవ వేతనాన్ని పార్టీకి ఇచ్చి, పార్టీ ఇచ్చే కొద్దిపాటి అలవెన్సుతోనే జీవితాన్ని గడిపారు. అవిశ్రాంత పోరాట యోధుడు బాపనయ్య తన 58వ ఏట అంటే- 1978 మార్చి 25 రాత్రి హైదరాబాద్‌లో వైద్య చికిత్స పొందుతూ కన్నుమూశారు. నెల్లూరులో జరుగుతున్న సిపిఎం 13వ రాష్ట్ర మహాసభలకు ఈ సమాచారం చేరడంతో ప్రతినిధులంతా విషణ్ణులయ్యారు. అర్ధరాత్రి కూడా ఆయన అంత్యక్రియలకు 15 వేల మంది హాజరవడం ఆయన పట్ల ప్రజలకున్న అపార అభిమానానికి సూచిక. ఆనాటి సంతాప సభలో బసవ పున్నయ్య మాట్లాడుతూ, 'నీ ఆరోగ్యం బాగా చూసుకో బాపనయ్యా' అంటే, 'ఇంట్లో కూర్చొని చావడం కంటే జనం మధ్య చావడం మంచిదనేవాడ'ని గుర్తు చేసుకున్నారు.

చారిత్రాత్మక రైతు రక్షణ యాత్ర

జూలై 1937 - మార్చి1938



ఆంధ్రనాట మహోజ్వల ఘట్టాల్లో ఒకటి రైతు రక్షణ యాత్ర. 1937 జులైలో ఇచ్ఛాపురం నుండి మొదలై విశాఖపట్నం, తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాలు, కృష్ణ, గుంటూరు నెల్లూరు, కర్నూలు, చకంగల్పట్ జిల్లాలోని రెండు తాలూకాల గుండా మద్రాసు వరకు సాగింది. 130 రోజుల పాటు సాగిన ఈ రైతు రక్షణయాత్రలో కమ్యూనిస్టులు కీలక పాత్ర పోషించారు. 529 గ్రామాల్లో పర్యటించి రైతుల నుండి 800 అర్జీలను. 25,000 సంతకాలను సేకరించారు. 60 ఫిర్కాలలో రైతు సదస్సులను నిర్వ హించారు. నాలుగు లక్షల యాభైవేల మంది రైతులు ఈ యాత్రలో పాల్గొన్నారు. దీనికి ముందు ఆచార్య రంగా నేతృత్వంలో 1933-34 సంవత్సరాలలో గుంటూరు, కృష్ణ, గోదావరి, నెల్లూరు మొదలైన ప్రాంతాలలో భూమి శిస్తును రద్దు చేయాలని రైత్వారీ ప్రాంతాలలో పన్నులు తగ్గించాలని జమిందార్లకు ఎటువంటి నష్టపరిహారం చెల్లించకుండా జమిందారీ వ్యవస్థను రద్దు చేయాలని తీర్మానాలు చేశారు. స్టేట్ ల్యాండ్ యాక్ట్, ఫారెస్టు యాక్ట్‌లలోని లోటుపాట్లను మద్రాసు ప్రభుత్వానికి విన్నవించి రైతుల కనీస కోర్కెలను ఆమోదింపచేయటానికి ఈ యాత్ర ఉద్దేశింపబడింది. ఈ యాత్రకు కమ్యూనిస్టు నాయకులు కొమ్మారెడ్డి సత్యనారాయణ నేతృత్వం వహించారు. భారత దేశంలోని చారిత్రత్మకమైన ఈ రైతు రక్షణయాత్ర ఆంధ్ర రైతాంగంలో చైతన్యాన్ని రగిలించడమే కాక జమీందార్లను ఎదిరించి తమ హక్కులను కాపాడుకోవటానికి కావలసిన ధైర్యాన్ని, స్థయిర్యాన్ని వారిలో నింపింది. రైతు రక్షణ దళంలో చేరిన యువకులు కమ్యూనిస్టు పార్టీకి గ్రామీణ స్థాయిలో బలమైన కార్యకర్తలుగా ఏర్పడ్డారు.

సెబీ కొత్త చీఫ్ కోసం దరఖాస్తులు

ముంబయి : స్టాక్ మార్కెట్ల రెగ్యూలేటరీ అయినా సెక్యూరిటీస్ అండ్ ఎక్ఛేంజీ బోర్డు ఆఫ్ ఇండియా (సెబీ) కొత్త చీఫ్ కోసం కేంద్ర ప్రభుత్వం దరఖాస్తులను అహ్వానిస్తోంది. ప్రస్తుత వివాదస్పద ఛైర్‌పర్సన్ మాధాబి పురి బుచ్ పదవీ కాలం ఫిబ్రవరి 28తో ముగియనుంది. కార్పొరేట్లతో మాధాబి అంటకాగారాని.. పరస్పర ప్రయోజనాలకు పాల్పడ్డారని హిండెన్‌బర్గ్ రీసెర్చ్ సంస్థ గతేడాది ఓ రిపోర్ట్‌ను విడుదల చేసిన విషయం తెలిసిందే. మాధాబీ పదవీ కాలం ఫిబ్రవరి 28తో ముగియనుంది. సెబీ ఛైర్‌పర్సన్ కోసం ఆసక్తి కలిగిన వారు ఫిబ్రవరి 17 లోపు దరఖాస్తు చేసుకోవాలని కేంద్ర ఆర్థిక శాఖ సూచించింది. 50ఏళ్ల పై బడిన వారు 25 ఏళ్ల అనుభవం కలిగిన వారు ఈ పోస్టుకు అర్హులని తెలిపింది. న్యాయ, ఫైనాన్స్, ఆర్థిక, అకౌంటెన్సీలో ప్రత్యేక పరిజ్ఞానం కలిగి ఉండాలని పేర్కొంది. సెబీ ఛైర్‌పర్సన్ పదవికి ఇబ్బంది కలిగించేలా ఆర్థిక, ఇతర ప్రయోజనాలు పొందుతూ ఉండ కూడదని కేంద్రం తెలిపింది.

హంద్రీనీవా కాలువ సామర్థ్యం పెంచాలి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్ డిమాండ్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్



హంద్రీనీవా సుజల స్రవంతి సర్కిల్ కార్యాలయం వద్ద చేపట్టిన ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న వి.రాంభూపాల్

హంద్రీనీవా కాలువ సామర్థ్యాన్ని పది వేల క్యూసెక్కులకు పెంచేలా కాలువ వెడల్పు పనులను తక్షణమే ప్రారంభించాలని ప్రభుత్వాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్ డిమాండ్ చేశారు. హంద్రీనీవా కాలువ వెడల్పు చేయాలని, లైనింగ్ పనులు ఆపాలని, 404, 405 జిఒలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో అనంతపురం హంద్రీనీవా సుజల స్రవంతి సర్కిల్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ.. హంద్రీనీవా ఎత్తిపోతల ద్వారా కర్నూలు, ఉమ్మడి అనంతపురం, కడప, చిత్తూరు జిల్లాల ఆయకట్టుకు నీరు ఇవ్వాల్సి ఉండగా కాలువ సామర్థ్యం అందుకు అనుగుణంగా లేవన్నారు. వరద కాలంలో ఎక్కువ నీటిని తీసుకోవడానికి వీలుగా పది వేల క్యూసెక్కుల సామర్థ్యానికి పెంచుతామని 2019లో అనంతపురం జిల్లా పామిడి బహిరంగసభలో ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు నాయుడు ప్రకటించారని, ఆ మేరకు నిధులు కేటాయించి కాలువ వెడల్పు చేయాలని డిమాండ్ చేశారు. హంద్రీనీవా ప్రాజెక్టు కింద ఉన్న మొత్తం అయకట్టుకు సాగునీరు ఇవ్వడానికి వీలుగా పంట కాలువలను తవ్వాలని కోరారు. ఆయకట్టు భూములకు సాగునీరు ఇచ్చేందుకు అవసరమైన కాలువల నిర్మాణానికి రాష్ట్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని కోరారు. పై డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని హంద్రీనీవా చీఫ్ ఇంజనీర్ నాగరాజుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం అనంతపురం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.రామిరెడ్డి, ఆర్.చంద్రశేఖర్ రెడ్డి, ఎం.బాలరంగయ్య పాల్గొన్నారు.

రూపాయి వెలవెల



ముంబయి : ప్రపంచ మార్కెట్‌లో రూపాయి విలువ వెలవెల పోతోంది. భారత స్టాక్ మార్కెట్లలో తీవ్ర అమ్మకాల ఒత్తిడికి తోడు విదేశీ మారకం నిల్వలు కరిగిపోవడంతో సోమవారం అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్‌లో రూపాయి విలువ మరింత క్షీణించింది. డాలర్‌తో రూపాయి విలువ 11 పైసలు పతనమై డాలర్‌తో 86.33 కనిష్ట స్థాయికి దిగజారింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వాణిజ్య టారీఫ్ భయాలు రూపాయిపై ఒత్తిడిని పెంచుతున్నాయి. ఇంటర్ బ్యాంక్ ఫారిన్ ఎక్స్ఛేంజ్ మార్కెట్‌లో 86.35 వద్ద తెరుచుకున్న రూపాయి విలువ.. ఇంట్రాడేలో ఏకంగా 86.45 కనిష్ట స్థాయిని తాకింది. శుక్రవారం సెషన్‌లోనూ రూపాయి విలువ 22 పైసలు పతనమయ్యింది. స్టాక్ మార్కెట్ల వరుస పతనం, విదేశీ సంస్థాగత పెట్టుబడులు తరలిపోవడం, ఇతర దేశీయ బలహీన సూక్ష్మ ఆర్థికాంశాలు రూపాయి విలువను ఒత్తిడికి గురి చేస్తున్నాయి. గ్లోబల్ మార్కెట్‌లో ముడి చమురు బ్యారెల్ ధర 0.19 శాతం పెరిగి 78.65 డాలర్లకు చేరింది.

ఇంటి స్థలాలు, సాగు భూమి ఇచ్చే వరకూ పోరాటం

- ప్రభుత్వం స్పందించకపోతే చలో అసెంబ్లీ
- కలెక్టరేట్ ముట్టడిలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ

ప్రజాశక్తి - కడప అర్బన్



కలెక్టరేట్ ధర్నాకు ర్యాలీగా వెళుతున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకష్ణ, నాయకులు

అర్హులైన పేదలకు పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు ఇంటిస్థలం సాధించే వరకు పోరాడుతామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ అన్నారు. ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు, రెండెకరాల సాగుభూమి మంజూరు చేయాలని, టిడ్కో ఇల్లును లబ్ధిదారులకు స్వాధీనం చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే చలో అసెంబ్లీకి పిలుపునిస్తామని హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్ద కాలంగా నివాసముంటున్న పోరుమామిళ్ళ (మం) తిరుపతిరెడ్డి కాలనీ, బద్వేల్ (మం) భగత్ సింగ్ నగర్, సి.కొత్తపల్లె సి.ఆర్.నగర్, బాకరాపేట సిపిఐ కాలనీ, గోపవరం (మం) పిపి కుంట సిపిఐ కాలనీ వాసులకు పట్టాలిచ్చి, పక్కాగృహం మంజూరు చేయాలని కోరారు.

గతంలో జడ్‌హెచ్‌డిసి, సొసైటీల ద్వారా దళితులకిచ్చిన భూములపై హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు. డికెటి మాఫియాను అరికట్టి ఫ్రీ హోల్డ్‌లో జరిగిన అక్రమాలపై, ల్యాండ్ సీలింగ్ యాక్ట్ ఉల్లంఘించి జిల్లాలో వందల ఎకరాలతో వెలుస్తున్న ఎస్టేట్లపై చర్యలు తీసుకోవాలని కోరారు. టిడిపి కూటమి ప్రభుత్వ ఎన్నికల హామీలో భాగంగా పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్ల స్థలం ఇవ్వడంతో పాటు నిర్మాణానికి నిధులు కూడా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ శ్రీధర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య, సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర తదితరులు పాల్గొన్నారు.

నకిలీ స్వామీజీ అరెస్టు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్, చాట్రాయి

స్వామీజీగా ప్రజలను మోసం చేస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. నూజివీడు డిఎస్‌పి ప్రసాద్ తెలిపిన వివరాల మేరకు.. ఏలూరు జిల్లా చాట్రాయి మండలం ఆరుగొలనుపేట గ్రామంలో గత నెల 16వ తేదీన ఒక వ్యక్తి మృతి చెందాడు. నకిలీ స్వామీజీగా చలమణి అవుతున్న వ్యక్తి మృతుని ఇంటికి వెళ్లి మీ అల్లుడికి చేతబడి చేయడం వల్ల చనిపోయాడని, ఇంకా మీ ఇంటిని పట్టిన శని వదిలిపోలేదని, మీ కుమారుడు కూడా చనిపోతాడని భయపెట్టాడు. శని వదిలిపోవాలంటే విజయవాడ కనకదుర్గమ్మ ఆలయంలో పూజలు చేయాలని, అందుకు డబ్బులు ఖర్చవుతాయని చెప్పి రూ.61 వేలు తీసుకుని పరారయ్యాడు. ఎనిమిది నెలల క్రితం నూజివీడు మండలం పోతిరెడ్డిపల్లి గ్రామంలో కూడా ఇదేవిధంగా మాయమాటలు చెప్పి ఓ కుటుంబం నుంచి రూ.26 వేలు కాజేశాడు. దీనిపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. చాట్రాయి గ్రామంలోని పోలవరం వెళ్లే రోడ్డులో ఆదివారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. అటుగా వస్తున్న నకిలీ స్వామీజీ పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించగా వెంబడించి పట్టుకున్నారు. అతని వద్ద నుంచి రూ.80 వేల నగదు, ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట గ్రామపంచాయతీ పెరియాగూడేనికి చెందిన తోరపాటి బాలయ్యగా పోలీసులు గుర్తించారు.

సంపాదకీయం


సందేశాలు..సందేహాలు...

రాష్ట్రపతి భారత రాజ్యాంగ పరిరక్షకులు. ఈ విషయాన్ని రాజ్యాంగమే చెబుతుంది. రాజ్యాంగం అమల్లోకొచ్చిన గణతంత్ర దినోత్సవం సందర్భంగా దేశ ప్రథమ పౌరులు, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జాతినుద్దేశించి ఇచ్చిన సందేశంలోని కొన్ని అంశాలు రాజ్యాంగ పరిరక్షణ విద్యుక్త ధర్మం నుంచి పక్కకు మళ్లిన భావన కలిగిస్తాయి. గణతంత్ర రాజ్యానికి 75 ఏళ్లు పూర్తయిన వేళ ఈ పరిస్థితి ఎదురుకావడం ఆందోళన కలిగిస్తుంది. కేంద్ర ప్రభుత్వ కేబినెట్ ఏమి రాసిస్తే అది రాష్ట్రపతి చదవడం మామూలే. అయితే ఆ ప్రసంగం రాజ్యాంగానికి లోబడి ఉండేటట్లు విచక్షణతో వ్యవహరించడం రాష్ట్రపతి బాధ్యత. 'ఒకే దేశం-ఒకే ఎన్నిక' కోసం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అత్యుత్సాహపడుతోంది. జమిలి ఎన్నికలు రాజ్యాంగ విరుద్ధమని, సమాఖ్య వ్యవస్థకు గొడ్డలిపెట్టని, రాష్ట్రాల హక్కులకు విఘాతమని ప్రజాస్వామ్యవాదులు, రాజ్యాంగ ప్రేమికులు, ప్రతిపక్షాలు నెత్తీనోరు బాదుకుంటున్న పరిస్థితి. అయినా మోడీ సర్కారు ముందుకేనంది. మాజీ రాష్ట్రపతి రామనాథ్ కోవింద్ నేతృత్వంలో కమిటీ వేసి, తన ఎజెండాకనుగుణంగా నివేదిక తెప్పించుకొని, కేబినెట్‌లో గ్రీన్‌సిగ్నల్ ఇచ్చి, ఆపై లోక్‌సభలో బిల్లు ప్రవేశపెట్టింది. విపక్షాల అభ్యంతరాలు, నిరసనలతో బిల్లును విస్తృత చర్చల కోసం జాయింట్ పార్లమెంటరీ కమిటీ(జెపిసి)కి పంపింది.

జెపిసి చర్చల్లో ఉన్న జమిలి అంశాన్ని రాష్ట్రపతి తన రిపబ్లిక్‌డే సందేశంలో గొప్పగా పేర్కొనడమే కాకుండా మద్దతుగా మాట్లాడటం విచిత్రం. ప్రజాస్వామ్యానికి దేవాలయం లాంటిది పార్లమెంట్. పార్లమెంట్ ఉభయ సభలను సమావేశపర్చేది రాష్ట్రపతే. అక్కడ పెండింగ్‌లో ఉన్న బిల్లుకు ఉద్దేశం ఆపాదించడం రాజ్యాంగం రీత్యా చూసినా ధర్మం కాదు. జమిలి సుపరిపాలన విధానాల్లో అనిశ్చితిని తగ్గిస్తుంది, వనరులు పక్కదారి పట్టకుండా రక్షించడానికి వీలుకల్పిస్తుంది, ప్రభుత్వంపై ఆర్థిక భారాలు తగ్గించడానికి దోహదపడుతుంది అని ముర్ము ఆకాశానికెత్తారు. రాజ్యాంగం నిర్దేశించిన సమాఖ్య వ్యవస్థకు హాని తలపెట్టే, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసే జమిలి ప్రమాదాన్ని రాష్ట్రపతి విస్మరించడం ఆందోళనకరం. నిజానికి పార్లమెంట్ ఉభయసభల్లో ఇప్పుడు 'జమిలి' బిల్లు ఆమోదం పొందడం అసాధ్యం. రాజ్యాంగ సవరణలు చేయాలి. రెండు సభల్లో మూడింట రెండు వంతుల మెజార్టీ కావాలి. దేశంలోని సగానికి పైగా రాష్ట్రాలు అంగీకరించాలి. బిల్లు అసాధ్యమని తెలిసినా సరే, జమిలిపై చర్చకు, ఆర్‌ఎస్‌ఎస్ నిర్దేశిత ఎజెండాకు కట్టుబడి ఉన్నామని గట్టి సంకేతాలివ్వడానికి మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తోంది.

రాష్ట్రంలో రాజ్యాంగ పరిరక్షకులు గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ టిడిపి కూటమి ప్రభుత్వం రాసిచ్చిన స్క్రిప్టును రిపబ్లిక్ డే సందేశంగా విపులీకరించారు. 'స్వర్ణాంధ్ర-విజన్ 2047' డాక్యుమెంట్‌ను పునశ్చరణ కావించి రాష్ట్రాన్ని 'సంస్కరణ'ల బాట పట్టిస్తామని స్పష్టీకరించారు. గత రిపబ్లిక్‌డే సందేశంలో అప్పటి వైసిపి ప్రభుత్వాన్ని తన ప్రభుత్వంగా సంబోధించి భేష్ అన్న గవర్నరే, ఈసారి గత ఐదేళ్ల పాలనంతా విధ్వంసమని వల్లించారు. ఇక్కడ అర్థమయ్యేదేంటంటే ప్రభుత్వం రూపొందించిన మేటర్‌ను గవర్నర్లు ఒప్పజెపుతారని. మొన్నటి ఎన్నికల్లో కూటమిని గెలిపించిన ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయబోమన్న గవర్నర్ హామీ ప్రస్తుతానికైతే ప్రజల్లో ఆశలు రేపుతుంది. పథకాలు, వాగ్దానాలు కార్యరూపం దాల్చాకనే చిత్తశుద్ధి వెల్లడవుతుంది. ఈమారు ఆంధ్రప్రదేశ్‌కు ఆనందం కలిగించే విషయం ఢిల్లీలో గణతంత్ర పరేడ్‌లో ఏటికొప్పాక బొమ్మల కొలువు. మన సాంస్కృతిక ప్రతీకగా నిలిచింది. శకటాల ప్రదర్శనలో ఆకర్షణ అయింది. ఎ.పి. శకటం కొన్నేళ్లుగా తిరస్కరణకు గురవుతుండగా ఈ తడవ అనుమతి లభించడం గమనార్హం. రిపబ్లిక్‌డే వేదికల మీది నుంచి దేశాధినేతగా వ్యవహరించే రాష్ట్రపతి, రాష్ట్రంలో గవర్నర్ ఇచ్చే సందేశాలు ఆ యా ప్రభుత్వాల నడకను ప్రజలకు వెల్లడిస్తాయి. సందేశాలు వాస్తవికత సంతరించుకోవాలి. రాజ్యాంగానికి లోబడి ఉండాలి.

మహనీయుని మాట



బిడ్డలకు పాలు,
పెద్దలకు ఆహారం,
అందరికీ విద్య అందాలి.
- లాలా లజపత్ రాయ్,
స్వాతంత్ర్య సమరయోధుడు.
జననం : 28.1.1865
మరణం : 17.11.1928

Lala Lajpat Rai

ఆర్థిక వృద్ధికి మార్గం ఏది?

ప్రభుత్వం తరఫున వకాల్తా పుచ్చుకుని మాట్లాడేవారంతా-అటు కన్సల్టెన్సీ సంస్థల మొదలు ఇటు ఆర్థిక వ్యవహారాల మీద రాసే పత్రికల వరకూ-అందరూ ఇప్పుడు ఒకటే పాట అందుకున్నారు. దిగజారిపోతున్న భారతదేశ ఆర్థిక వృద్ధి రేటు మళ్ళీ పుంజుకోవాలంటే దేశీయంగా వినిమయాన్ని పెంచే దిశగా చర్యలు తీసుకోవాలంటూ వారంతా ఘోషిస్తున్నారు. ఈ బృందంతో తాజాగా ఇప్పుడు రిజర్వు బ్యాంకు కూడా గొంతు కలిపింది. పారిశ్రామికవేత్తల 'వేటాడే జంతు ప్రవృత్తి'ని మళ్ళీ ప్రేరేపించాలంటే తక్షణమే దేశీయ వినిమయాన్ని పెంచాల్సిందేనంటూ తాజా బులెటిన్‌లో ఆర్‌బిఐ పేర్కొంది.

వాళ్ళందరూ చెప్తున్నట్టు 2024-25లో మన దేశ ఆర్థిక వృద్ధిరేటు ముందు అనుకున్న 7 శాతం బదులు 0.5 శాతం తగ్గి 6.5 శాతంగా ఉండబోతోందన్నదే వాస్తవమైతే ఇంత ఆందోళన పడిపోవడం దేనికి? 6.5 శాతం వృద్ధి రేటు గనుక ఉండేట్టయితే అదేమీ అంత దిగజారిపోవడం కాదు. అర్జెంటుగా 'వేటాడే జంతు ప్రవృత్తి'ని ప్రేరేపించాల్సిన అగత్యమూ లేదు. ఐనా వాళ్ళంతా ఇంత ఆందోళన పడుతున్నారంటే వాళ్ళు చెప్తున్న జిడిపి లెక్కలన్నీ తప్పుల తడకలన్నమాట. అతి అంచనాలు వేసి మనకు చూపిస్తూ వచ్చారన్నమాట. ఇక ఆర్‌బిఐ మాట్లాడుతున్న 'దేశీయ వినియోగం' అనేది శ్రామిక ప్రజల వినియోగం కాదు. కేవలం పట్టణ మధ్య తరగతి వినియోగం మాత్రమే.

ఒకవేళ శ్రామికవర్గ పేదల వినియోగాన్ని పెంచాలని అనుకుంటే అందరికీ వేతనాల స్థాయిని పెంచితే సరిపోతుంది. చట్ట ప్రకారం చెల్లించవలసిన కనీస వేతనాన్ని పెంచుతూ ప్రభుత్వం నిర్ణయిస్తే చాలు. కాని ఎల్ అండ్ టి చైర్మన్ వారానికి 90 గంటలు పని ఉండేలా పెంచాలని డిమాండ్ చేశాడు. తక్కిన ఏ పరిశ్రమాధిపతీ అతనితో విభేదించలేదు. అతను కోరినదే గనుక అమలైతే అప్పుడు మన ఫ్యాక్టరీలన్నీ జర్మన్ నాజీ నిర్బంధ శిబిరాలుగా మారుతాయి. వాటిలోకి వెళ్ళినవాళ్ళు మళ్ళీ తిరిగి రావడం అంటే శవాలుగానే! ఇళ్ళల్లో భార్యల కళ్ళల్లోకి చూసుకుంటూ కాలాన్ని వృథా చేసేకన్నా ఆ సమయాన్ని డ్యూటీలో వెచ్చించడం మంచిదని ఆ ఎల్ అండ్ టి చైర్మన్ వ్యాఖ్యానించాడు! జర్మనీ లోని ఆశ్విజ్ కాన్సెంట్రేషన్ క్యాంప్ దగ్గర "పని చేయడం ద్వారానే స్వేచ్ఛ పొందుతారు" అన్న బోర్డు ఉండేది. ఇతగాడు చెప్పినది చూస్తే ఆ బోర్డు గుర్తుకొస్తోంది. ఏదేమైనా, యజమానులు పని గంటలు పెంచాలంటున్నారే తప్ప వినిమయ శక్తి పెంచుతాం అని, లేదా వేతనాలను పెంచుతాం అని చెప్పడం లేదు.



ప్రభాత్ పట్నాయక్

మరి పట్టణ మధ్య తరగతి ప్రజల వినిమయ శక్తిని పెంచడానికి ఏం చేయాలని సూచిస్తున్నారు? ఆహార వస్తువుల ధరల పెరుగుదలను నియంత్రించాలని సూచిస్తున్నారు. అలా చేస్తే ఇతర వినిమయ వస్తువుల కొనుగోళ్ళు పెరుగుతాయని అంటున్నారు. ఆహార వస్తువుల ధరల నియంత్రణ చేయవలసిందే. కాని దానివలన పట్టణ మధ్య తరగతి ప్రజల వినియోగం కొత్తగా పెరిగిపోయేది ఎంత? వారి ఆదాయాల్లో ఇప్పుడు ఆహార వస్తువుల కొనుగోలు కోసం ఎంత శాతం ఖర్చు చేస్తున్నారు? శ్రామిక వర్గం అయితే తమ ఆదాయంలో అత్యధిక శాతం ఆహార వస్తువుల కొనుగోలుకే వెచ్చిస్తున్నారు. వాటి ధరలు పెరిగితే వాటి వినియోగం పడిపోతుంది. బడా పరిశ్రమలు ఉత్పత్తి చేసే సరుకుల ప్రధాన వినియోగదారులు పట్టణ మధ్యతరగతి ప్రజలు. ఆహార వస్తువుల ధరలను నియంత్రించినంత మాత్రాన ఆ సరుకుల డిమాండ్ పెరిగేది పెద్దగా ఏమీ ఉండదు.

> వ్యవసాయదారుల ఆదాయాలను పెంచే దిశగా చర్యలు తీసుకుంటే అప్పుడు వారి వినిమయం పెరిగి ఆర్థిక వృద్ధి వేగం పెరుగుతుంది. కాని ఇది జరగాలంటే రైతు-అనుకూల విధానాలు అమలు చేసే ప్రభుత్వం ఉండాలి. కార్పొరేట్ ప్రయోజనాలను, అగ్రి-బిజినెస్‌ను ప్రోత్సహించే ప్రస్తుత ప్రభుత్వ విధానాలు రైతుల ఆదాయాలను పెంచడం లేదు సరికదా మరింత కుంగదీస్తున్నాయి. ప్రభుత్వం ఈ విధానాలను నయా ఉదారవాదం ఆదేశాల మేరకే చేస్తోంది. దీనిని బట్టి ఒక విషయం స్పష్టం ఔతోంది. ఈ నయా ఉదారవాద విధానాల చట్రానికి లోబడి నడుచుకుంటున్నంత వరకూ ప్రభుత్వం దేశీయ వినిమయాన్ని పెంచడం కాని, తద్వారా వృద్ధి రేటును పెంచడం కాని చేయడం అసాధ్యం.



వాణిజ్యాన్ని పూర్తిగా సరళతరం చేశాక నయా ఉదారవాద వ్యవస్థలో ఆర్థికవృద్ధి వేగం పుంజుకోవాలంటే ఎగుమతులు పెరిగితేనే సాధ్యపడుతుంది. దేశీయంగా తాత్కాలికంగా రియల్ ఎస్టేట్ మార్కెట్ పుంజుకున్నప్పుడు అది కూడా వృద్ధికి తోడ్పడవచ్చు. కాని అది నిలకడగా ఉండేది కాదు. ఎగుమతుల మార్కెట్ విస్తరిస్తేనే వృద్ధి వేగం పెరుగుతుంది. ఇంతవరకూ ప్రభుత్వం కూడా ఎగుమతులను పెంచడం ద్వారా వృద్ధి జరగాలనే చెప్తూ వస్తోంది. మరి ఇప్పుడు ఉన్నట్టుండి ఆ విషయాన్ని వదలిపెట్టి దేశీయ డిమాండ్‌ను పెంచుకోవాలని ఎందుకంటున్నారు? నయా ఉదారవాద వ్యవస్థ పరిధి లోపల వాళ్ళు కోరుతున్నట్టు దేశీయ డిమాండ్‌ను పెంచుకోవడం సాధ్యపడేదేనా?

రుణాలను మరింత ఎక్కువ మొత్తంలో అందించడమో, లేక రుణాల మంజూరును మరింత సరళతరం చేయడమో పరిష్కారం కాదు. దాని వలన పట్టణ మధ్య తరగతి కూడా తమ వినియోగాన్ని పెంచుకుంటారని భావించలేము. తాత్కాలికంగా అప్పులు తీసుకుని సరుకులు కొన్నా, ఆ అప్పుల వాయిదాలు కట్టడానికి ఆ వెంటనే ఎక్కువ మొత్తాన్ని ఆదాయం నుంచి కేటాయించాల్సి వస్తుంది. అప్పుడు మళ్ళీ డిమాండ్ పడిపోతుంది. అందుచేత పట్టణ మధ్య తరగతి మరింత ఎక్కువ అప్పు కావాలని కోరుకోరు. ఆహార వస్తువుల ధరలను తగ్గించినా అది కూడా తాత్కాలికంగా వినిమయాన్ని పెంచుతుందే తప్ప వినిమయం నిరంతరాయంగా పెరుగుతూ పోయే పరిస్థితి ఉత్పన్నం కాదు.

వినిమయం పెరిగితే అప్పుడు ఆదాయాలు కూడా పెరుగుతాయి. అలా ఆదాయాలు పెరగడం మళ్ళీ వినిమయం పెరగడానికి దారితీస్తుంది. ఇలా వినిమయమూ, ఆదాయాలు ఒకదాని వెంట మరొకటి పెరుగుతూ పోతాయి కదా అని వాదించవచ్చు. కాని ఏ కారణంగానైనా ఒకానొక కాలంలో వినిమయం పడిపోతే అప్పుడు ఆదాయాలు పడిపోవడం కూడా మొదలౌతుంది. ఈ క్రమాన్ని కూడా ఎవరూ ఆపలేరు. అంటే వినిమయాన్ని పెంచడం ద్వారా సాధించే వృద్ధిని పడిపోకుండా నిలబెట్టాలంటే వెలుపలి నుండి ఒక దన్ను ఉండాలి. ప్రభుత్వ వ్యయాన్ని పెంచి తద్వారా వచ్చే అదనపు ధనాన్ని వినియోగదారులకు అందించగలిగితే అప్పుడు వినిమయం పడిపోకుండా నిలబెట్టడం సాధ్యపడుతుంది.

ఇది జరగాలంటే ప్రభుత్వ వ్యయాన్ని ఒక్కసారిగా పెంచాల్సి వుంది. అవసరం అయితే నేరుగా వినియోగదారులకు నగదును కూడా బదిలీ చేయవచ్చు. కాని ప్రభుత్వం అదనపు వ్యయాన్ని చేయాలంటే అందుకోసం అప్పులు చేసైనా ఖర్చు చేయాలి (దాన్నే ద్రవ్య లోటు పెంచడం అని కూడా అంటారు). లేదా సంపన్నుల మీద అదనపు పన్నులు విధించి అలా సమకూరిన సొమ్మునైనా ఖర్చు చేయాలి. పేదవాళ్ళ మీద పన్నులు విధిస్తే ప్రయోజనం ఉండదు. పేదవారిమీద రూ.100 పన్ను అదనంగా విధిస్తే ఆ మేరకు వారి వినియోగం పడిపోతుంది. ఆ సొమ్మును మళ్ళీ ప్రభుత్వం ఖర్చు చేస్తే మహా అయితే ఆ రూ.100 వరకే పేదలు మళ్ళీ ఖర్చు చేయగలుగుతారు. మొత్తం మీద వినిమయం పెరిగేది ఏమీ ఉండదు.

అందుచేత సంపన్నుల మీద అదనపు పన్నులు విధించడమో లేక ద్రవ్యలోటును పెంచడమో ఏదో ఒకటి గాని రెండూ గాని ప్రభుత్వం చేయాలి. కాని నయా ఉదారవాద వ్యవస్థ ఇందుకు అంగీకరించదు. ఎఫ్‌ఆర్‌బిఎం చట్టం ప్రభుత్వ వ్యయం మీద ఒక పరిమితిని విధించింది. ఇక సంపన్నుల మీద అదనపు పన్నుల విధిస్తే వాళ్ళు తమ పెట్టుబడులను ఈ దేశాన్నుంచి ఇతర దేశాలకు తరలించుకుపోతారు. అప్పుడు వృద్ధి రేటు పెరగకపోగా పడిపోతుంది. దేశాన్ని విడిచిపెట్టి క్షణాల మీద బైటకు జారుకునే పెట్టుబడిలో ద్రవ్య పెట్టుబడి పారిశ్రామిక పెట్టుబడి కన్నా ముందే ఉంటుంది. దాని ఫలితంగా దేశ ఆర్థిక వ్యవస్థ మరీ చిక్కుల్లో పడుతుంది.

> వినిమయం పెరిగితే అప్పుడు ఆదాయాలు కూడా పెరుగుతాయి. అలా ఆదాయాలు పెరగడం మళ్ళీ వినిమయం పెరగడానికి దారితీస్తుంది. ఇలా వినిమయమూ, ఆదాయాలు ఒకదాని వెంట మరొకటి పెరుగుతూ పోతాయి కదా అని వాదించవచ్చు. కాని ఏ కారణంగానైనా ఒకానొక కాలంలో వినిమయం పడిపోతే అప్పుడు ఆదాయాలు పడిపోవడం కూడా మొదలౌతుంది. ఈ క్రమాన్ని కూడా ఎవరూ ఆపలేరు. అంటే వినిమయాన్ని పెంచడం ద్వారా సాధించే వృద్ధిని పడిపోకుండా నిలబెట్టాలంటే వెలుపలి నుండి ఒక దన్ను ఉండాలి. ప్రభుత్వ వ్యయాన్ని పెంచి తద్వారా వచ్చే అదనపు ధనాన్ని వినియోగదారులకు అందించగలిగితే అప్పుడు వినిమయం పడిపోకుండా నిలబెట్టడం సాధ్యపడుతుంది.

వ్యవసాయదారుల ఆదాయాలను పెంచే దిశగా చర్యలు తీసుకుంటే అప్పుడు వారి వినిమయం పెరిగి ఆర్థిక వృద్ధి వేగం పెరుగుతుంది. కాని ఇది జరగాలంటే రైతు-అనుకూల విధానాలు అమలు చేసే ప్రభుత్వం ఉండాలి. కార్పొరేట్ ప్రయోజనాలను, అగ్రి-బిజినెస్‌ను ప్రోత్సహించే ప్రస్తుత ప్రభుత్వ విధానాలు రైతుల ఆదాయాలను పెంచడం లేదు సరికదా మరింత కుంగదీస్తున్నాయి. ప్రభుత్వం ఈ విధానాలను నయా ఉదారవాదం ఆదేశాల మేరకే చేస్తోంది.

దీనిని బట్టి ఒక విషయం స్పష్టం ఔతోంది. ఈ నయా ఉదారవాద విధానాల చట్రానికి లోబడి నడుచుకుంటున్నంత వరకూ ప్రభుత్వం దేశీయ వినిమయాన్ని పెంచడం కాని, తద్వారా వృద్ధి రేటును పెంచడం కాని చేయడం అసాధ్యం. మరి చైనా దేశీయ వినిమయాన్ని పెంచుకుని దాని మీద ప్రధానంగా ఆధారపడి వృద్ధి రేటును కొనసాగిస్తోంది కదా అని అడగవచ్చు. కాని చైనాకు నయా ఉదారవాద చట్రపు ఆంక్షలేవీ వర్తించవు. అక్కడ ప్రభుత్వం తన నిర్ణయాలను ఎవరి ఒత్తిడులూ లేకుండా స్వంతంగా చేస్తున్నది. స్వావలంబన విధానం అమలు చేస్తున్నది. అందుచేత అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి దయాదాక్షిణ్యాల మీద ఆ దేశం ఆధారపడి లేదు. పైగా వెలుపలినుండి చైనాకు వచ్చే పెట్టుబడుల ప్రవాహమూ తక్కువే. ఎందుకంటే వాణిజ్యంలో చైనా మిగులులో ఎప్పటి నుంచో కొనసాగుతోంది. అంటే చైనా పెట్టుబడులే ఇతర దేశాల్లో ఎక్కువ ఉన్నాయన్నమాట.

కాని భారతదేశం పరిస్థితి అలా కాదు. మనం అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ప్రవాహం మీద ఆధారపడి వున్నాం. అలా పెట్టుబడులు వస్తూ వుండకపోతే విదేశీ వ్యాపారంలోని లోటును భర్తీ చేయడం సాధ్యం కాదు. అందువలన పెట్టుబడుల ప్రవాహాన్ని అదుపు చేయగల శక్తి లేదు.

కాని రిజర్వు బ్యాంకు, తక్కిన ప్రభుత్వ బాకా రాయుళ్ళు మన ప్రభుత్వానికి సంపూర్ణ స్వావలంబన ఉన్నట్టు మాట్లాడుతున్నారు. వాళ్ళకి నయా ఉదారవాద ఆర్థిక చట్రం ఏ విధంగా పని చేస్తోందో అర్థం అయినట్టు లేదు!

(స్వేచ్ఛానుసరణ)

కవిత్వం

లేబర్ అడ్డా!

యుద్ధ శిథిలాల కడుపు కోత
విషాద గీతాల కన్నీళ్ళ
నిప్పు కణిక కళ్ళల్లోంచి
ఎగిసి పడుతున్న మంటలకు
దావోస్ లాంటి సభలు చలికాచుకుంటున్నాయి.
కంపెనీలు ప్రాజెక్టులు
అరచేతిలో వైకుంఠాలు
అభివృద్ధి ఉపాధి కల్పనలు
షరతులు అంగీకారాలు
సి.ఈ.ఒ.లు రాజకీయ ప్రతినిధులు
చేతులు మార్చుకుంటున్న
కాగితం మీద కందిపప్పు
ఒప్పందాల అవగాహన పత్రాలు.
రుణమను నువ్వు ఆర్థిక సహాయమను
పేరు ఏదైనా ఒక్కటే
పూల బొకే లాంటి
చక్కెర పూత సంభాషణలు
రెప్పలు తెరచి ఉండగానే
సుతారంగా కనుగుడ్లను
ఒడుపుగా మాయం చేసే కాలం.
ఉద్రిక్తతలు వారే పెంచుతారు
యుద్ధాలు వారే చేయిస్తారు
సహాయ శిబిరాలను నిర్మించి
హెలికాప్టర్ మీంచి గొప్ప ఉదారతతో
నిత్యావసరాలను వారే విసిరేస్తారు.
నొప్పి తెలియకుండా
ఎన్ని రకాల సుద్దులు బుద్ధులు చెప్పినా
అమాయక శిశువులు స్త్రీలు వృద్ధులు
డాలర్ దాహానికి ఆహుతి అవుతుంటారు.
శ్రమ వస్తువు వినియోగదారుడు
ప్రతిదీ షోకేస్‌లో
అందంగా ప్రదర్శించి
మార్కెట్ చేయబడుతుంది.
నాకు తెలియక అడుగుతా
రాజ్యాలకు రాజ్యాలను నడిపిస్తున్న
కంపెనీల లక్ష్యం ప్రజా సంక్షేమమైతే
దేశదేశాలు లేబర్ అడ్డా మీద
పని కోసం వలస కూలీలుగా
ఎందుకు నిలబడుతున్నాయి?

- జూకంటి జగన్నాథం

ప్రభుత్వ విద్యను బలహీనపరిచే ప్రతిపాదనలు

> మార్కులు, ర్యాంకుల మోజులో కార్పొరేట్ సంస్థలు విద్యార్థులపై ఒత్తిడి చేస్తున్నాయే తప్ప ఉన్న విధానం వలన ఒత్తిడి రావడంలేదని గుర్తెరగాలి. ఆటలు ఉండవు. కళాశాలలు జైళ్లను తలపిస్తుంటాయి. 5 గంటల నుండి రాత్రి 9 గంటల వరకూ విద్యార్థులకు తరగతులు ఉంటాయి. ఈ ఒత్తిడిని తట్టుకోలేక విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఇతర రాష్ట్రాలతో పోటీ ఉండాలి. మన రాష్ట్ర విద్యార్థులు అన్నింటిలోనూ ముందు పీఠిన ఉండాల్సిందే. కానీ పోటీ పేరుతో పరీక్షలను రద్దు చేయడం విద్యార్థుల్లో జవాబుదారీతనం లోపిస్తుంది. ప్రభుత్వ విద్యావ్యవస్థ, చిన్న మధ్య తరహా ప్రైవేటు విద్యాసంస్థలు కుదేలవుతాయి.



వ్యాసం

ఇంటర్ విద్యలో సంస్కరణలు ప్రతిపాదిస్తూ ఇంటర్మీడియట్ కమిషనర్ జనవరి 8న ముసాయిదా విడుదల చేశారు. ఇది నూతన జాతీయ విద్యా విధానంలో భాగమని స్పష్టం చేశారు కూడా. ఒత్తిడి లేని విద్యను అందించడమే లక్ష్యమని, ఇతర రాష్ట్రాలతో పోటీ పడాలంటే సిబిఎస్‌ఇ విధానమే సరైన మార్గమని రాసేశారు. మొదటి సంవత్సరం పరీక్షలు రద్దు చేయాలని కూడా ప్రతిపాదించారు. ఈ ముసాయిదా కార్పొరేట్ విద్యాసంస్థలను బలపరుస్తూ ప్రభుత్వ, చిన్న ప్రైవేటు విద్యాసంస్థలను బలహీనపరిచేదిగా ఉన్నట్లు స్పష్టం చేస్తున్నది. మొత్తం విద్యను నీట్, జెఈఈ చుట్టూనే తిప్పారు.

ఏదైనా మార్పులు ప్రతిపాదిస్తున్నప్పుడు రాష్ట్రంలో దాని భౌతిక పరిస్థితిని అర్థం చేసుకోవాలి. కేంద్రం చెప్పిందని, 15 రాష్ట్రాలు ఇదే విధానాన్ని కొనసాగిస్తున్నాయని మనం కూడా అదే దారిలో వెళ్ళాలంటే ఎలా? రాష్ట్రంలో ముఖ్యంగా ఇంటర్మీడియట్ విద్యలో కార్పొరేట్ ఆధిపత్యం నడుస్తున్నది. తీవ్రమైన విద్యా వ్యాపారం కొనసాగుతున్నది. వారి దోపిడీకి ఈ ముసాయిదా అడ్డుకట్ట వెయ్యకపోగా మరింత వ్యాపారం చేసుకునేందుకు అవకాశం కల్పిస్తుంది.



కె. ప్రసన్న కుమార్

సిబిఎస్ఇతో ఒరిగేదేమిటి?

సిలబస్‌లో చేసే నూతన మార్పులు, చేర్పులు ఆహ్వానించాలి. అయితే అవి విద్యార్థులకు పరీక్షలలో మనోధైర్యాన్ని నింపేలా, శాస్త్రీయతకు అద్దం పట్టేలా ఉండాలి. ఇప్పటికే సిబిఎస్‌ఇ రాష్ట్రంలో పదవ తరగతి వరకూ ప్రవేశపెట్టారు. ఫలితంగా విద్యార్థుల్లో ప్రమాణాలు పడిపోయాయి. విఫలమైన ప్రయోగాన్ని ఇంటర్మీడియట్‌లో అమలుకు పూనుకోవడం ఎంత వరకూ సరైనది? విద్యార్థుల్లో పరిశీలనా శక్తి, సృజనాత్మకత పెంచడానికి సిబిఎస్‌ఇ అంటున్నారు. కేంద్రం రూపొందించే సిలబస్ కాషాయీకరణ, అబద్ధాలు, అశాస్త్రీయతతో నిండిపోతున్న తరుణంలో విద్యార్థుల్లో నైపుణ్యం ఎలా పెరుగుతుంది? డార్విన్ సిద్ధాంతాన్నే తొలగించాలనే ప్రయత్నం చేసిన సిబిఎస్‌ఇకి ఎలాంటి శాస్త్రీయ ఆలోచన ఉంటుందో అవగతం చేసుకోవాలి.

తెలుగుకు ఎగనామం

సైన్స్‌లో ఆరు సబ్జెక్టులు, ఆర్ట్స్‌లో ఐదు సబ్జెక్టుల విధానాన్ని కొన్ని విశ్వవిద్యాలయాలు గుర్తించేందుకు సుముఖత చూపుతున్నాయనే కారణంతో ఈ విధానాన్ని ప్రతిపాదించింది. ఐదు సబ్జక్టులతో పాస్ అయిన వారిని ఆరు సబ్జక్టులతో పాస్ అయిన వారితో సమానంగా చూస్తారు. ఆంగ్లం ఒక పాఠ్యాంశంగా అందరికీ తప్పనిసరి చేసింది. ద్వితీయ భాష తెలుగు తప్పనిసరి కాదు. ఛాయిస్ రూపంలో ఇచ్చారు. ఇప్పటికీ తెలుగు, సంస్కృతం, హిందీ, ఉర్దూ అమలు జరుగుతున్నాయి. వాటి స్థానంలో 23 పాఠ్యాంశాలు ఇచ్చి దానిలో ఎంపిక చేసుకోవాలని చెప్పారు. ఇది విద్యార్థికి ఛాయిస్‌గా కాకుండా విద్యార్థి చదివే విద్యాసంస్థలో ఏ కోర్సు ఉంటే అదే కోర్సును చదవాల్సి ఉంటుంది. తెలుగును చంపి బలవంతంగా హిందీని లేదా సంస్కృతాన్ని రుద్దే ప్రయత్నంగా భావించవచ్చు.

అంతర్గత మార్కులతో తీవ్ర ఒత్తిడి

సిబిఎస్‌ఇ పరీక్షా విధానాన్ని అమలు చేయాలని డ్రాఫ్ట్ ప్రతిపాదించింది. పాఠశాల విద్యలో 75,843 మంది విద్యార్థులకు టీచింగ్, లెర్నింగ్ సామర్థ్య అంచనా పరీక్షలు నిర్వహిస్తే వాటిలో విద్యార్థులు పూర్తిగా విఫలం అయ్యారు. దానితో పాఠశాల విద్యాశాఖ రాష్ట్ర బోర్డు పరీక్షలు నిర్వహించాలని ప్రకటించింది. పాఠశాల విద్యలో ఇప్పటికే ఫెయిల్ అయిన పరీక్షా విధానం ఇంటర్మీడియట్‌లో ఎలా సాధ్యపడుతుంది? సిబిఎస్‌ఇ నమూనా ప్రకారం థియరీ పరీక్షలు, అంతర్గత, ప్రయోగ పరీక్షల మార్కులు ప్రతిపాదించారు. అంతర్గత మార్కులను చూపించి విద్యార్థులపై తీవ్రమైన ఒత్తిడి చేస్తారు. ఫీజులను ఇష్టానుసారంగా వసూలు చేస్తారు. ఒక రకంగా చెప్పాలంటే అంతర్గత మార్కులతో విద్యార్థి హక్కులను కార్పొరేటు విద్యాసంస్థలు కాలరాస్తాయి. విద్యావ్యాపారం రద్దయ్యే వరకు ఇంటర్నల్స్ మంచిది కాదు. ఒక మార్కు ప్రశ్నలు, ఖాళీలు పూరించడం, ఏకవాక్య సమాధానాలు రాయడం వంటివి మార్కులు సులభతరం చేస్తాయి. విద్యా వ్యాపారం రద్దు చెయ్యకుండా ఇటువంటి సంస్కరణలు చేస్తే మరింత నష్టం జరుగుతుంది.

పరీక్ష రద్దు చేస్తే ఒత్తిడి తగ్గుతుందా?

విద్యార్థులపై పరీక్ష ఒత్తిడి తగ్గించాలనే ఏకైక లక్ష్యంతో మొదటి సంవత్సర పరీక్షలు రద్దుకు డ్రాఫ్ట్ ప్రతిపాదించింది. పైగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు మినహా ఇతర రాష్ట్రాలు ఇదే విధానాన్ని కొనసాగిస్తున్నాయని తెలిపింది. జెఈఈ, నీట్ పరీక్షలపై విజయం సాధించాలనే అవకాశం ఏర్పడుతుందని, అందుకే పరీక్షలు రద్దు చేస్తున్నామని చెప్పుకొచ్చారు. బిఐఈ పాఠ్యాంశాలు, పరీక్షలు విద్యార్థులకు భారం కాలేదు. మార్కులు ర్యాంకుల మోజులో కార్పొరేట్ సంస్థలు విద్యార్థులపై ఒత్తిడి చేస్తున్నారే తప్ప ఉన్న విధానం వలన ఒత్తిడి రావడంలేదని గుర్తెరగాలి. ఆటలు ఉండవు. కళాశాలలు జైళ్లను తలపిస్తుంటాయి. 5 గంటల నుండి రాత్రి 9 గంటల వరకూ విద్యార్థులకు తరగతులు ఉంటాయి. ఈ ఒత్తిడిని తట్టుకోలేక విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఇతర రాష్ట్రాలతో పోటీ ఉండాలి. మన రాష్ట్ర విద్యార్థులు అన్నింటిలోనూ ముందు పీఠిన ఉండాల్సిందే. దీనిని ఎవ్వరూ కాదనరు. కానీ పోటీ పేరుతో పరీక్షలను రద్దు చేయడం విద్యార్థుల్లో జవాబుదారీతనం లోపిస్తుంది. ప్రభుత్వ విద్యా వ్యవస్థ, చిన్న మధ్య తరహా ప్రైవేటు విద్యాసంస్థలు కుదేలవుతాయి. కర్ణాటకలో మొదటి సంవత్సరం పబ్లిక్ పరీక్ష లేకపోడం అనేక అనర్థాలకు తావివ్వడం ప్రత్యక్షంగా చూస్తున్నాము. కర్ణాటక కన్నా ఉభయ తెలుగు రాష్ట్రాల విద్యార్థులు విజయాలను సాధించడానికి ఎప్పటికపుడు పెడుతున్న పబ్లిక్ పరీక్షలే ముఖ్య కారణం. పరీక్ష రద్దు నిర్ణయం పూర్తిగా విద్యను పేద పిల్లలకు దూరం చేసే నిర్ణయం.

సెంట్రల్ గవర్నమెంట్ పాఠశాలలు మినహా మిగిలిన అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో బిఐఈ విధానమే అమలు జరగాలి. కరిక్యులమ్, బోధనా పరమైన అంశాలలో రాష్ట్రాల నియంత్రణ చాలా ముఖ్యమైనది. రాష్ట్రాల ఆర్థిక, సామాజిక స్థితిగతుల నేపథ్యానికి అనుగుణంగా విద్యా విధానాన్ని రూపొందించుకోవాలి. ఉమ్మడి జాబితాలో ఉన్న విద్యను కేంద్రం ఒక్కొక్కటిగా తన ఆధీనంలోకి తీసుకుంటున్నది. విద్యా వ్యాపారం రద్దు చెయ్యకుండా ఇటువంటి సంస్కరణలు చేస్తే మరింత నష్టం చేకూరుతుంది. ఈ ప్రతిపాదనలకు వ్యతిరేకంగా మేధావులు, విద్యావేత్తలు, విద్యార్థులు నడుం బిగించాలి.

/ వ్యాసకర్త ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షులు,
సెల్ : 7396503105 /

జనవాక్యం

వన్నె తగ్గుతున్న 'పద్మాలు'

గతంలో పద్మశ్రీ అన్నా, పద్మభూషణ్ అన్నా ఎంతో విలువ ఉండేది. సమాజానికి రకరకాల సేవలు చేసిన వారికి గుర్తింపుగా ఇచ్చేవారు. రానురాను ఆ పద్మాల వన్నె తరిగిపోతున్నట్లుగా భావించాల్సి వస్తున్నది. ఇపుడు కుల సంఘ నాయకులకు, ఆవారాలకు, మతోన్మాదులకు పద్మశ్రీలు ఇవ్వటం చూసి జనం నవ్వుకుంటున్నారు. ఓట్ల కోసం పద్మశ్రీలు ఇస్తున్నట్లుగా ప్రజలు అనుకుంటున్నారు. 2006 ప్రాంతంలో అమెరికాలోని లాస్‌ఏంజిల్స్‌లో మాడుగుల నాగఫణి శర్మ అనే వ్యక్తి అక్కడి ఆడవారిచేత తన్నులు తిన్నాడు. అక్కడి మహిళలు ఆయన మీద కేసు పెట్టారు. నాగఫణి శర్మ ఇండియాకు వచ్చి తనపై కేసు పెట్టినవారిని శపిస్తానని ప్రకటన ఇచ్చాడు. ఇపుడు ఆయనకు పద్మశ్రీ ఇచ్చారు. ఈ పద్మశ్రీ ఎవరికోసం ఇచ్చినట్లు? ప్రజాధనం ఇలా వృథా చేసే అధికారం ఈ ప్రభుత్వానికి ఎవరు ఇచ్చారు? కనుక ఇలాంటి వ్యక్తికి ఇచ్చిన 'పద్మశ్రీ' ని రద్దుపరచాలి. అంతేకాక, ఈ ప్రభుత్వం భేతాళ మాంత్రికులకు, బాబాలకు, స్వాములకు ప్రాధాన్యత ఇస్తున్నట్లుగా అనిపిస్తుంది. అశాస్త్రీయమైన పుష్కరాలకు ప్రభుత్వం ప్రాముఖ్యత ఇస్తున్నది. ప్రపంచం శాస్త్ర సాంకేతిక రంగాలలో ఎంతో ముందుకు పోతున్నది. కానీ మనము మాత్రం వళ్లంతా బూడిద పూసుకొని వికృతాకారంతో కనిపించే నగ్న సాధువులను అవతార పురుషుల్లా కీర్తించే స్థాయికి ఎగబాకుతున్నాం. ఇందుకు మనం సిగ్గుపడాలి.

- నార్నె వెంకట సుబ్బయ్య,
భారత హేతువాద సంఘం అధ్యక్షుడు.

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :
editpageps @gmail.com

ప్రతి ఇంటిలో ఎఐ నిపుణులు

- ఆర్‌టిజిఎస్ సమీక్షలో సిఎం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రతి ఇంటిలోనూ ఒక ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఎఐ) నిపుణులుఉండాలనేది ప్రభుత్వ ఆశయమని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. రాష్ట్ర సచివాయలంలో ఆర్‌టిజిఎస్‌పై సోమవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి కుటుంబలోనూ ఎఐని వినియోగించుకునే విధంగా ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. ఒకప్పుడు ఐటిని సొంతం చేసుకున్నామని, ప్రభుత్వంలో టెక్నాలజీని ఉపయోగించుకోవడం వల్ల పని మెరుగవుతుందని, మరిన్ని సేవలు అందించగలుగుతామని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు ఏ విధంగా చేరుతున్నాయి, ఎక్కడైనా లోపాలున్నాయా, ఉంటే ఎందుకున్నాయనే అంశాలను రియల్‌టైమ్‌లో విశ్లేషించాలని తెలిపారు. 15 నుండి 20 శాతం వృద్ధి లక్ష్యంగా ప్రభుత్వ శాఖలన్నీ పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ శాఖలు తమ డేటాను ఆర్‌టిజిఎస్‌తో అనుసంధానం చేస్తే దాన్ని ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ద్వారా విశ్లేషించి ఆయా ప్రభుత్వ శాఖల్లో అమలు చేయదగ్గ విషయాలను గూగూల్ సంస్థ సూచిస్తుందని తెలిపారు. దీనికోసం ఇప్పటికే గూగుల్‌తో ఒప్పందం చేసుకున్నట్లు వివరించారు. వాట్సాప్ గవర్నెన్స్ సేవలు త్వరలో ప్రారంభించనున్నామని చెప్పారు. జనన మరణ ధృవీకరణ పత్రాలు కూడా వాట్సాప్ ద్వారా పౌరులు పొందేందుకు సదుపాయం కల్పించాలన్నారు. అయితే ఈ సర్టిఫికెట్ల జారీ ద్వారా ఎలాంటి అపోహలకు విమర్శలకు తావివ్వకుండా పకడ్బందీగా చేయాలన్నారు. ఆర్‌టిజిఎస్ ముఖ్యకార్యనిర్వహణాధికారి కె.దినేష్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వశాఖల డేటాను అనుసంధానం చేసే ప్రక్రియ వేగవంతం చేస్తున్నట్లు చెప్పారు. సేకరించిన డేటా ఆధారంగా ప్రతిగ్రామానికి ఒక ప్రత్యేక ప్రొఫైల్ రూపొందిస్తున్నట్లు చెప్పారు.

ప్రభుత్వంలో 40 శాఖలకు సంబంధించి వివిధ శాఖాధిపతులు, విభాగాధిపతుల వద్ద ఉన్న డేటాను సేకరించి అనుసంధానిస్తామని అన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ డేటాలో లేకుండా ఉన్న పౌరులకు సంబంధించిన వివరాలనూ సేకరించామని చెప్పారు. 2024 సెప్టెంబరులో రాష్ట్రంలో 1,67,63,812 గృహాలుంటే ఉంటే ఆ సంఖ్య జనవరి 2025 నాటికి 1,69,63,228కి పెరిగిందని చెప్పారు. రాష్ట్ర జనాభా సెప్టెంబరు 2024 నాటికి 4,90,83,312 మంది ఉంటే, జనవరి 2025 నాటికి 5,12,45,147కు చేరిందని చెప్పారు. 24 లక్షల మంది రాష్ట్రంలోనే ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతానికి వలస వెళ్లారని అలాంటి వారి డేటాను సేకరించి వారికి స్థానికంగా అనుసంధానం చేస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలో 1.69 కోట్ల కుటుంబాలకుగాను 1.63 కోట్ల కుటుంబాలను జియో ట్యాగింగ్ చేసినట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, సిఎం కార్యదర్శులు రాజమౌళి, పిఎస్.ప్రద్యుమ్న, రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పి సిసోడియా, వైద్యఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు, పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్, ఆర్‌టిజిఎస్ కార్యదర్శి కాటంనేని భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో 875 డ్రోన్ కేంద్రాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో వ్యవసాయ యాంత్రీకరణకు గ్రామ స్థాయిలో 875 డ్రోన్ యాంత్రీకరణ కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు వ్యవసాయశాఖ చర్యలు తీసుకుంటుందని ఆ శాఖ అధికారులు వెల్లడించారు. ఇందుకోసం రూ.70 కోట్ల సబ్సిడీని రైతు సంఘాలకు అందించనున్నట్లు సోమవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. రూ.10 లక్షల యూనిట్ విలువగా ఉంటుందని, 50 శాతం బ్యాంక్ రుణం, 80 శాతం సబ్సిడీ ఇవ్వనున్నట్లు తెలిపారు. కేంద్రాల ఏర్పాటుకు అన్ని జిల్లాల్లోని వాణిజ్య పంటలు, పిచికారీ అవసరం అధికంగా ఉన్న పంటలు, ఒకే పంట అధికంగా పండించే మండలాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఎంపిక చేసిన రైతు సేవా కేంద్రాల (ఆర్‌ఎస్‌కె) పరిధిలోని గ్రామాల్లో భూమి కలిగి ఉండి, వ్యవసాయం చేస్తూ, యాంత్రీకరణ కేంద్రం ఆధ్వర్యంలో అద్దెకు యంత్ర సేవలు అందిస్తూ ఆదాయం సంపాదించడానికి ఉత్సుకత కలిగిన నలుగురి నుంచి ఐదుగురు రైతులతో సంఘాలు ఏర్పాటు చేశామన్నారు.

ఈ సంఘాలకు డ్రోన్ల కొనుగోలుకు అవసరమైన ఆర్థిక సాయం రుణం రూపంలో ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని, ఆచార్య ఎన్‌జి రంగా విశ్వవిద్యాలయం సాంకతిక సహాయాన్ని ఇస్తుందని తెలిపారు. ఇందు కోసం వ్యవసాయశాఖ డైరెక్టర్ ఆధ్వర్యాన కమిటీని నియమించినట్లు పేర్కొన్నారు.

రేర్ అసెట్ రీకన్‌స్ట్రక్షన్ లిమిటెడ్

రిజిష్టర్డు ఆఫీసు: 104-106, గాలా అరోస్, హరికృపా టవర్ దగ్గర, గుజరాత్ కాలేజ్ రోడ్, అహ్మదాబాద్-380006. ఫోన్: 079-40092295

స్వాధీనతా ప్రకటన (అనుబంధం 4 (రూల్ 8(1))

ఏదైతే, క్రింది సంతకందారుడు **రేర్ అసెట్ రీకన్‌స్ట్రక్షన్ లిమిటెడ్** (ఇకమీదట "రేర్ ఏఆర్‌సి"గా పేర్కొనబడును) యొక్క అధీకృత అధికారిగా, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 (SARFAESI చట్టం, 2002) క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 3తో చదవగల సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ సదరు నోటీసు స్వీకరణ తేదీ నుండి 60 రోజుల్లోగా నోటీసులో పేర్కొన్న మొత్తం **31 ఆగష్టు, 2023** నాటికి **రూ.10,65,192/-(రూపాయలు పది లక్షల అరవై ఐదు వేల నూట తొంభై రెండు మాత్రమే)** సెప్టెంబర్ 01, 2023 నుండి అమలులోకి వచ్చేలా ఒప్పంద రేట్ల ప్రకారం వడ్డీ, తదుపరివడ్డీ, జరిమానా వడ్డీ మరియు ఇతర ఛార్జీలతో కలిపి తిరిగిచెల్లించమని రుణగ్రహీత **శ్రీ.శివా రెడ్డి కోట్ల (రుణగ్రహీత), శ్రీమతి అరుణ కోట్ల (సహ-రుణగ్రహీత), శ్రీ.వెంకటరాజశేఖర్ రెడ్డి బొచ్చు(హామీదారు)**వారిని కోరుతూ **తేది.18.10.2023నాటి డిమాండ్ నోటీసు** జారీచేయడమైనది.

రుణగ్రహీత/సహా-రుణగ్రహీత/హామీదారులు మొత్తాలను తిరిగి చెల్లించుటలో విఫలం చెందినందున, ఇందుమూలంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలకు నోటీసు ఇవ్వడమేమనగా, దిగువ సంతకందారు సదరు రూల్స్‌లోని రూల్ 8తో చదవగల సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అతనికి/ఆమెకు సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ దిగువ వివరించిన ఆస్తిని **22 జనవరి, 2025న స్వాధీనంలోకి తీసుకోవడమైనది.** సెక్యూర్డు అసెట్స్ విమోచనానికి అందుబాటులోవున్న సమయానికి సంబంధించి చట్టంలోని సెక్షన్ 13(8) యొక్క నియమాల క్రింద రుణగ్రహీతల శ్రద్ధను కోరుతున్నారు.

ప్రత్యేకంగా రుణగ్రహీతలు మరియు సాధారణ ప్రజలను ఇందుమూలంగా హెచ్చరించడమేమనగా, ఆస్తితో ఏవిధమైన లావాదేవీలు జరుపరాదని మరియు ఆస్తితో ఏవేని లావాదేవీలను జరపదలచిన వారు **రేర్ అసెట్ రీకన్‌స్ట్రక్షన్ లిమిటెడ్** వారికి **31 ఆగష్టు, 2023** నాటికి **రూ.10,65,192/-(రూపాయలు పది లక్షల అరవై ఐదు వేల నూట తొంభై రెండు మాత్రమే)**, సెప్టెంబర్ 01, 2023 నుండి అమలులోకి వచ్చేలా ఒప్పంద రేట్ల ప్రకారం వడ్డీ, తదుపరి వడ్డీ, జరిమానా వడ్డీ మరియు ఇతర ఛార్జీలతో చెల్లించుటకు లోబడి ఉంటుంది. ప్రచురణ చేయబడుతున్నది.

స్థిరాస్తులకు సంబంధించిన వివరణ:

ఆర్.డి. యడ్లపాడు మరియు ఎస్‌ఆర్‌డి గుంటూరు మరియు గుంటూరు మున్సిపల్ పరిమితులు, వంకాయలపాడు ఏరియాలోని సర్వే నెం.371/1ఏ మరియు 371/3ఏ లోని 240 చ.గ.ల పూర్తి విస్తీర్ణంలోని డోర్ నెంబరు 26 కలిగిన నివాసిత ఓపెన్ ప్లాట్ మొత్తం భాగం మరియు వీటి సరిహద్దులు: సరిహద్దులు: ఉత్తరం: ఓపెన్ స్పేస్ సైట్ 60 అ.లు, దక్షిణం: ప్లాట్ నెం.27 సైట్ 60అ.లు, తూర్పు: 40 అ.ల రోడ్డు మరియు పడమర: ఓపెన్ స్పేస్ సైట్ 36 అ.లు.

తేది: 22-01-2025
ప్రదేశం: గుంటూరు

సం/- అధీకృత అధికారి
రేర్ అసెట్ రీకన్‌స్ట్రక్షన్ లిమిటెడ్

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

అస్సెట్ రికవరీ బ్రాంచి (79170), విజయవాడ, 4వ అంతస్తు, ఆంధ్రా బ్యాంక్ భవనం, ఆర్.ఆర్. అప్పారావు వీధి, విజయవాడ, ఏపి-520001.

అమ్మకం గురించి ఋణగ్రహీతకు తెలియపరుచు ప్రకటన (30 రోజుల ప్రకటన)
(RULE 6(2)/RULE 8(6) OF SECURITY INTEREST (ENFORCEMENT) RULES 2002)

ఋణగ్రహీతలు/కో ఆబ్లిగెంట్స్ / తనఖాదారులు / హామీదారులు: 1.ఏ) శ్రీ పొట్టి చిన్న వెంకట సాంబశివ రావు, తండ్రి: శ్రీ.పెద్ద రాములు, డి.నెం. 5-177, సన్నిధివారి వీధి, హెడ్ పోస్టాఫీసు, వినుకొండ, పల్నాడు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522647. **1.బి) శ్రీమతి పొట్టి మెహర్ సుజాత,** తండ్రి: శ్రీ పొట్టి చిన్న వెంకట సాంబశివ రావు, డి.నెం. 5-177, సన్నిధివారి వీధి, హెడ్ పోస్టాఫీసు, వినుకొండ, పల్నాడు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522647.

విషయం: సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ & ఎన్ఫోర్సెమెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 ప్రకారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అస్సెట్ రికవరీ బ్రాంచి (79170) వారికి శ్రీ పొట్టి చిన్న వెంకట సాంబశివ రావు కి చెందిన బకాయి వసూలు కొరకు మీకు చెందిన ఆస్తి అమ్మకం.

చట్టం 13(2) విభాగం పరిధిలో నేను/బ్యాంక్ డిమాండ్ నోటీసు **తేది.08-06-2023** ద్వారా మీకు డిమాండ్ పంపినప్పటికీ మీరు బ్యాంక్‌కు చెల్లించవలసిన బకాయి మొత్తం చెల్లించుటలో మీరు విఫలమైనారు.

పైన చెప్పిన చట్టం పరిధిలో సంక్రమించిన అధికారాలతో ఈ దిగువ తెలిపిన ఆస్తిని **తేది.04-07-2024** న అధీకృత అధికారి లాంఛనాత్మక స్వాధీన పరచుకున్నారు.

ఆస్తిని స్వాధీన పరచుకున్న తర్వాత కూడా, మీరు **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అస్సెట్ రికవరీ బ్రాంచి (79170)** కు చెల్లించవలసిన బకాయి మొత్తమును మీరు చెల్లించలేదు. అందువలన, ఈ నోటీసు తేదీ నుండి 30 దినములు తర్వాత దిగువ తెలిపిన ఆస్తిని ఇ-వేలం ద్వారా విక్రయించవలసిన అవసరం ఏర్పడినది. విధిగా జారీచేయబడు అమ్మకం ప్రకటన ద్వారా, వేలం తేదీ మరియు సమయం మరియు సర్వీస్ ప్రొవైడర్ వివరములు తెలియచేస్తూ ఇదివరకు మరియు "హెచ్చు ధర ఆఫర్ చేసిన వ్యక్తికి ఆస్తి విక్రయించబడుతుంది. కాబట్టి, అస్తులను ప్రైవేటు అమ్మకం ద్వారా కూడా విక్రయించవచ్చును. లేదా వ్యక్తుల నుండి కొటేషన్లు కూడా పొందవచ్చును. బ్యాంక్ ఆమోదయోగ్యమైన మరియు కొనుగోలుదారుని ఉద్దేశించిన నిబంధనలు మరియు షరతులకు లోబడి ఆస్తి విక్రయించవచ్చును.

మీరు ప్రైవేటు అమ్మకం ద్వారా లేదా కొటేషన్ పొందడం ద్వారా ఆస్తిని విక్రయించ దలిచినట్లయితే, ప్రతిపాదనలను కలిగి ఉన్నట్లయితే, ఈ నోటీసు అందిన తేదీ నుండి 7 రోజులలోపుగా దానిని బ్యాంక్‌కు తెలియజేయాలి.

విఫలమైనచో, మీకు అలాంటి ప్రతిపాదన ఏమి లేదని పైన సూచించిన ప్రకారం ఇ-వేలం ద్వారా ఆస్తి విక్రయం చేయుటకు బ్యాంక్ తదుపరి ప్రక్రియ కొనసాగిస్తుంది.

ఇ-వేలం ప్రకటన ప్రచురణ తేదీన లేదా అలోగా బ్యాంక్ డిమాండ్ నోటీసు **తేది.08-06-2023** నందు సూచించిన పూర్తి మొత్తంతో పాటు చెల్లించు తేదీ వరకు అయ్యే తదుపరి వడ్డీ మరియు అనుషంగిక సంభవించిన ఖర్చులు మరియు వ్యయాలు చెల్లించి ఆస్తిని విడిపించుకోవచ్చును దయచేసి మీరు గమనించగలరు. ఇట్టి విషయంలో షెడ్యూలులో తెలిపిన ఆస్తి అమ్మకానికి తదుపరి వేలం ఉండదు. చట్టంలోని సెక్షన్ 13(8) ప్రకారం విముక్తి హక్కు అందుబాటులో ఉంది.

షెడ్యూల్ ఆస్తి

తనఖా పెట్టబడిన అస్తుల వివరాలు దిగువ వివరించబడ్డాయి: పల్నాడు జిల్లా, వినుకొండ మున్సిపాలిటీ & సబ్ జిల్లా, పాత్ర ఆఫీస్ వీధి, బోసు బొమ్మ సెంటర్, సన్నిధి వారి వీధి, సర్వే నెం.390/1బీ, డోర్.నెం.15-42, 15-44 (పాత డోర్ నెం.15-38, 15-39)లో 49.88 చ.గ.లు లేదా 41.705 చ.మీ.లలో గల నివాస ఇంటి (గ్రౌండ్, మొదటి అంతస్తు & రెండవ అంతస్తు గల ఆర్‌సిసి పద్ధులు ఉత్తరం: అన్నపూర్ణ సత్రం కొట్టు-23.0 అడుగులు, దక్షిణం: ఖజ్జయం కృష్ణయ్య గారి ఇల్లు-22.9 అడుగులు, తూర్పు: టంగుటూరి సత్యనారాయణ గారి ఇల్లు-19.8 అడుగులు, పడమర: మున్సిపల్ సిమెంట్ రోడ్డు-19.7 అడుగులు. రిజిస్టర్ వినుకొండ సబ్-ఆర్.ఓ ప్రకారం సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం.9232/2015, తేది. 16-12-2015.

తేది: 20-01-2025
ప్రదేశం: విజయవాడ

అధీకృత అధికారి
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

అస్సెట్ రికవరీ బ్రాంచి (79170), విజయవాడ, 4వ అంతస్తు, ఆంధ్రా బ్యాంక్ భవనం, ఆర్.ఆర్. అప్పారావు వీధి, విజయవాడ, ఏపి-520001.

అమ్మకం గురించి ఋణగ్రహీతకు తెలియపరుచు ప్రకటన (30 రోజుల ప్రకటన)
(RULE 6(2)/RULE 8(6) OF SECURITY INTEREST (ENFORCEMENT) RULES 2002)

ఋణగ్రహీతలు/కో ఆబ్లిగెంట్స్ / తనఖాదారులు / హామీదారులు: 1.ఏ) శ్రీ భైరపు తిరుపతి రావు, తండ్రి: భైరపు రాఘవయ్య, డోర్ నెం: 174, ధూళిపాళ్ల (గ్రామం), సత్తెనపల్లె మండలం, పల్నాడు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522403. **1.బి) శ్రీమతి భైరపు గోవిందమ్మ,** భర్త: శ్రీ భైరపు తిరుపతి రావు, డోర్ నెం: 174, ధూళిపాళ్ల (గ్రామం), సత్తెనపల్లె మండలం, పల్నాడు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522403.

విషయం: సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ & ఎన్ఫోర్సెమెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 ప్రకారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అస్సెట్ రికవరీ బ్రాంచి (79170) వారికి శ్రీ భైరపు తిరుపతి రావుకి చెందిన బకాయి వసూలు కొరకు చెందిన ఆస్తి అమ్మకం.

చట్టం 13(2) విభాగం పరిధిలో నేను/బ్యాంక్ డిమాండ్ నోటీసు **తేది.10-05-2021** ద్వారా మీకు డిమాండ్ పంపినప్పటికీ మీరు బ్యాంక్‌కు చెల్లించవలసిన బకాయి మొత్తం చెల్లించుటలో మీరు విఫలమైనారు.

పైన చెప్పిన చట్టం పరిధిలో సంక్రమించిన అధికారాలతో ఈ దిగువ తెలిపిన ఆస్తిని **తేది. 19-08-2021** న అధీకృత అధికారి లాంఛనాత్మక స్వాధీన పరచుకున్నారు.

ఆస్తిని స్వాధీన పరచుకున్న తర్వాత కూడా, మీరు **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అస్సెట్ రికవరీ బ్రాంచి (79170)** కు చెల్లించవలసిన బకాయి మొత్తమును మీరు చెల్లించలేదు. అందువలన, ఈ నోటీసు తేదీ నుండి 30 దినములు తర్వాత దిగువ తెలిపిన ఆస్తిని ఇ-వేలం ద్వారా విక్రయించవలసిన అవసరం ఏర్పడినది. విధిగా జారీచేయబడు అమ్మకం ప్రకటన ద్వారా, వేలం తేదీ మరియు సమయం మరియు సర్వీస్ ప్రొవైడర్ వివరములు తెలియచేస్తూ ఇదివరకు మరియు "హెచ్చు ధర ఆఫర్ చేసిన వ్యక్తికి ఆస్తి విక్రయించబడుతుంది. కాబట్టి, అస్తులను ప్రైవేటు అమ్మకం ద్వారా కూడా విక్రయించవచ్చును. లేదా వ్యక్తుల నుండి కొటేషన్లు కూడా పొందవచ్చును. బ్యాంక్ ఆమోదయోగ్యమైన మరియు కొనుగోలుదారుని ఉద్దేశించిన నిబంధనలు మరియు షరతులకు లోబడి ఆస్తి విక్రయించవచ్చును.

మీరు ప్రైవేటు అమ్మకం ద్వారా లేదా కొటేషన్ పొందడం ద్వారా ఆస్తిని విక్రయించ దలిచినట్లయితే, ప్రతిపాదనలను కలిగి ఉన్నట్లయితే, ఈ నోటీసు అందిన తేదీ నుండి 7 రోజులలోపుగా దానిని బ్యాంక్‌కు తెలియజేయాలి.

విఫలమైనచో, మీకు అలాంటి ప్రతిపాదన ఏమి లేదని పైన సూచించిన ప్రకారం ఇ-వేలం ద్వారా ఆస్తి విక్రయం చేయుటకు బ్యాంక్ తదుపరి ప్రక్రియ కొనసాగిస్తుంది.

ఇ-వేలం ప్రకటన ప్రచురణ తేదీన లేదా అలోగా బ్యాంక్ డిమాండ్ నోటీసు **తేది. 10-05-2021** నందు సూచించిన పూర్తి మొత్తంతో పాటు చెల్లించు తేదీ వరకు అయ్యే తదుపరి వడ్డీ మరియు అనుషంగిక సంభవించిన ఖర్చులు మరియు వ్యయాలు చెల్లించి ఆస్తిని విడిపించుకోవచ్చును దయచేసి మీరు గమనించగలరు. ఇట్టి విషయంలో షెడ్యూలులో తెలిపిన ఆస్తి అమ్మకానికి తదుపరి వేలం ఉండదు. చట్టంలోని సెక్షన్ 13(8) ప్రకారం విముక్తి హక్కు అందుబాటులో ఉంది.

షెడ్యూల్ ఆస్తి

తనఖా పెట్టబడిన అస్తుల వివరాలు దిగువ వివరించబడ్డాయి: **ఐటమ్ నెం.1:** పల్నాడు జిల్లా, సత్తెనపల్లె మండలం, ధూళిపాళ్ళ (గ్రామం, వార్డు నెం:7, డి.నెం: 378-బిలో ఉన్న 145.00 చ.గజాల విస్తీర్ణంలో గల రెసిడెన్షియల్ భూమి & బిల్డింగ్ భైరపు తిరుపతిరావుకు చెందిన హద్దులు: **తూర్పు:** తొండెపి రోడ్డు, **దక్షిణం:** పంచాయతీ స్థలం (ఐటమ్ నెం.2) మరియు రావెండి వీరాంజనేయులు మరియు ఇతరుల ఇల్లు, **పడమర:** బజార్, **ఉత్తరం:** తుమాటి శ్రీను, రావుండి నాగేశ్వరరావు స్థలం. రిజిస్టర్ సత్తెనపల్లె ప్రకారం సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం.489/2013, తేది. 30.01.2013.

ఐటమ్ నెం.2: పల్నాడు జిల్లా, సత్తెనపల్లె మండలం, ధూళిపాళ్ళ (గ్రామం, వార్డు నెం:7, డి.నెం: 378-బిలో ఉన్న 80.00 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్న నివాస ఖాళీ స్థలం భైరపు తిరుపతిరావుకు చెందినది. హద్దులు: **తూర్పు:** తొండెపి రోడ్డు, **దక్షిణం:** షేక్ బీబి స్థలం, **పడమర:** రావెండి వీరాంజనేయులు గారి స్థలం, **ఉత్తరం:** ఐటెమ్ నెం.1 ఆస్తి. ఎస్.ఆర్.ఓ సత్తెనపల్లె ప్రకారం సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం.5050/2015, తేది. 02.04.2015.

తేది: 20-01-2025
ప్రదేశం: విజయవాడ

అధీకృత అధికారి
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్

కార్పొరేట్ ఆఫీసు : "చోలా క్రెస్ట్", సి54 మరియు 55, సూపర్ బి-4, తిరు.వి.క. ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండీ, చెన్నై-600032.
శాఖ చిరునామా : 9-11-5-ఎ, 1వ అంతస్తు, మహమ్మద్ మొహిద్దీన్ ముస్తాజ్ మ్యాన్షన్, అరండల్‌పేట, నరసరావుపేట, గుంటూరు (జిల్లా)-522601.

రూల్ 8(1) క్రింద స్వాధీనతా నోటీసు

ఏదైతే, దిగువసంతకందారు అయిన **మెసర్స్.చోలమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్** అధీకృత అధికారి, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ యాక్ట్, 2002 ఇకపై చట్టంగా పిలువబడుతుంది క్రింద మరియు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువుతూ సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని డిమాండ్ నోటీసు జారీచేసి రుణగ్రహీతలు, ఎవరి పేర్లయితే క్రింద సూచించిన తేదీల వరకు ... మొత్తాన్ని తిరిగి చెల్లించవలసిందిగా కోరడమైనది.

	రుణగ్రహీత పేరు మరియు చిరునామా మరియు రుణ ఖాతా నం.	డిమాండ్ నోటీసు తేది	బకాయి మొత్తం	స్థిరాస్తి వివరణ	స్వాధీనత తేది
[A]	[B]	[C]	[D]	[E]	[F]
1)	వెంకటేశ్వర్లు నాగేంద్ర (దరఖాస్తుదారు), వెంకట రమణ నాగేంద్ర (సహ దరఖాస్తుదారు), ఇరువురి నివాసం : డో.నం.1-149-4, రెంటిచింతల, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522421. **శ్రీ లక్ష్మి గణపతి సిమెంట్స్ (సహ దరఖాస్తుదారు),** డో.నం.10-125, మెయిన్ రోడ్డు, రెంటచింతల, రెంటచింతల మండలం, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522421. **లోన్ అకౌంట్ నం.: HE01GUN00000046327**	08-10-2024	08-10-2024 నాటికి రూ. 37,84,517/- మరియు దానిపై వడ్డీ.	నరసరావుపేట ఆర్.డి. గురజాల ఉపజిల్లా, రెంటచింతల గ్రామ పంచాయతీ, రెంటచింతల గ్రామం వద్ద ఉన్న ఆస్తి ... చ.గ.లు. ఖాళీ సైట్ తో అన్ని సౌలభ్య హక్కులు. **హద్దులు: తూర్పు** : బజారు 16-09 అ.లు., **దక్షిణం** : డోరనాల అనంతరావమ్మ లోగిలి 70-03 అ.లు., **పడమర** : కొమ్మారెడ్డి చలమారెడ్డి సైట్ 19-03 అ.లు., **ఉత్తరం** : చపరపు శ్రీనివాసరెడ్డి లోగిలి 72-6 అ.లు.	23.01.2025

తేది : 28.01.2025
ప్రదేశం : రెంటచింతల

సం/- అధీకృత అధికారి
మెసెర్స్.చోలమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్

Utkarsh Small Finance Bank

Aapki Ummeed Ka Khaata
(A Scheduled Commercial Bank)

జోనల్ కార్యాలయం : వెంకట్ ప్లాజా 2, గ్రీన్ ల్యాండ్స్ రోడ్డు, పంజాగుట్ట ఆఫీసర్స్ కాలనీ, పంజా గుట్ట, హైదరాబాద్-500 082.
నమోదిత కార్యాలయం : ఉత్కర్ష్ టవర్, ఎన్‌హెచ్-31, (ఎయిర్‌పోర్ట్ రోడ్డు), సెహ్మాల్‌పుర్, ఖాజి సరై, హర్హువా, వారణాసి, యుపి-221105.

స్థిరాస్తి కొరకు స్వాధీనతా నోటీసు

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ (సెక్యూరిటీ) ఇంట్రెస్ట్ యాక్ట్ 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 3తో చదువుతూ సెక్షన్ 13(12) క్రింద అధికృత అధికారి అతనికి అదించిన అధికారాలను వినియోగించుకుంటూ ప్రతీ ఎకౌంట్‌కు వ్యతిరేకంగా పేర్కొన్న తేదిలపై సదరు నోటీసుల రసీదు తేది నుండి 60 రోజులలోపు మొత్తాన్ని తిరిగి చెల్లించాలని రుణగ్రహీతలను పిలుస్తూ డిమాండ్ నోటీసు జారీ చేయడమైందని ఇక్కడ నోటీసు ఇవ్వడమైనది.

రుణగ్రహీతలు మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున, రుణగ్రహీతలు మరియు సాధారణ ప్రజలకు నోటీసు ఇవ్వడమేమనగా ప్రతి ఎకౌంట్స్‌కు వ్యతిరేకంగా పేర్కొన్న తేదిలపై సదరు రూల్స్ యొక్క రూల్ 8తో చదువుతూ సెక్షన్ 13(4) క్రింద అతనికి/ఆమెకు అందించిన అధికారాలను వినియోగించుకుంటూ క్రింద వివరించిన ఆస్తిని దిగువసంతకందారు **లాంఛనప్రాయంగా స్వాధీనం** చేసుకోవడమైనది.

రుణగ్రహతలు మరియు ప్రత్యేకంగా సాధారణ ప్రజలను హెచ్చరించడమేమనగా సదరు ఆస్తితో ఎలాంటి లావాదేవీలు జరుపరాదు మరియు ఏవైనా లావాదేవీలు **ఉత్కర్ష్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకు లిమిటెడ్,** ఎకౌంట్స్‌కు వ్యతిరేకంగా పేర్కొన్న మొత్తం మరియు దానిపై వడ్డీతో సహా చెల్లించి జరుపవచ్చు.

రుణగ్రహీతలు జాగ్రత్త వహించవల్సింది ఏమనగా సెక్యూర్డ్ అస్సెట్స్‌ను విడిపించుకొనుటకు మీకు లభించిన సమయం మేరకు చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) నిబంధనలు ఆహ్వానించడమైనది.

క్ర. సం.	శాఖ పేరు	అకౌంట్ పేరు	రుణగ్రహీత/ హామీదారు (ఆస్తి యజమాని) పేరు	డిమాండ్ నోటీసు తేది	స్వాధీనత నోటీసు తేది	డిమాండ్ నోటీసు తేది నాటికి బకాయి మొత్తం
1	హైదరాబాద్	154214000 0006406	మామిడి పూరన్ చంద్ర, తండ్రి. శ్రీనివాసులు (రుణగ్రహీత) మరియు శ్రీమతి.మామిడి కీర్తి కిరణ్ కుమారి (సహ రుణగ్రహీత మరియు తనఖాదారు)	27/09/2024	24/01/2025	₹ 9,44,752.01/-

ఆస్తుల వివరాలు : ... ఏరియా, ఆర్.ఎస్‌వై.నం.512/4, ఇంటి బేరింగ్ డో.నం.1-144 వద్ద ఓపెన్ ప్లాట్ నం.18 వద్ద ఉన్న ఆస్తి మొత్తం ఆ ముక్క మరియు పార్శిల్ కొలిచే ఏరియా 150 చ.గ.లు. ఆస్తి హద్దులు : తూర్పు : ప్లాట్ నం.19 కి చెందిన 30 అ.లు. సైట్, పడమర : 24 అ.లు. వెడల్పు కొరకు 30 అ.లు. రోడ్డు, ఉత్తరం : 45 అ.లు. పంచాయతీ రోడ్డు, దక్షిణం : ప్లాట్ నం.17కు చెందిన సైట్.

తేది : 28.01.2025
ప్రదేశం : హైదరాబాద్

సం/-
(అధీకృత అధికారి)
ఉత్కర్ష్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్

కెన్‌ఫిన్ హోమ్స్ లిమిటెడ్

Can Fin Homes Ltd (Sponsor: CANARA BANK) HOME LOANS • DEPOSITS — Translating Dreams into Reality

బ్రాంచి చిరునామా: 7-2-41/బి, గ్రౌండ్ ఫ్లోర్, భవనం వారి వీధి, గంగానమ్మపేట, తెనాలి-522201. ఫోన్:08644-225838, 9731451228. Email: tenali@canfinhomes.com. CIN: L85110KA1987PLC008699

స్వాధీనత ప్రకటన

సెక్యూరిటైజేషన్ అండ్ రీకనస్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరస్ట్ చట్టం, 2002 క్రింద **కెన్‌ఫిన్ హోమ్స్ లిమిటెడ్,** యొక్క అధీకృత అధికారిగా దిగువ సంతకందారు, సదరు చట్టం & సెక్యూరిటి ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 క్రింద సంక్రమించిన అధికారులను వినియోగిస్తూ సదరు నోటిసు అందిన తేది నుండి 60 రోజులలోపు నోటిసులో పేర్కొనబడిన బకాయి మరియు పూర్తి చెల్లింపువరకు అయిన వడ్డీ మరియు ఇతర ఖర్చులతో తిరిగి చెల్లించవలసినదిగా దిగువ వివరించిన ఋణగ్రహీతలు/సహ-ఋణగ్రహీతలు/ హామీదారులను కోరుతూ డిమాండ్ నోటిసు జారీచేశారు.

రుణగ్రహీత సొమ్మును తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఋణగ్రహీతకు మరియు సాధారణ ప్రజానీకానికి ప్రకటించునది ఏమనగా సదరు రూల్స్ యొక్క 8వ రూల్‌తో కలిపి చదువుకొనవలసిన సదరు యాక్ట్ యొక్క సెక్షన్ 13(4) క్రింద తనకు సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ దిగువ సంతకందారు దిగువ వివరించిన ఆస్తిని స్వాధీనత తీసుకున్నారు.

నెం.	ఋణగ్రహీత మరియు హామీదారుల పేర్లు	ఆస్తి వివరములు	డిమాండ్ నోటిసు తేది.	బకాయి మొత్తం	స్వాధీనత నోటిసు తేది.
1.	1) శ్రీ చిలువూరి జగదీశ్ బాబు (ఋణగ్రహీత), 2)శ్రీమతి చిలువూరి శాంత కుమారి (గ్యారంటర్), డోర్ నెం.10-1-21/5, వుడా కాలని, అమరావతి ప్లాట్స్, తెనాలి, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522202.	గుంటూరు జిల్లా, తెనాలి, తెనాలి మున్సిపాలిటి, డోర్ నెం.14-58-39, 1వ వార్డు, 17వ బ్లాకు, టి.యస్. నెం. 598/1లో 145 చ॥గ॥ల ఖాళీ స్థలం. దీని సరిహద్దులు :తూర్పు: తోక నాగేశ్వరరావు గారి సైట్, దక్షిణం: పినపాటి రాజు గారి సైట్, పడమర: పంచాయితీ రత్నయ్య గారి సైట్, ఉత్తరం: 18 అడుగుల జాయింట్ బజార్.	06-11-2024	రూ. 10,88,459/- (అక్షరాల పది లక్షల యనబై ఎనిమిది వేల నాలుగు వందల యాబై తొమ్మిది రూపాయలు మాత్రమే)	27-01-2025
2.	1)శ్రీ యడల గంగ(ఋణగ్రహీత), 2)శ్రీమతి యడల అన్నపూర్ణ (సహ-ఋణగ్రహీత), టి.యస్.619, డోర్ నెం.14-59-11/1, మున్సిపల్ వార్డు, 17వ బ్లాక్, మోరిసిపేట, తెనాలి, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522201. 3)శ్రీ యడల కిరణ్ కుమార్ (సహ-ఋణగ్రహీత), డోర్ నెం.8-196, గౌడపాలెం, వడ్డమడి, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522213.	గుంటూరు జిల్లా, తెనాలి, తెనాలి మున్సిపాలిటి, డోర్ నెం.14-59-11/2, 1వ వార్డు, 17వ బ్లాకు, టి.యస్. నెం. 604/1 & 617లో 139 చ॥గ॥ల ఆర్.సి.సి రెసిడెన్షియల్ భవనం మరియు స్థలం. దీని సరిహద్దులు :తూర్పు: 9 అడుగుల వెడల్పు జాయింట్ బజార్, దక్షిణం:గుర్రం లక్ష్మీ కుమారి గారి ఆస్తి పడమర: దర్శి సత్యనారాయణ గారి ఆస్తి ఉత్తరం: 21-0 వెడల్పు జాయింట్ బజార్.	06-11-2024	రూ. 10,05,715/- (అక్షరాల పది లక్షల ఐదు వేల ఏడు వందల పదిహేను రూపాయలు మాత్రమే).	27-01-2025

తేది : 27-01-2025
స్థలము : తెనాలి

సం/- అధీకృత అధికారి
కెన్‌ఫిన్ హోమ్స్ లిమిటెడ్

చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్

కార్పోరేట్ ఆఫీసు: చోలా క్రెస్ట్, సూపర్ బి, సి54 మరియు సి55, 4, తిరు వి క ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండీ, చెన్నై-600032, టి.ఎన్.

డిమాండ్ నోటీసు

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 (రూల్స్) మరియు సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్స్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్ 2002 ("చట్టం") యొక్క నిబంధనల క్రింద

దిగువసంతకందారు చోలమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారి (సెక్యూర్డ్ క్రెడిటార్) చట్టంలోని సెక్షన్ 13(12) కింద అందించబడిన అధికారాలను అమలు చేసూ, నిబంధన 3తో చదివిన సెక్షన్ కింద డిమాండ్ నోటీసు(లు) జారీ చేయబడింది. చట్టంలోని 13 (2) పేర్కొన్న నోటీసు అందిన తేదీ నుండి 60 రోజులలోపు ...

క్ర. సం.	రుణగ్రహీత/ సహ-రుణగ్రహీత/హామీదారు పేరు మరియు చిరునామా	రుణం మొత్తం	డిమాండ్ నోటీసు తేది మరియు బకాయి మొత్తం	సెక్యూర్డ్ అసెట్/ ఆస్తి వివరాలు
1.	రుణ ఖాతా నం. X0HLVJI00002733271 & X0HLVJI00002162499 1) శ్రీ.శ్రీ.. ... (అరువుదారు), 2) శ్రీ.శ్రీమతి. ... ఇరువురి నివాసం ... విజయవాడ, ఎన్.టి.ఆర్. జిల్లా, ఆంధ్రప్రదేశ్-520 015. ...	X0HLVJI00002733271 రూ. 12,94,/- ... X0HLVJI00002162499 రూ.35,71,647/-	22.01.2025 రూ.60,52,336/- (అక్షరాల ...) 21.01.2025 నాటికి	ఎన్.టి.ఆర్ జిల్లా, విజయవాడ రిజిస్ట్రేషన్ జిల్లా, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ...

రుణగ్రహీత(లు) డిమాండ్ నోటీసు (లు) అందిన తేదీ నుండి 60 రోజులలోపు ... చెల్లించడంలో విఫలమైతే, ... పైన పేర్కొన్న సురక్షిత ఆస్తుల(ల)పై ... సెక్యూర్డ్ క్రెడిటార్‌కు చెల్లించాల్సిన బకాయిలను కవర్ చేయడానికి తనఖా పెట్టబడిన ఆస్తుల విలువ సరిపోకపోతే, బ్యాలెన్స్ బకాయిలను తిరిగి పొందటానికి ప్రత్యేక చట్టపరమైన చర్యలను ప్రారంభించే హక్కు కూడా సెక్యూర్డ్ క్రెడిటార్‌కు ఉంది. ఈ పరిహారం అదనంగా మరియు ఏదైనా ఇతర చట్టం ప్రకారం సెక్యూర్డ్ క్రెడిటార్‌కు అందుబాటులో ఉన్న అన్ని ఇతర నివారణలకు స్వతంత్రంగా ఉంటుంది. అందుబాటులో ఉన్న సమయానికి సంబంధించి చట్టంలోని సెక్షన్ 13(8) కి, సురక్షిత ఆస్తులను మరియు చట్టంలోని సెక్షన్ 13(13)కి రుణగ్రహీతల దృష్టిని ఆహ్వానిస్తున్నారు. దీని ద్వారా రుణగ్రహీత (లు) సురక్షిత ఆస్తి (ల)ను పాడు చేయడం లేదా వాటితో వ్యవహరించడం లేదా అమ్మకం, లీజు లేదా ఇతరత్రా (సాధారణ వ్యాపారంలో కాకుండా) ఏదైనా సురక్షి ఆస్తి(ల) యొక్క ముందస్తు వ్రాతపూర్వక అనుమతి లేకుండా బదిలీ చేయడం నుండి నిరోధించబడింది/నిషేధించబడింది సెక్యూర్డ్ క్రెడిటార్ మరియు పైన పేర్కొన్న వాటిని పాటించకపోవడం, పేర్కొన్న చట్టంలోని సెక్షన్ 29 ప్రకారం శిక్షార్హమైన నేరం. డిమాండ్ నోటీసు కాపీ కింద సంతకం చేసిన వారి వద్ద అందుబాటులో ఉంటుంది మరియు రుణగ్రహీత (లు) వారు కోరుకున్నట్లయితే, సాధారణ కార్యాలయ వేళల్లో ఏదైనా పని దినాన దిగువ సంతకం చేసిన వారి నుండి సేకరించుకోవచ్చును.

సం/-
ప్రదేశం : ఎన్‌టిఆర్ జిల్లా, ఆంధ్రప్రదేశ్
తేది : 22.01.2025

అధీకృత అధికారి
చోలమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్. తరపున

ఐకెఎఫ్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్

IKF Home Finance

ప్లాట్ నం.30/ఎ, సర్వే నం.83/1, మై హోమ్ ట్విజ్, 11వ అంతస్తు, డైమండ్ హిల్స్, లుంబినీ అవెన్యూ, 400/220/132కెవి జిఐఎస్ సబ్-స్టేషన్ ప్రక్కన, ఏపిఐఐసి హైదరాబాద్ నాలెడ్జి సిటీ, రాయిదుర్గ్, హైదరాబాద్-081. ఫోన్:040-23412083, www.ikfhomefinance.com

స్థిరాస్తి అమ్మకం కొరకు అమ్మకపు ప్రకటన
అనుబంధం-4-ఎ (రూల్ 9(1)తో చదువబడే రూల్8(6)కు నియమాలను చూడండి)

ది సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(6)కు నియమాలతో చదువబడే ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకపు ప్రకటన.

ఇందుమూలంగా సర్వజనులకు మరియు ప్రత్యేకించి రుణగ్రహీతలు మరియు హామీదారులకు ప్రకటన ఇవ్వడమేమనగా, దిగువ వివరించిన స్థిరాస్తులు **ది ఐకెఎఫ్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్**కు తాకట్టుపెట్టబడినవి/ చార్జ్‌చేయబడినవి. ఏవైతే, వాటిని **ఐకెఎఫ్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్** యొక్క అధీకృత అధికారిచేత **స్వాధీనంచేయబడినవి,** మరియు పట్టికలో పేర్కొన్నట్లుగా రుణగ్రహీతలు మరియు హామీదారుల నుండి **ది ఐకెఎఫ్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్**కు బకాయి పడిన మిగతా రుణ మొత్తాలను రికవరీచేయుట కొరకు ఇ-వేలం ద్వారా **"ఏది ఎక్కడ ఎలా ఉన్నది అది అక్కడ అలాగే ఉంటుంది"** అనే ప్రాతిపదికన విక్రయించబడుతాయి. రుణగ్రహీతలు మరియు హామీదారుల వివరాలు, బకాయి మొత్తాలు, స్థిరాస్తి సంక్షిప్త వివరణ మరియు దానిపై తెలసిన రుణ భారాలు, స్వాధీనతా విధానం, రిజర్వు ధర మరియు ధరావత్తు, వేలం తేది& సమయం యొక్క వివరాలు ఇందు దిగువ కూడా ఇవ్వబడినవి:

రుణగ్రహీత/ హామీదారు పేరు & చిరునామా: (1) శ్రీమతి సరోజా సత్యవరపు, భర్త శ్రీ సత్యనారాయణ సత్యవరపు, సహ-రుణగ్రహీత: శ్రీ సత్యనారాయణ సత్యరపు, తండ్రి గోపాలకృష్ణ, ఇరువురి నివాసం: డోర్ నం.12-300, టైలరింగ్ స్ట్రీట్, వెంకట రావు హోటల్ ప్రక్కన, గుడివాడ, కృష్ణా జిల్లా-521301. **మరియు:** డోర్ నం.16-321, సత్యనారాయణపురం, గుడివాడ, కృష్ణా జిల్లా, ఆం.ప్ర-521301.

రుణ ఖాతా నం.లు: LNVJY00321-220003135 — డిమాండ్ నోటీసు తేది: 15.12.2023.

బకాయి మొత్తాలు: 12.12.2023 నాటికి వడ్డీ& వ్యయాలు మొ॥వాటితో **రూ.20,83,106/- (రూపాయలు ఇరువై లక్షల ఎనభై మూడు వేల నూటా ఆరు మాత్రమే)**

స్థిరాస్తి వివరణ

... కృష్ణా జిల్లా, గుడివాడ సబ్-రిజిస్ట్రార్ ... గుడివాడ గ్రామ ... డోర్ నెం.16-36, 16-37 ... 1.75 ... 24 అడుగులు ... ప్లాట్ నం. ఎస్‌ఎఫ్-1 ... "సాయి కృష్ణ రెసిడెన్సీ" ...

రిజర్వు ధర: రూ.15,00,000/-; ధరావత్తు (ఇఎండి): రూ.1,50,000/-, బిడ్ పెంపుదల: రూ.5,000/-.

వేలం తేది: 12.02.2025, సమయం: ఉ॥ 01.00గం.ల నుండి ఉ॥ 03.00గం.ల వరకు.

అమ్మకం ముగింపు వరకు, ఒకవేళ బిడ్ కొనసాగినచో, ప్రతి బిడ్ కొరకు ఐదు నిమిషాల అపరిమిత పొడిగింపులతో

ఆస్తి తనిఖీ తేది: ... అధీకృత అధికారి: శ్రీ ఎస్.ఎల్. శ్రీనివాస్, మొబైల్: 8019823222, శ్రీ కళ్యాణ్ చక్రవర్తి, మొబైల్: 9866931116.

ధరావత్తు (ఇఎండి) సమర్పించుటకు ఆఖరు తేది: 10.02.2025 సా॥ 04:00గం.లు

ఐడి:**Recovery@ikfhomefinance.com** కు దాఖలుచేయవలెను మరియు ఈ చిరునామాకు దాఖలుచేయగలరు: ఐకెఎఫ్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్, కార్పొరేట్ ఆఫీసు, మై హోమ్ ట్విట్జా, 11వ అంతస్తు, ఎం హోటల్, హైటెక్ సిటీ మెయిన్ రోడ్, బి/ఎస్ ట్రాన్స్‌కో సబ్‌స్టేషన్, రాయిదుర్గ్, హైదరాబాద్, తెలంగాణ-500081. **(2) ధరావత్తు (ఇఎండి) వివరాలు:** ధరావత్తు మొత్తాన్ని ఇందు దిగువ పేర్కొన్న ఖాతా వివరాలకు ఐకెఎఫ్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ పేరున ఆర్‌టిజిఎస్/ఎన్ఇఎఫ్‌టి రూపేనా డిపాజిట్‌చేయవలెను: ఖాతా నం.: **11520200014177, ఐఎఫ్ఎస్‌సి: ఎఫ్‌డిఆర్‌ఎల్0001152, బ్యాంకు పేరు: ది ఫెడరల్ బ్యాంక్ లిమిటెడ్, బ్రాంచి: విజయవాడ-520 002. (3)** తదుపరి సందేహాల కొరకు బిడ్డరుదారు సంప్రదించండి: ఇ-వేలం తేదీకి ముందు, బ్యాంకు యొక్క ఆమోదిత సర్వీస్ ప్రొవైడర్ మెసర్స్ సి1 ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, బిల్డింగ్ 301, ఉద్యోగ్ విహార్, ఫేజ్-2, గల్ఫ్ పెట్రోకెమ్ బిల్డింగ్, గుర్గాం, హర్యానా-122015, **https://www.bankeauctions.com**, హెల్ప్ లైన్ **+91-124-4302020/21/22/23/24, +91-9700333933**, ఇ-మెయిల్ ఐడి: **support@bankeauctions.com and telangana@c1india.com,**

తేది: 27.01.2025,
ప్రదేశం: గుడివాడ.

సం/- అధీకృత అధికారి,
ఐకెఎఫ్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్

చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్

కార్పొరేట్ కార్యాలయం : "చోలా క్రెస్ట్", సి54 మరియు 55, సూపర్ బి-4, తిరు వి క ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండీ, చెన్నై-600032.
శాఖ చిరునామా : 1వ & 2వవ అంతస్తు, డోర్ నం.44-65/1ఎ, టౌన్ వార్డు నం.18, బ్లాక్ నం.2, టి.ఎస్.నం.1847, ఎస్‌ఎల్‌వి ఆర్కేడ్, కోల్ల ఫారం సెంటర్, చంద్రమౌళి నగర్ ఎక్స్‌టెన్షన్, గుంటూరు (ఆ.ప్ర)-522007.
శాఖ చిరునామా : 4వ అంతస్తు, గుప్తా స్క్వేర్, 'బి' బ్లాక్, షాప్ నం.5, 60 అ.లు. రోడ్డు, సత్యం థియేటర్ ప్రక్కన, ఒంగోలు-523001.
శాఖ చిరునామా : 1వ & 4వ అంతస్తు, శాంతిప్లాజా, డోర్ నం.59-14-2ఎ, గాయత్రి నగర్, బెంజ్ సర్కిల్, విజయవాడ-520008.

ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్, 2002 యొక్క సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసు.

దిగువ పేర్కొన్న రుణగ్రహీత/ తాకట్టుదారులైన మీరు, ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మీపై కంపెనీ చట్టపరమైన చర్యలు తీసుకొంటుందని ఇందుమూలంగా తెలియజేయబడుచున్నది మరియు మీకు చట్టం యొక్క 13(2) క్రింద నోటీసును అక్నాలెడ్జిమెంట్ డ్యూతో రిజిస్టర్డు పోస్టు ద్వారా పంపబడినది. కాని అది డెలివరీ కాకుండానే వెనుదిరిగినది. అందుకు, మిమ్ములను కోరునది ఏమనగా, ఈ ప్రచురణ తేదీ నుండి 60 రోజుల్లోగా వాటిపై వడ్డీతో సదరు ఖాతా పై పేర్కొన్న బకాయి రుణ మొత్తాలను చెల్లించవలసిందిగా కోరిన నోటీసును తీసుకోవలసిందిగా కోరబడుచున్నది. విఫలం చెందిన, ఏదైతే, వడ్డీలు & ఖర్చులతో దాని బకాయిలను రియలైజ్‌చేయుటకు దిగువ పేర్కొన్న సెక్యూరిటీను స్వాధీనంచేసుకొనుట ద్వారా చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (4) క్రింద దీని హక్కులను వినియోగించుకొని మీపై చర్యలు తీసుకోబడుతాయి. కంపెనీకి అందుబాటులోగల ఏవేని ఇత అంశాలకు పక్షపాతంలేకుండా మీ చిరునామాకు ఈ నోటీసు మీకు పంపబడినదని తెలియజేయుట అవసరంలేదని భావిస్తున్నాము.

	లోను ఖాతా నం. & రుణగ్రహీత/లు పేరు మరియు చిరునామా	లోను మొత్తం	బకాయి మొత్తం
1	**లోన్ ఖాతా నం. హెచ్ఇ01జియుఎన్00000050381. డిమాండ్ నోటీసు తేది: 16.01.2025:** **1. హరి శంకర్ దీనకొండ** (దరఖాస్తుదారు), **2. ఉమా దీనకొండ** (సహ-అభ్యర్థి), ఇరువురి చిరునామా: డోర్ నం.5-593-1, కృష్ణా రెడ్డి డొంక, చిలకలూరిపేట్, పురుషోత్త పట్నం, చిలకలూరిపేట్, గుంటూరు, ఆం.ప్ర-522616. **3. భార్గవ్ సాయి బుక్స్ & ఫ్యాన్సీ స్టోర్** (సహ-అభ్యర్థి), డోర్ నం.2, లలిత కాంప్లెక్స్, సుబ్బయ్య తోట, చిలకలూరిపేట్ మండలం, గుంటూరు, ఆం.ప్ర-522616.	Rs. 95,00,000/-	16.01.2025, నాటికి రూ.94,77,398/- దానిపై వడ్డీతోసహా.
	ఆస్తి యొక్క షెడ్యూలు: అన్ని ఈజిమెంటరీ హక్కులతో నరసారావుపట రిజిస్ట్రేషన్ జిల్లా, చిలకలూరిపేట్ సబ్-డిస్ట్రిక్ట్, చిలకలూరిపేట్ మున్సిపల్ ఏరియా, బ్లాక్ నం.5, పురుషోత్తం వద్ద గల, సర్వే డోర్ నం.104/ఎ, డోర్ నం.5-595, అసెస్మెంట్ నం. 1020019379, విస్తీర్ణం ...		
2	**లోన్ ఖాతా నం. హెచ్ఇ01జియుఎన్00000080123. డిమాండ్ నోటీసు తేది: 16.01.2025:** 1. షేక్ మహమ్మద్ రఫీ (దరఖాస్తుదారు), 2. గౌసియా బేగం షేక్ (సహ-అభ్యర్థి), ... గుంటూరు ... ఆం.ప్ర-522001.	Rs. 37,50,000/-	16.01.2025, నాటికి రూ.39,44,074/- దానిపై వడ్డీతోసహా.
	ఆస్తి యొక్క షెడ్యూలు: ... గుంటూరు ...		
3	**లోన్ ఖాతా నం. ... డిమాండ్ నోటీసు తేది: 10.01.2025:** 1. ఎం. సంతోష్ సముద్రాల (దరఖాస్తుదారు), 2. ఉమామహేశ్వర రావు సముద్రాల (సహ-అభ్యర్థి), 3. ... సముద్రాల (సహ-అభ్యర్థి), 4. వర్ధిని సముద్రాల (సహ-అభ్యర్థి), ... నందిగామ, కృష్ణ, ఆం.ప్ర-521185.	Rs. 12,35,000/- 64,00,000/-	10.01.2025, నాటికి రూ.48,75,436/- దానిపై వడ్డీతోసహా.
	ఆస్తి యొక్క షెడ్యూలు: నందిగామ సబ్-రిజిస్ట్రార్, నందిగామ ... కృష్ణా జిల్లా-521185 ...		

తేది : 28.01.2025
ప్రదేశం : గుంటూరు/కృష్ణా జిల్లా

సం/- అధీకృత అధికారి
మెసర్స్ చోలమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్

పిడిఎఫ్ అభ్యర్థులను ఎమ్మెల్సీలుగా గెలిపించండి

● యుటిఎఫ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పిడిఎఫ్ అభ్యర్థులను ఎమ్మెల్సీలుగా గెలిపించాలని యుటిఎఫ్ పిలుపునిచ్చింది. మార్చిలో జరగబోయే ఉపాధ్యాయ, పట్టభద్ర అభ్యర్థులుగా పిడిఎఫ్ అభ్యర్థులుగా బలపరిచిన కె విజయగౌరి (ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ), కెఎస్ లక్ష్మణరావు (కృష్ణా, గుంటూరు పట్టభద్రుల), డివి రాఘవులు (ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల) మద్దతు ఇస్తున్నట్లు యుటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్ వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్ ప్రసాద్ తెలిపారు. ఆ సంఘం రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ సమావేశం యుటిఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉద్యోగ, ఉపాధ్యాయ, అధ్యాపక, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్, పెన్షనర్, నిరుద్యోగ, వివిధ రంగాలు, సాధారణ ప్రజల హక్కుల కోసం పిడిఎఫ్ ఎమ్మెల్సీలు నిరంతరం పనిచేశారని తెలిపారు. ప్రభుత్వ రంగాన్ని కాపాడేందుకు శాసనమండలిలో ఉద్యమాల గొంతుకగా పనిచేయడంతోపాటు వివిధ సంఘాలు చేసే పోరాటాల్లో ప్రత్యక్షంగా పాల్గొన్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడడం కోసం ఉపాధ్యాయ సంఘాలు చేసిన పోరాటాలకు మద్దతు ఇస్తూనే మండలిలో సమస్యల పరిష్కారానికి చొరవ చూపారని వివరించారు. జిఒ 117 రద్దు కోసం, పాత పెన్షన్ పునరుద్ధరణ కోసం, ఉపాధ్యాయ సంఘాలు చేసిన నిరాహార దీక్షల్లో, పోరాటాల్లో ప్రత్యక్షంగా పాల్గొన్న చరిత్ర పిడిఎఫ్ ఎమ్మెల్సీలకు ఉందని వెల్లడించారు. భవిష్యత్ ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకునేందుకు, రాజ్యాంగ విలువలను రక్షించు వారిని గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

ఫిబ్రవరి 8 నుంచి పోరుబాట

2023 జులై ఒకటి నుంచి అమలు కావాల్సిన 12వ పిఆర్‌సి కమిషన్ చైర్మన్‌ను తక్షణమే నియమించాలని, ఉద్యోగ, ఉపాధ్యాయ బకాయిలు రూ.25 వేలకోట్లు చెల్లించేందుకు రోడ్ మ్యాప్ ప్రకటించాలని, 2004 సెప్టెంబర్ ఒకటి నాటికి నియామక ప్రక్రియ పూర్తయిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని కోరుతూ ఫిబ్రవరి 8 నుంచి పోరుబాట కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెంకటేశ్వర్లు, ప్రసాద్ తెలిపారు. సకాలంలో పిఆర్‌సి అమలు చేస్తామని, ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఆర్థిక బకాయిలను తక్షణమే విడుదల చేస్తామని కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. జనవరిలో రూ.6,700 కోట్ల బకాయిలు చెల్లిస్తున్నామని చెప్పి కేవలం రూ.1,200 కోట్లు ఇచ్చారని తెలిపారు. ఫిబ్రవరి 8న రాజోలపాలెం, 9న విజయవాడ, 16న విశాఖపట్నం, 23వ తేదీన తిరుపతి, అనంతపురం ప్రాంతాల్లో వేలాదిమంది ఉపాధ్యాయులతో సభలు నిర్వహిస్తామని వెల్లడించారు. 28వ తేదీన మండల, పట్టణ కేంద్రాల్లో ధర్నాలు, మార్చి 6న జిల్లా స్థాయి, 14న రాష్ట్రస్థాయిలో ధర్నాలు నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో యుటిఎఫ్ గౌరవ అధ్యక్షులు కె శ్రీనివాసరావు, సహాధ్యక్షులు కె సురేష్‌కుమార్, కుసుమకుమారి, కోశాధికారి ఆర్ మోహనరావు, కార్యదర్శులు బి లక్ష్మిరాజా, ఎస్ మురళీమోహనరావు, మనోహర్‌కుమార్, అరుణకుమారి పాల్గొన్నారు.

యుపిఎస్‌సికి పేర్లు పంపేలా ఆదేశించాలని పిల్

ప్రజాశక్తి-అమరావతి

డిజిపి నియామకానికి అనుసరించాల్సిన మార్గదర్శకాలను ప్రభుత్వం అమలు చేయడం లేదంటూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. డిజిపి పోస్టుకు ఎంపిక చేయబోయే వారి పేర్లను యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు పంపడం లేదని, ద్వారకా తిరుమలరావు నియామకం ఆ విధంగానే జరిగిందని పిల్ దాఖలైంది. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం.. డిజిపి నియామకంపై యుపిఎస్‌సికి పేర్లు పంపేలా ఉత్తర్వులివ్వాలంటూ హెల్ప్ ది పీపుల్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక ట్రస్టీ కేతిరెడ్డి అభిల్ శ్రీగురు తేజ పిల్ వేశారు. యుపిఎస్‌సి షార్ట్ లిస్ట్ చేసిన వారిలో ఒకరిని డిజిపిగా నియమించాలని ఆదేశాలివ్వాలని న్యాయవాది తాండవ యోగేష్.. చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ అధ్యక్షతన బెంచ్‌ను కోరారు. ఈ నెల 31తో డిజిపి పదవీకాలం ముగుస్తుందన్నారు. సీనియర్ అధికారిని తాత్కాలిక డిజిపిగా నియమించే ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. న్యాయవాది వినతి తర్వాత పిల్‌ను బుధవారం విచారణ చేపడతామని హైకోర్టు ప్రకటించింది.

తులసిబాబు పిటిషన్‌పై విచారణ వాయిదా

ప్రజాశక్తి-అమరావతి

డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు ఫిర్యాదు మేరకు గుంటూరు నగరపాలెం పోలీసులు పెట్టిన కేసులో బెయిల్ ఇవ్వాలంటూ కామేపల్లి తులసిబాబు వేసిన పిటిషన్‌పై విచారణ 31కి వాయిదా పడింది. తులసిబాబును మూడు రోజుల పోలీసుల కస్టడీకి ఇస్తూ కింది కోర్టు ఇప్పటికే ఉత్తర్వులిచ్చింది. దీంతో విచారణ 31కి వాయిదా వేస్తూ జస్టిస్ కృపాసాగర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

రూ.85 లక్షల వరకు విద్యా రుణం : టాటా క్యాపిటల్

హైదరాబాద్ : రాబోయే విద్యా సంవత్సరానికి విద్యా రుణ పరిష్కారాలను అందించనున్నట్లు ఫైనాన్షియల్ సర్వీసెస్ కంపెనీ టాటా క్యాపిటల్ లిమిటెడ్ (టిసిఎల్) తెలిపింది. కుటుంబాల ఆర్థిక సమస్యలను పరిష్కరించడానికి అడుగులు వేస్తోన్నట్లు పేర్కొంది. దేశ, విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించడానికి వారి ఆర్థిక అవసరాలను అర్థం చేసుకోవడం ద్వారా సౌకర్యవంతమైన విద్యా రుణాలను అందిస్తోందని ఆ సంస్థ రిటైల్ ఫైనాన్స్ సిఇఒ వివేక్ చోప్రా పేర్కొన్నారు. రూ.85 లక్షల వరకు పూచీకత్తు లేని రుణాలను అందించనున్నట్లు తెలిపారు.

విద్యుత్ డిమాండ్‌కు తగ్గట్టుగా చర్యలు

● ఇంధనశాఖ స్పెషల్ సిఎస్ విజయానంద్



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రానున్న వేసవిలో విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్‌ను సరఫరా చేసేందుకు అవసరమైన ముందస్తు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఇంధనశాఖ స్పెషల్ సిఎస్ కె విజయానంద్ ఆదేశించారు. విజయవాడలోని సిఎస్ క్యాంపు కార్యాలయంలో జెన్‌కో, ట్రాన్స్‌కో అధికారులతో సోమవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న వేసవిలో 13,700 మెగావాట్ల విద్యుత్ పీక్ డిమాండ్ ఉంటుందని, అదే విధంగా 260 మిలియన్ యూనిట్ల విద్యుత్ డిమాండ్ ఉంటుందని అంచనా అని, దీనికనుగుణంగా రాష్ట్రానికి వేసవిలో అవసరమయ్యే విద్యుత్‌ను సింహాద్రి నుంచి జెన్‌కో నుంచి ఉత్పత్తి చేసేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని, అదేవిధంగా బొగ్గు కొనుగోలు, రవాణా అంశాల్లో పూర్తి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. సాధ్యమైనంత వరకు ప్రజాప్రయోజనాల పరిరక్షణ మేరకు స్వాప్, ఐపిపి, స్వల్పకాలిక విద్యుత్ కొనుగోలు చేసేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. జనవరి 25వ తేదీన 5,250 మెగావాట్ల విద్యుత్‌ను జెన్‌కో ఉత్పత్తి చేసిందని, ఇది ఆల్ టైమ్ రికార్డు అని పేర్కొన్నారు. ఇందుకు కృషి చేసిన అధికారులు, సిబ్బందిని ఆయన అభినందించారు. ఈ సమావేశంలో జెన్‌కో సిఎండి కెవిఎన్ చక్రధర్‌బాబు, ట్రాన్స్‌కో జెఎండి కీర్తి చేకూరి, ఇన్‌ఛార్జి డైరెక్టర్ అశోక్‌కుమార్ రెడ్డి, ట్రాన్స్‌కో గ్రిడ్ డైరెక్టర్ భాస్కర్, ఎపి పవర్ కో-ఆర్డినేషన్ కమిటీ సిఇ రాజేంద్ర ప్రసాద్, ఎస్ఇ కె శ్రీనివాస్, సిసిఎల్ మురళీకృష్ణ, సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

బిసిలు విద్యపై దృష్టి పెట్టాలి



ప్రసంగిస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

● కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

వెనుకబడిన తరగతుల వారు విద్యపై దృష్టి సారించడం ద్వారానే అన్ని రంగాల్లో రాణించగలుగుతారని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడు అన్నారు. సోమవారం గుంటూరులోని శ్రీవేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో బిసి మంత్రులకు జరిగిన అభినందన సభలో ఆయన ప్రసంగించారు. రామ్మోహన్‌నాయుడుతో పాటు రాష్ట్ర మంత్రులు కె.అచ్చెన్నాయుడు, సవిత, కొలుసు పార్థసారథి, కొండపల్లి శ్రీనివాస్, ఆర్‌టిసి చైర్మన్ కొనకళ్ల నారాయణ, ఎమ్మెల్యేలు తెనాలి శ్రావణ్‌కుమార్, బి.రామాంజనేయులు, నశీర్ అహ్మద్‌లను ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, ఎమ్మెల్యే గల్లా మాధవి ఆధ్వర్యంలో ఆహ్వాన కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. సభకు ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు అధ్యక్షత వహించారు. రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం స్థానిక సంస్థల్లో బిసిలకు రిజర్వేషన్లు కల్పించడం వల్ల ఎంతోమంది కొత్త తరం నాయకులుగా ఎదిగారన్నారు. బిసిలకు సంక్షేమంతో పాటు నాణ్యమైన విద్యను అందించడం ద్వారా దేశ స్థాయిలోనే కాకుండా విదేశాల్లో సైతం రాణించగలరని వివరించారు. వెనుకబడిన తరగతుల వారందరూ ఐకమత్యంగా ఉంటేనే వారు అనుకున్న లక్ష్యాలను సాధించడం సాధ్యం అవుతుందన్నారు. వీరు పనిచేయకపోతే దేశమే ఆగిపోతుందని, వారికి ఉన్న నైపుణ్యాలతో పరిశ్రమల ఏర్పాటు చేసేలా భావితరాల వారిని ప్రోత్సహించాలన్నారు. వెనుకబడిన తరగతుల వారి సమస్యలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ అవి పరిష్కరించేలా నిరంతరం కృషి చేస్తామని తెలిపారు.

గ్రీవెన్స్ నిర్వహించిన కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

కేంద్ర పౌరవిమానయాన శాఖమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు టిడిపి కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ నిర్వహించారు. ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, ఫైబర్‌నెట్ కార్పొరేషన్ చైర్మన్ జివి రెడ్డి, గౌడ కార్పొరేషన్ చైర్మన్ గురుమూర్తిలతో కలిసి ఫిర్యాదుదారుల నుంచి అర్జీలు స్వీకరించారు. అక్రమాలు, మోసాలు, భూ కబ్జాలు జరిగాయని పలువురు పెద్దఎత్తున గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. అధికార్లతో ఫోన్‌లో మాట్లాడి బాధితుల సమస్యల పరిష్కారానికి నేతలు కృషి చేశారు.

'యువగళం' వేడుకలు

టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర ప్రారంభించి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా టిడిపి కార్యాలయంలో వేడుకలు జరిగాయి. ఈ పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి నాదెండ్ల బ్రహ్మం ఆధ్వర్యంలో కేక్‌ను కట్ చేశారు.

ఇళ్ల స్థలాల ఉత్తర్వులపై సిపిఐ హర్షం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పేదలకు గ్రామాల్లో 3, పట్టణాల్లో 2 సెంట్ల ఇళ్ల స్థలం ఇచ్చేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం పట్ల సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గతంలో వైసిపి గ్రామాల్లో సెంటున్నర, పట్టణాల్లో సెంటు ఇళ్ల స్థలం ఇచ్చారని, ఇవి కుటుంబ నివాసానికి అనుకూలంగా ఉండవని సిపిఐ స్పష్టం చేసిందన్నారు. కనీసం గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు స్థలం ఇవ్వాలని కోరగా వైసిపి ప్రభుత్వం పెడచెవిన పెట్టిందన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల పేద ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. వైసిపి హయాంలో ఇచ్చిన లేఅవుట్‌లను మార్పు చేసి ప్రస్తుతం నిబంధనల ప్రకారం ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు.

వ్యక్తిగత ఎజెండా వదిలిపెట్టాల్సిందే

జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జనసేన పార్టీలో కొత్తగా చేరిన నాయకులు క్రమశిక్షణకు కట్టుబడి ఉండాలని, ముఖ్యంగా వైసిపి నుంచి వచ్చిన వారు వ్యక్తిగత ఎజెండా వదిలిపెట్టి, ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి కె నాగబాబు స్పష్టం చేశారు. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో పీలేరు, పుంగనూను, చంద్రగిరి, నందిగామ నియోజకవర్గాలకు చెందిన పలువురు వైసిపి నాయకులు సోమవారం జనసేనలో చేశారు. ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ.. పవన్‌కల్యాణ్ ఆలోచనలు, పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు. శాసనమండలి ప్రభుత్వ విప్ హరిప్రసాద్ మాట్లాడుతూ.. ప్రజల కోసం పని చేసిన సామాన్యులకు ఇక్కడ అవకాశాలు లభిస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్షులు సామినేని ఉదయభాను తదితరులు పాల్గొన్నారు.

శామ్‌సంగ్ కార్మికుల ఘన విజయం

- కార్మిక సంఘానికి అధికారిక గుర్తింపు
- సిఐటియు, ఎఐకెఎస్ అభినందనలు


గత ఏడాది సెప్టెంబర్‌లో సమ్మె చేస్తున్న శామ్‌సంగ్ కార్మికులు (ఇన్‌సెట్‌లో) యూనియన్ గుర్తింపు పత్రం)

చెన్నై : తమిళనాడులోని శామ్‌సంగ్ కార్మికుల పోరాటం ఫలించింది. కార్మికుల పోరాటానికి ఆ ప్లాంట్ యాజమాన్యం దిగొచ్చి వారి సంఘానికి అధికారిక గుర్తింపు ఇచ్చింది. ఈ మేరకు ట్రేడ్ యూనియన్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్‌ను కార్మికులు సోమవారం అందుకున్నారు. సిఐటియు నేతృత్వంలో కొత్తగా ఏర్పాటు చేసుకున్న శామ్‌సంగ్ ఇండియా వర్కర్స్ యూనియన్ (ఎస్ఐడబ్ల్యుయు)ను గుర్తింపు ఇవ్వాలని కోరుతూ వెయ్యి మందికి పైగా కార్మికులు గతేడాది సెప్టెంబరు 7వ తేదీ నుండి 37 రోజుల పాటు సమ్మె చేశారు. అధిక వేతనాలు, ఇతర ప్రయోజనాలు చెల్లించాలని, మరింత మెరుగైన పని పరిస్థితులు కల్పించాలని వారు కోరారు. కార్మికుల సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు దక్షిణ కొరియాకు చెందిన ఈ బహుళ జాతి సంస్థ యాజమాన్యం అనేక దుర్మార్గపు ఎత్తుగడలకు పాల్పడింది. యూనియన్‌ను గుర్తించాలన్న డిమాండ్ కాకుండా వేతనాలు పెంచుతామంటూ శామ్‌సంగ్ యాజమాన్యం చేసిన సెటిల్‌మెంట్‌ను కూడా సమ్మె చేస్తున్న కార్మికులు తిరస్కరించారు. ఈ విషయంలో జోక్యం చేసుకుని కార్మికుల హక్కును పరిరక్షించాలని తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్‌కు సిఐటియు లేఖ రాసింది. మద్రాసు హైకోర్టు డిసెంబరులో జోక్యం చేసుకుని వారి దరఖాస్తుపై నిర్ణయం తీసుకోవాల్సిందిగా ట్రేడ్ యూనియన్ల రిజిస్ట్రార్‌ను ఆదేశించింది. హైకోర్టు ఆరు మాసాల గడువు విధిస్తే ఆ చివరి రోజున యూనియన్‌కు రిజిస్ట్రేషన్ అందజేశారు. దీంతో అక్టోబరు 16న కార్మికులు సమ్మెను విరమించి, విధులకు హాజరయ్యారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 'ఈజ్ ఆఫ్ డూయింగ్' (సులభతర వాణిజ్యం) పేరుతో నయా ఉదారవాద విధానాలను అమలు చేస్తున్న తరుణంలో కార్మికులు సంఘటితంగా పోరాడి, ఈ విజయం సాధించడం స్ఫూర్తిదాయకం.

సిఐటియు, ఎఐకెఎస్ అభినందనలు

పోరాడి విజయం సాధించిన శామ్‌సంగ్ కార్మికులను సిఐటియు అభినందించింది. సిఐటియు తమిళనాడు రాష్ట్ర కమిటీ సోమవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. శామ్‌సంగ్ ఇండియా కార్మికులను అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) కూడా అభినందించింది. సంఘటిత కార్మికులకు లభించిన ఘన విజయంగా అభివర్ణించింది. భవిష్యత్తులో అనేక పారిశ్రామిక రంగాల్లో జరిగే పోరాటాలకు ఇది స్ఫూర్తిదాయకంగా వుంటుందని పేర్కొంది. ఇంతటి ఘన విజయాన్ని సాధించిన శామ్‌సంగ్ కార్మిక యూనియన్‌కు అభినందనలు తెలియజేస్తూ వారి భవిష్యత్ పోరాటాలకు తమ సంఘీభావం వుంటుందని ప్రకటించింది. ఈ మొత్తం పోరాట బాటలో పూర్తి స్థాయిలో మద్దతునందించిన తమిళనాడు ఎఐకెఎస్ కమిటీని కూడా అభినందించింది.

15 గ్యారెంటీలతో ఆప్ మేనిఫెస్టో

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో


ఆప్ మేనిఫెస్టోని విడుదల చేస్తున్న కేజ్రీవాల్, అతిషి తదితరులు

ఢిల్లీలో రాజకీయాలు వేడెక్కాయి. అసెంబ్లీ ఎన్నికలకు మరో తొమ్మిది రోజులే సమయం ఉండటంతో అధికార, ప్రతిపక్ష పార్టీల నేతలు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఇక అధికార ఆమ్ ఆద్మీ పార్టీ రెండో మేనిఫెస్టోను విడుదల చేసింది. ఇప్పటికే మధ్యతరగతి ప్రజల కోసం ఆప్ మేనిఫెస్టో విడుదల చేసిన విషయం తెలిసిందే. 15 గ్యారెంటీలతో ఆ పార్టీ అధినేత, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఢిల్లీ ముఖ్యమంత్రి అతిషి, మాజీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా, ఎంపి సంజయ్ సింగ్‌తో కలిసి కొత్త మేనిఫెస్టో సోమవారం విడుదల చేశారు. వరుసగా మూడోసారి అధికారంలోకి రావాలనే లక్ష్యంతో సంక్షేమ పథకాలు, ఉపాధి కల్పన, ప్రజాసేవల్లో మెరుగుదల వంటి 15 కీలక వాగ్దానాలు చేశారు. ఇప్పటికే అమల్లో ఉన్న పథకాలను కొనసాగిస్తామని వెల్లడించారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే విద్యార్థులకు ఉచిత బస్ సౌకర్యం కల్పిస్తామని, మెట్రో ఛార్జీల్లో 50 శాతం రాయితీ ఇస్తామని హామీ ఇచ్చారు.

ఆప్ గ్యారెంటీలు ఇవే..

ఉపాధి హామీ, ప్రతి మహిళకూ రూ.2,100.. నేరుగా బ్యాంకు ఖాతాకే జమ, సంజీవని యోజన పథకం కింద 60 ఏళ్లు పైబడిన వారికి ఉచిత చికిత్స (ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్య చికిత్స), నీటి బిల్లుల మాఫీ, 24 గంటల నీటి సరఫరా, యూరప్ తరహాలో రోడ్లు, యమునా నదిని శుభ్రపరచడం, డాక్టర్ అంబేద్కర్ స్కాలర్‌షిప్ పథకం, విద్యార్థులకు ఉచిత బస్సు ప్రయాణం, ఢిల్లీ మెట్రోలో 50 శాతం రాయితీ, అర్చకులు, గురుద్వారా గ్రంథీలకు రూ.18 వేలు గౌరవ వేతనం, కౌలుదారులకు ఉచిత విద్యుత్, నీటి సదుపాయం, మురుగునీటి వ్యవస్థలను మెరుగుపరచటం, రేషన్‌కార్డుల మంజూరు, ఆటో, ట్యాక్సీ, ఇ-రిక్షా డ్రైవర్లకు జీవిత బీమా, వారి కుమార్తె వివాహానికి రూ.1 లక్ష సాయం, పిల్లలకు ఉచిత కోచింగ్, రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్స్‌కు ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుల కేటాయింపు



ట్రంప్‌కు ప్రధాని మోడీ ఫోన్

న్యూఢిల్లీ : అమెరికా అధ్యక్షుడుగా ఈ నెల 20న ప్రమాణ స్వీకారం చేసిన డొనాల్డ్ ట్రంప్‌తో ప్రధాని మోడీ సోమవారం ఫోన్‌లో మాట్లాడారు. తన ప్రియతమ మిత్రుడు ట్రంప్‌తో మాట్లాడడం ఆనందంగా వుందని మోడీ ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. చారిత్రక రీతిలో రెండోసారి అధ్యక్షుడిగా ఎన్నికైన ట్రంప్‌కు అభినందనలు తెలియజేసినట్లు ఆయన ట్వీట్ చేశారు. పరస్పర లాభదాయకమైన, విశ్వసనీయమైన భాగస్వామ్యానికి కట్టుబడి వున్నట్లు పేర్కొన్నారు. మన రెండు దేశాల ప్రజల సంక్షేమానికి, అలాగే ప్రపంచ శాంతికి, సౌభాగ్యానికి, భద్రతకు మనం కలిసి కృషి చేయాలని మోడీ ఆకాంక్ష వ్యక్తం చేశారు. ట్రంప్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి భారత్ తరపున విదేశాంగ కార్యదర్శి జై శంకర్ హాజరయ్యారు. అమెరికాకు వ్యూహాత్మక భాగస్వామిగా వున్న భారత్, ఆ దేశంతో వాణిజ్య సంబంధాలను పెంచుకోవాలని ఆసక్తి చూపిస్తోంది.

ప్రజా సమస్యలపై ఐక్య పోరాటాలు

- పేదలకు స్థలాలిచ్చి ఇంటి నిర్మాణానికి రూ.15 లక్షలివ్వాలి
- 'ఉపాధి' పని దినాలు 200కు పెంచాలి
- సిపిఎం తెలంగాణ రాష్ట్ర మహాసభ తీర్మానాలు

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో



మహాసభ తీర్మానాలను మీడియాకు వివరిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య, చిత్రంలోమల్లు లక్ష్మి తదితరులు

తెలంగాణ ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై సిపిఎం రాష్ట్ర 4వ మహాసభలో చర్చించి పలు తీర్మానాలు ఆమోదించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటాలకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర మహాసభలో ఆమోదించిన తీర్మానాల వివరాలను పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య, మల్లు లక్ష్మి సోమవారం సీతారాం ఏచూరి నగర్‌లోని మల్లు స్వరాజ్యం ప్రాంగణంలోని మీడియా పాయింట్‌లో విలేకర్ల సమావేశంలో తెలియజేశారు. ఎస్.వీరయ్య మాట్లాడుతూ.. రాష్ట్రంలోని రైతాంగం, కార్మికులు, పేదలు, నిర్వాసితుల సమస్యలతోపాటు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై మహాసభలో చర్చించినట్లు తెలిపారు. బిజెపి, కాంగ్రెస్ రైతాంగాన్ని మోసం చేశాయన్నారు. కనీస మద్దతు ధర కల్పించేందుకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని డిమాండ్ చేస్తూ మహాసభ తీర్మానం చేసిందని చెప్పారు. వ్యవసాయోత్పత్తులకు డాక్టర్ ఎం.ఎస్ స్వామినాథన్ సూచించిన ప్రకారం పెట్టుబడులను నిర్ధారించి దానికి 50 శాతం కలిపి మద్దతు ధర నిర్ణయించే విధంగా చట్టం చేయాలని డిమాండ్ చేశారు. రైతులు పండించే ఆరు రకాల పంటలకు బోనస్ ఇస్తామని, నాలుగు రకాల పంటలకు కనీస మద్దతు ధర కల్పిస్తామని గత ఎన్నికల్లో కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చాక పట్టించుకోవడంలేదన్నారు. ప్రధాని మోడీ విడుదల చేసిన కనీస వేతనాల జిఒలో రోజుకు రూ.178 కూలి ఇస్తే సంబర పడాలని చెప్పడం సిగ్గుచేటని, నెలకు రూ.4628 కుటుంబ పోషణకు ఎలా సరిపోతాయని ప్రశ్నించారు. 73 షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్స్‌లో కనీస వేతనాల ముసాయిదాను విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం రూ.11 వేల వేతనం ఇస్తే సరిపోతుందని చెప్పడం దుర్మార్గమని పేర్కొన్నారు.

సొంతిల్లు అనేది ఆత్మగౌరవ సమస్య

సొంతిల్లు అనేది ఆత్మగౌరవ సమస్యగా ఉంటుందని, రాష్ట్రంలో లక్షలాది కుటుంబాలకు ఇళ్లు లేవని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మల్లు లక్ష్మి తెలిపారు. రాష్ట్రంలోని పేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇచ్చే విషయంలో గత బిఆర్ఎస్ ప్రభుత్వం మాదిరిగానే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. ప్రజల పోరాటాల ఫలితంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జనవరి 26 రిపబ్లిక్ డే సందర్భంగా రాష్ట్రంలోని 110 నియోజకవర్గాల్లో నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇళ్లుమంజూరు చేస్తామని ప్రకటించారన్నారు. ఇంటి నిర్మాణానికి రూ.6 లక్షలు ఇస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చాక రూ.5 లక్షలే ఇస్తామని చెప్పడం మోసగించడమేనని తెలిపారు. ఇంటి నిర్మాణ వ్యయం పెరుగుతున్నందున లబ్ధిదారునికి రూ.15 లక్షల చొప్పున ఇవ్వాలని మహాసభ డిమాండ్ చేసిందని తెలిపారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద రాష్ట్రంలో 2.5 లక్షల ఇళ్లు మంజూరు చేశామంటూ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పార్లమెంటులో ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్రంలో ప్రధాన మంత్రి అవాజ్ యోజన కింద పేదలకు ఎన్ని ఇళ్లు ఇచ్చారో చూపించగలరా అని ప్రశ్నించారు. పేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాల కోసం సమరశీలంగా ప్రజా పోరాటాలు నిర్వహించాలని మహాసభ ఉద్యమ కర్తవ్యంగా ఎంచుకుందన్నారు. జాతీయ ఉపాధి హామీ చట్టం కింద పని చేస్తున్న గ్రామీణ పేదలకు సంవత్సరానికి 200 పని దినాలు కల్పించాలని, రోజుకు రూ.600 వేతనం చెల్లించాలని, ఈ చట్టాన్ని పట్టణాల్లోనూ అమలు చేయాలని డిమాండ్ చేశారు. మూసీ ప్రక్షాళన పేరుతో రియల్ ఎస్టేట్ ప్రాజెక్టుగా మార్చే కుట్ర జరుగుతోందని అన్నారు. భూ నిర్వాసితులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం మార్కెట్ ధరకు మూడింతలు పెంచి నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం సంగారెడ్డి జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.అడివయ్య పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకున్న మాజీ ఉప రాష్ట్రపతి హమీద్ అన్సారీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో



మాజీ ఉప రాష్ట్రపతి హమీద్ అన్సారీ ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో 80 ఏళ్లకు పైబడిన వృద్ధులు, వికలాంగులు ఇంటి నుంచే ఓటు వేసేందుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. పోలింగ్‌కు ముందే ఈ ఓట్ ఫ్రమ్ హోమ్ ప్రక్రియ పూర్తి చేస్తారు. న్యూఢిల్లీ జిల్లా ఎన్నికల కార్యాలయం ఇంటి నుంచి ఓటు వేసే సౌకర్యం కల్పించింది. మొబైల్ పోస్టల్ బ్యాలెట్ ద్వారా హమీద్ అన్సారీ సోమవారం ఉదయం ఓటు వేశారు. అన్సారీ ఓటు హక్కు వినియోగించుకున్న ఫొటోలను న్యూఢిల్లీ జిల్లా ఎన్నికల కార్యాలయం విడుదల చేసింది. ఫిబ్రవరి 5న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జరగనుంది. 8న ఓట్లను లెక్కించి ఫలితాలను వెల్లడించనున్నారు. ఢిల్లీలోని మొత్తం 70 అసెంబ్లీ స్థానాలకు ఒకే విడతలో పోలింగ్ నిర్వహిస్తున్నారు. ఈ ఎన్నికల్లో అధికార ఆప్, ప్రతిపక్ష బిజెపి, కాంగ్రెస్ పార్టీ మధ్య త్రిముఖపోరు నెలకొంది. గత రెండు అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ హవా కొనసాగింది. ఆ రెండు ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఒక్క సీటు కూడా దక్కలేదు. బిజెపికి 2015లో 3, 2020లో 8 ఎమ్మెల్యే స్థానాలు దక్కాయి.

గుంటూరుకు 3 ప్రాజెక్టులు తెచ్చాం : కేంద్ర మంత్రి పెమ్మసాని

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

గుంటూరుకు ఏడాదిలో మూడు ప్రాజెక్టులు తెచ్చామని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం నాడిక్కడ ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సుమారు మూడు లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయన్నారు. టిసిఎస్, శ్రీసిటీలో 11 ప్రాజెక్టులు, హెచ్‌సిఎల్, రిలయన్స్ సహా 49 కంపెనీలను రాష్ట్రానికి తెచ్చామన్నారు. దావోస్‌కు ముగ్గురు ముఖ్యమంత్రులు మాత్రమే వెళ్లారని, అందులో తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఉన్నారని తెలిపారు. గుంటూరులోని శంకర్ విలాస్ రోడ్డు, ఇన్నర్ రింగ్ రోడ్డు, పెదపలకలూరు రైల్వే ప్రాజెక్టులను తీసుకొచ్చామన్నారు. గుంటూరులో రోడ్డు, రైల్వే ప్రాజెక్టుల వల్ల ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు తగ్గుతాయని పేర్కొన్నారు. రాష్ట్రంపై భారం పడకుండా గుంటూరుకు మూడు ప్రాజెక్టులు తెచ్చామన్నారు. ఈ మూడు ప్రాజెక్టులను మూడేళ్లలో పూర్తి చేస్తామని తెలిపారు.

మహారాష్ట్రలో తొలి జిబిఎస్ మరణం!

- పూణేలో వంద దాటిన కేసులు

ముంబయి : మహారాష్ట్రలో గిలైన్ బారె సిండ్రోమ్ (జిబిఎస్)తో తొలి మరణం సంభవించినట్లుగా అనుమానిస్తున్నారు. సోలాపూర్ జిల్లాలో 40 ఏళ్ల వ్యక్తి జిబిఎస్‌తో మరణించినట్లు ప్రాథమిక నివేదికలో వెల్లడైనట్లు అధికారులు తెలిపారు. జలుబు, దగ్గు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులతో ఈనెల 18న సోలాపూర్‌లోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చేరిన వ్యక్తి పరిస్థితి విషమించడంతో ఐసియులో చికిత్స పొందుతూ ఇటీవల మరణించాడని అధికారులు తెలిపారు. ప్రాథమిక నివేదికలో జిబిఎస్‌తో మరణించాడని వెల్లడైందని, పూర్తి నివేదిక రావడానికి 5, 6 రోజుల సమయం పడుతుందని తెలిపారు.

పూణేలో 101 జిబిఎస్ కేసులు నమోదయ్యాయని, వారిలో 33 మంది మహిళలని రాష్ట్ర ఆరోగ్య శాఖ అధికారి ఒకరు తెలిపారు. వీరిలో 16 మంది వెంటిలేటర్ సహాయంతో చికిత్స పొందుతున్నట్లు చెప్పారు. పూణేలో జిబిఎస్ వ్యాప్తిని అంచనా వేయడానికి కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖకు చెందిన బృందం పర్యటించింది. పూణే మున్సిపల్ కార్పొరేషన్ ఆరోగ్య విభాగం ఇప్పటి వరకూ 25,578కు పైగా ఇళ్లను సర్వే చేసింది. జిబిఎస్ అనేది ఒక ఆటో ఇమ్యూన్ న్యూరోలాజికల్ డిజార్డర్. ఇది సోకిన వారికి వారి రోగ నిరోధక వ్యవస్థ వారి నరాలపైనే దాడి చేస్తుంది. దీంతో కండరాల బలహీనత ఏర్పడుతుంది. పక్షవాతానికి కూడా దారి తీస్తుంది.

సరిహద్దుల వద్ద జన సంద్రం!

- ఉత్తర గాజాలోని స్వస్థలాలకు వచ్చేందుకు పాలస్తీనియన్ల యత్నం



గాజా, జెరూసలేం : ఏడాదికి పైగా సాగిన ఇజ్రాయిల్ నరమేధం కారణంగా నిర్వాసితులైన వేలాదిమంది పాలస్తీనియన్లు తిరిగి ఉత్తర గాజాలోని స్వస్థలాలకు వచ్చేందుకు సిద్ధమయ్యారు. అయితే, సరిహద్దుల్లోనే వీరిని ఇజ్రాయిల్ దళాలు అడ్డుకుంటున్నాయి. గత 15మాసాలుగా తాత్కాలిక శిబిరాల్లో వీరు కాలం వెళ్లదీస్తూ వచ్చారు. ఇజ్రాయిల్ దాడులతో తీవ్రంగా ధ్వంసమైన తమ ఇల్లూ వాకిళ్లను, అసలక్కడ ఏమైనా మిగిలున్నాయా లేదా అనేది చూసుకోవాలన్న ఆతృత వారిలో కనిపిస్తోంది. దీంతో సరిహద్దు ప్రాంతాలు జనసంద్రాన్ని తలపిస్తున్నాయి. కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చినప్పటి నుండి తాము స్వస్థలాలకు వెళ్లేందుకు ఎదురుచూస్తున్నామని వారు వ్యాఖ్యానిస్తున్నారు. ఇజ్రాయిల్ ఆర్మీ ఆదేశాల మేరకు ఆనాడు వీరందరూ దక్షిణ గాజాకు వెళ్లిపోవాల్సి వచ్చింది. కాలినడకన వచ్చేవారు బందీగా వున్న ఇజ్రాయిల్ మహిళ అరబెల్ యహూద్‌ను, మరో ఇద్దరిని శుక్రవారానికల్లా విడుదల చేసేందుకు హమాస్ అంగీకరించిందని, పైగా ఒప్పందంలో భాగంగా మొదటి దశలో విడుదల చేసేవారి పరిస్థితిపై కూడా సమాచారం అందించామని కతార్ ప్రకటించిన నేపథ్యంలో ఇజ్రాయిల్ ఈ అనుమతిని ఆమోదించింది.

ఇజ్రాయిల్-హిజ్బుల్లా మధ్య కాల్పుల విరమణ ఒప్పందం ఫిబ్రవరి 18వరకు పొడిగిస్తున్నట్లు అమెరికా, లెబనాన్ ప్రకటించాయి. గాజా ప్రజలను బలవంతంగా ఈజిప్ట్, జోర్డాన్‌లకు పంపివేయడం ద్వారా గాజాను ప్రక్షాళన చేయాలన్న ట్రంప్ ప్రతిపాదనను పాలస్తీనియన్లు తీవ్రంగా ఖండించారు. యుఎన్ఆర్‌డబ్ల్యుఎ కార్యకలాపాలపై విధించిన నిషేధాన్ని ఇజ్రాయిల్ అమలు చేసినట్లైతే గాజాలో సహాయక చర్యలు పూర్తిస్థాయిలో చేపట్టడం కష్టమని యుఎన్ఆర్‌డబ్ల్యుఎ డైరెక్టర్ రోస్ వ్యాఖ్యానించారు. ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లోని నూర్ షామస్ శిబిరంపై జరిగిన దాడిలో ఇద్దరు మరణించగా, ముగ్గురు గాయపడ్డారు. దక్షిణ లెబనాన్‌పై ఆదివారం ఇజ్రాయిల్ జరిపిన దాడుల్లో మరణించిన వారి సంఖ్య 24కు పెరిగింది. 12మంది చిన్నారులతోసహా 134మంది గాయపడ్డారని లెబనాన్ ఆరోగ్య శాఖ వర్గాలు తెలిపాయి.

కైలాష్ మానస సరోవర్ యాత్ర పునరుద్ధరణ

- భారత్, చైనా నిర్ణయం

బీజింగ్ : కైలాష్ మానస సరోవర్ యాత్రను పునరుద్ధరించాలని భారత్, చైనా నిర్ణయించాయి. ఇందుకు సంబంధించి రెండు దేశాల మధ్య నేరుగా విమాన సర్వీసులను పునరుద్ధరించేందుకు అంగీకరించాయి. ప్రస్తుతం బీజింగ్‌లో అధికార పర్యటనలో వున్న భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రి సోమవారం చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యితో జరిపిన భేటీలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ప్రతి సంవత్సరం జూన్ -సెప్టెంబరు మాసాల మధ్య ఉత్తరాఖండ్‌లోని లిపులేఖ్ పాస్ , సిక్కింలోని నాథులా పాస్ ఈ రెండు మార్గాల గుండా కైలాష్ మానస సరోవర్ యాత్రం జరగుతుంది. కోవిడ్ సమయంలో ఈ యాత్రను నిలుపు చేశారు. ఆ తరువాత ఇప్పుడే మళ్లీ ప్రారంభమవుతోంది. ఇరు దేశాలు పరస్పర అవగాహనను, మద్దతును పెంపొందించుకునేందుకు మరిన్ని చర్యలు తీసుకోవాల్సిన అవసరం వుందని వాంగ్ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. పరస్పర అనుమానాలు, విభజన వంటి చర్యలకు కూడా ఇరు దేశాలు దూరంగా వుండాలని వాంగ్ పేర్కొన్నట్లు మీడియా పేర్కొంది. మిస్రి మాట్లాడుతూ, ఇరు దేశాలు వివిధ రంగాల్లో విభేదాలను పరిష్కరించుకుంటూ, ఆచరణాత్మక సహకారాన్ని పెంచుకుంటూ చర్చలు, సమాచార మార్పిడి ద్వారా లబ్ధి పొందుతున్నాయని చెప్పారు. ఇరు దేశాల మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి 75ఏళ్లు పూర్తయిన సందర్భంగా చైనాతో కలిసి పనిచేయడానికి భారత్ ఎదురుచూస్తున్నట్లు తెలిపారు. షాంఘై సహకార సంస్థ అధ్యక్ష బాధ్యతలు చేపట్టనున్న చైనాకు తమ వైపు నుండి పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. ఆదివారం బీజింగ్ చేరుకున్న మిస్రి పలువురు ఉన్నతాధికారులతో, పాలక కమ్యూనిస్టు పార్టీ నేతలతో చర్చలు జరిపారు. ఇరు దేశాల నేతలు కుదుర్చుకున్న కీలకమైన ఏకాభిప్రాయాన్ని సంయుక్తంగా అమలు చేయడం ఉభయ పక్షాలు అభిప్రాయాలు పంచుకున్నాయి. చర్చల ప్రక్రియను బలోపేతం చేసుకుంటూ ఇరు దేశాల సంబంధాల సుస్థిర అభివృద్ధికి కృషి చేయాలని నిర్ణయించారు.

తెలంగాణ ఆర్‌టిసి కార్మికుల సమ్మె నోటీసు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ఆర్‌టిసి యాజమాన్యానికి కార్మికులు సమ్మె నోటీసులు ఇచ్చారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వంలో ఆర్‌టిసి ఉద్యోగుల విలీనం, పిఆర్‌సి అమలు, సిసిఎస్, పిఎఫ్ డబ్బులు రూ.2,700 కోట్లు చెల్లింపు తదితర డిమాండ్లను యాజమాన్యం ముందు ఉంచారు. డిమాండ్లు నెరవేర్చకుంటే సమ్మెకు దిగుతామని నోటీసుల్లో పేర్కొన్నారు. 'మేనిఫెస్టోలోని అంశాలను ప్రభుత్వం అమలు చేయాలి. ఎలక్ట్రిక్ బస్సుల కొనుగోలు, నిర్వహణను ప్రైవేటు కంపెనీలు చేస్తున్నాయి. వాటిని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి. ట్రేడ్ యూనియన్లకు ఎన్నికలు నిర్వహించడం లేదు. యూనియన్లు రద్దు చేసి, కార్మికులకు పనిగంటలు పెంచారు." అని జెఎసి నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. పెద్ద ఎత్తున కార్మిక సంఘాల నేతలు బస్‌భవన్ వద్దకు చేరుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు భారీగా మోహరించారు.

67 మంది భారతీయులకు విముక్తి

- లావోస్‌లో సైబర్ స్కామ్ ముఠా నుంచి రక్షించిన రాయబార కార్యాలయం



వియంటియాన్ : లావోస్‌లో సైబర్ స్కామ్ ముఠా చేతిలో చిక్కుకున్న 67 మంది భారతీయలను అక్కడి భారత రాయబార కార్యాలయం రక్షించింది. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది. లావోస్‌లోని బోకియో ప్రావిన్స్‌లోని గోల్డెన్ ట్రయాంగిల్ స్పెషల్ ఎకనామిక్ జోన్ (జిటిఎస్ఇజెడ్)లో సైబర్ స్కామ్‌లకు పాల్పడే ఒక ముఠా బెదిరింపులు, బలప్రయోగంతో 67 మంది భారతీయులతో బలవంతంగా పని చేయించుకునేది. వీరు సహాయం కోసం రాయబార కార్యాలయాన్ని అభ్యర్థించారు. దీనికి స్పందించిన కార్యాలయం అధికారుల బృందాన్ని జిటిఎస్ఇజెడ్‌కు పంపింది. భారతీయుల విడుదల కోసం లావోస్ అధికారులతోనూ సమన్వయం చేసుకుంది. అవసరమైన విధానాలు, డాక్యుమెంట్లు అందజేసింది. తరువాత వారిని బోకియో ప్రావిన్స్‌లో నుంచి రాజధాని వియంటియాన్‌కు తరలించింది. అక్కడ వారికి వసతి, ఆహారంతోపాటు అవసరమైన ఇతర సహాయాలను కల్పించింది. వీరిని సురక్షితంగా భారత్‌కు తరలిస్తామని లావోస్‌లోని భారత రాయబారి ప్రశాంత్ అగర్వాల్ హామీ ఇచ్చారు.

భారతీయుల్ని రక్షించడంలో సహాయం చేసిన లావోస్ అధికారులకు రాయబార కార్యాలయం కృతజ్ఞతలు తెలిపింది. జిటిఎస్ఇజెడ్‌లోని క్రిమినల్ సిండికేట్లపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది. విదేశీ ఉద్యోగ అవకాశాలపై జాగ్రత్తగా ఉండాలని భారత యువతను కార్యాలయం హెచ్చరించింది. ఇప్పటి వరకూ 924 మంది భారతీయుల్ని లావోస్‌లోని రాయబార కార్యాలయం రక్షించింది. వీరిలో 857 మందిని సురక్షితంగా భారత్‌కు తిరిగి పంపించింది.

చేతులు, కాళ్లకు బేడీలతో ...

ఇమ్మిగ్రెంట్లను పంపిన తీరుపై బ్రెజిల్ ఆగ్రహం

- ట్రంప్ వివరణ ఇవ్వాలని డిమాండ్



రియో డీ జెనీరో : అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆదేశాల మేరకు 88మంది బ్రెజిలియన్లను వెనక్కి పంపిన తీరు పై బ్రెజిల్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. దీనిపై ట్రంప్ వివరణ ఇవ్వాలని డిమాండ్ చేసింది. ఉపాధి కోసం వలస వచ్చినవారిని నేరస్తులు, ఉగ్రవాదులను చూసినట్లు చేతులకు బేడీలు వేసి విమానంలో తీసుకొచ్చారు. కొంతమంది కాళ్లకు సంకెళ్లు కూడా వేశారు. పైగా ఆ విమానంలో తాగడానికి మంచి నీరు కూడా ఇవ్వలేదని, ఎసి లేదని బ్రెజిల్ విదేశాంగ శాఖ తెలిపింది. స్వదేశానికి తిప్పి పంపించే విషయంలో వారి పట్ల అమానుషంగా వ్యవహరించారని విమర్శించింది. గ్వాటెమాలా, బ్రెజిల్ వంటి పలు దేశాలకు ఇమ్మిగ్రెంటన్లను తరలిస్తూ గత కొద్ది రోజులుగా ట్రంప్ సర్కార్ తీసుకుంటున్న చర్యలపై లాటిన్ అమెరికా దేశాలు తీవ్ర అభ్యంతరం తెలిపాయి. విమానం దిగుతున్న వారు చేతులు బేడీలతో ఇబ్బందిగా నడుస్తున్న ఫోటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. వారిలో ఒకరైన కంప్యూటర్ టెక్నీషియన్ ఎడ్గర్ డ సిల్వా (31) మాట్లాడుతూ, చేతులు, కాళ్లు కట్టేయడంతో బాత్‌రూమ్‌కు కూడా వెళ్లలేకపోయామని, తాగడానికి కనీసం నీరు కూడా ఇవ్వలేదని చెప్పారు. విమానంలో చాలా వేడిగా వుండడంతో కొంతమంది కళ్లు తిరిగి పడిపోయారన్నారు. పైగా విమానంలో సాంకేతిక లోపం తలెత్తడంతో గమ్య స్థానానికి వెళ్లకుండా మధ్యలో మనాస్‌లో దింపేశారని అన్నారు. వీరందరినీ ప్రత్యేక విమానంలో వారి గమ్యస్థానాలకు చేర్చాల్సిందిగా అధ్యక్షుడు లూలా డసిల్వా ఆదేశాలు జారీ చేశారు.



లుకషెంకో ఘన విజయం

మిన్స్క్ : బెలారస్ అధ్యక్షుడిగా అలెగ్జాండర్ లుకాషెంకో మరోసారి ఘన విజయం సాధించారు. బెలారస్ సెంట్రల్ ఎన్నికల కమిషన్ సోమవారం విడుదల చేసిన ప్రాథమిక వివరాల ప్రకారం లుకషెంకోకు 86.82శాతం ఓట్లు లభించాయి. ఇతర అభ్యర్థులకు వరుసగా 3.21, 2.02, 1.86, 1.74శాతం ఓట్లు లభించాయి. బెలారస్ చట్టం ప్రకారం అధ్యక్ష అభ్యర్థికి 50శాతానికి పైగా ఓట్లు లభిస్తే విజేతగా ప్రకటిస్తారు. ప్రత్యక్ష బ్యాలెట్ ద్వారా ఎన్నికయ్యే అధ్యక్షుడి పదవీ కాలం ఐదేళ్లు. ఈ ఓటింగ్ తుది ఫలితాలు ఫిబ్రవరి 5లోగా ఎన్నికల కమిషన్ లాంఛనంగా ప్రకటించనుంది.

కొలంబియాపై సుంకాల కొరడా

వాషింగ్టన్: కొలంబియాపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల కొరడా ఝుళిపించారు. వలసదారులను తీసుకెళ్తున్న రెండు అమెరికా సైనిక విమానాలను కొలంబియాలో దిగేందుకు ఆ దేశ అధ్యక్షుడు గుస్తావో పెట్రో తిరస్కరించారు. దీంతో ఆగ్రహించిన ట్రంప్ కొలంబియా నుండి దిగుమతి చేసుకున్న వస్తువులపై అదనంగా 25 శాతం సుంకాలు విధించనున్నట్లు ప్రకటించారు. వలసదారులకు బేడీలు వేసి, సైనిక విమానాలలో పంపడాన్ని కొలంబియా అధ్యక్షుడు తీవ్రంగా గర్హించారు.

కమ్యూనిస్టుల త్యాగాలు చిరస్మరణీయం

(మొదటిపేజీ తరువాయి)

త్యాగాలు ఫలప్రదం అవ్వాలంటే ఇప్పుడు ఎస్ఎఫ్ఐ, ఎఐవైఎఫ్, ప్రజానాట్యమండలితోపాటు అందరూ సాంస్కృతికంగా, సామాజికంగా కలిసి పని చేయాలని సూచించారు. నేడు రాజకీయాలు పూర్తిగా మారిపోయామన్నారు. ప్రజల ఆలోచనలు మారాయని, అందుకు అనుగుణంగా కమ్యూనిస్టు పార్టీలు ఆలోచన చేయాలని సూచించారు. వారిని ఏ దిశగా నడిపించాలో ప్రతి ఒక్కరూ అధ్యయనం చేయాల్సిన సమయం వచ్చిందన్నారు. సాంస్కృతిక రంగంలో ఉన్న ప్రజానాట్య మండలిపై ఈ బాధ్యత మరింతగా ఉందని పేర్కొన్నారు. కళాకారులు దేశానికి వన్నెతేవడంతోపాటు, ఉద్యమాలను నడిపించారన్నారు. సిపిఎం రాష్ట్ర మహాసభలో మంచి నిర్ణయాలు తీసుకొని దేశాన్ని నడిపించాలని కోరారు. అనంతరం ప్రజా నాట్యమండలి కళాకారులు ఆలపించిన గీతాలు నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. వివిధ కళారూపాలను ప్రదర్శించారు. కళాకారులకు జ్ఞాపికలను భరద్వాజ అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌సి విఠపు బాలసుబ్రమణ్యం, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి మూలం రమేష్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.మోహన్‌రావు, ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి అనిల్, జిల్లా నాయకులు విజయ్‌కుమార్, ఎం.పుల్లయ్య, గండవరపు శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

నవ్వులు పూయిద్దామా..!



అక్షరాలతో వారధి కట్టి
విజ్ఞానం నడిపిద్దామా
అందరమొక్కటై జతకట్టి
సంస్కారం నింపేద్దామా

తారతమ్యాల్ని పక్కనబెట్టి
సమతా వంతెన కట్టేద్దామా
కల్మషానికి చరమగీతం పాడి
సమ సమాజాన్ని నిర్మిద్దామా

ఒక్కొక్క ఇటుకను పేర్చుతూ
చక్కటి పునాది వేసేద్దామా
చేయి చేయి కలిపి స్నేహాన్ని
మంచి మార్గంలో నడిపిద్దామా

బద్దకమన్నది తొలిగించేస్తూ
బాధ్యత కల్పించుదామా
స్నేహ భావంతో ఒకటిగా
అడుగులు కదిపి వెళ్దామా

భేద భావనకు తలొగ్గిపోక
చేయి చేయి కలుపుకుందామా

అందరమొక్కటై ముందుకెళ్తూ
భావితరాలను బతికిద్దామా

ఎంచక్కని ఆలోచనకు
ఒక రూపం కూర్చుదామా
కలకాలం ఒక్కటై వుంటూనే
నవ్వుల్ని పూయిద్దామా


రంగులు మార్చే బుద్ధికి
గుణపాఠం నేర్పిద్దామా
ఐకమత్యానికి విలువనిస్తూ
గేయంగా వివరించుదామా

నూతనత్వానికి ఎంచక్కా
స్వాగతం పలుకుదామా
కొత్త కొత్తవి కనిపెడుతూనే
విజ్ఞానం విస్తరించుదామా?

– నరెద్దుల రాజారెడ్డి,
96660 16636.

లెక్కలు చేద్దామా...!

పిల్లలూ, పక్కనున్న పట్టికలో రకరకాల బొమ్మలున్నాయి. వాటిని అంకెలుగా గుర్తించి గణించాము. చివరి లైన్లో ఉన్న బొమ్మల అంకెల ఆధారంగా జవాబు మీరు రాబట్టండి.



జవాబు : 126



నేను గీసిన బొమ్మ

డి.ఉమ,
5వ తరగతి,
దిగువ సాంబయ్య పాళెం,
తొట్టంబేడు మండలం,
తిరుపతి జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com



డాక్టర్ కె.ఎం చెరియన్..
'హృదయ డాక్టర్' అని చెప్పడం కంటే 'హృదయమున్న డాక్టర'ని చెప్పడం సబబు. దేశంలో గుండె శస్త్రచికిత్సలో ఆద్యుడిగా ఆయన చరిత్ర సృష్టించారు. 50 ఏళ్లపాటు గుండె వైద్యుడిగా సేవలందించి, ఎందరో ప్రాణాలను నిలబెట్టారు. వందలమంది వైద్యులను తయారుచేసిన మహా మేధావి. ప్రజలందరికీ వైద్యం అందుబాటులోకి తేవాలని పరితపించిన దేశభక్తుడు. వైద్య శాస్త్రంలో ఆవిష్కరణ, ఆచరణ ముఖ్యమని, అదే ఆచరించమని ముందుతరాలకి దిక్సూచిలా మార్గదర్శనం చేశాడు. వైద్యవృత్తిని సేవకి మారుపేరుగా నిరూపించిన నిస్వార్థ సేవకుడు. వైద్యుడు వైద్యానికే పరిమితం కాదని, రెండు దేశాల మధ్య సౌభ్రాతృత్వానికీ కృషి చేయవచ్చని విశదపరిచిన గొప్ప దౌత్యవేత్త అతను.

స'హృదయ' డాక్టర్ చెరియన్

ఇటీవల జనవరి 24న కేరళలో లిటరటీ ఫెస్ట్ (సాహిత్య ఉత్సవం) నిర్వహించారు. అందులో చెరియన్ ఆత్మకథ 'జస్ట్ యాన్ ఇన్స్ట్రుమెంట్' ఆవిష్కరించారు. అప్పుడు వైద్య నిపుణులు పాటించవలసిన ఉత్తమ వైద్య సంస్కృతి, పని సంస్కృతి గురించి ఆయన ప్రస్తావించారు. 'రోగిని, ప్రతి వైద్యుడు తన ఇంటి సభ్యుడిగా భావించాల'ని చెప్పారు. శస్త్రచికిత్సలో తనకెదురైన ఎన్నో అనుభవాలను అక్కడ పంచుకున్నారు. మయామికి చెందిన తన స్నేహితుడు 20 మంది ఇరాక్ చిన్నారులకు గుండె శస్త్రచికిత్స అవసరమని చెప్పినప్పుడు 'శస్త్రచికిత్సలు కంటే నాపై అతనికి ఉన్న నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే నాకు ముఖ్యంగా కనిపించింద'ని చెప్పారు. ఇంకా వైద్యుడిగా వైద్యానికే పరిమితం కాలేదని, ఇరాక్ జైళ్లలో బందీలుగా చిక్కుకున్న నలుగురు డ్రైవర్ల విడుదల కోసం కృషి చేశానని చెప్పారు. 'చిన్నారులకు శస్త్రచికిత్స చేసిన రెండేళ్లకి అప్పటి దేశ విదేశాంగ మంత్రి ఇ.అహ్మద్ నుండి నాకు ఫోన్ వచ్చింది. ఇరాక్‌లో బందీలుగా ఉన్న ట్రక్కు డ్రైవర్ల విడుదలకు సహకరించమని దాని సారాంశం. అప్పుడు ఇరాక్ ప్రజలనుద్దేశించి రికార్డు చేసిన ఓ సందేశం పంపాను. అది చేరిన తరువాతే డ్రైవర్లు విడుదలయ్యారు' అని కేరళ ఫెస్ట్‌లో ఆయన గుర్తుచేసుకున్నారు. మదర్‌థెరిసా కోరిక మేరకు కోల్‌కత్తాలో ఓ పేద పిల్లాడికి నామమాత్రపు ఫీజుతో వైద్యం చేశానని కూడా తెలిపారు. చెరియన్ చెప్పిన ఈ అనుభవాలన్నీ నేటితరం వైద్యులకు గొప్ప పాఠాలు.

సాధారణ బాల్యం

చెరియన్ పూర్తి పేరు, కొట్టురతు మమ్మెన్ చెరియన్. కేరళ అలపుళ జిల్లా కాయంకుళం అనే చిన్న పట్టణంలో జన్మించారు. తండ్రి టీ ఎస్టేట్ ఉద్యోగి, తల్లి గృహిణి. మున్నార్ కొండల్లో వారి కుటుంబం నివసించింది. చెరియన్ కాళ్లకి చెప్పులు లేకుండా బడికి వెళ్లారు. వీధిలో గోలీకాయలు ఆడుకున్నానని ఒక సందర్భంలో చెప్పారు. ఐదో తరగతిలో లెక్కల్లో సున్నా మార్కులు వచ్చాయని, గ్రేస్‌మార్కులతో ఆ సంవత్సరం పాసైపోయానని ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. ఇంత సాధారణ బాల్యం గడిపిన చెరియన్ వైద్యశాస్త్రంలో ఇన్ని అద్భుతాలు సాధించడం వెనుక ఆయన కృషి, పట్టుదల ఎంతో గొప్పది.

1964లో మణిపాల్ కస్తూర్బా మెడికల్ కాలేజీలో మెడిసిన్ చదివారు. ఆ సంస్థలోనే ఎంఎస్ సర్జరీ పూర్తి చేశారు. 1970లో వెల్లూరు క్రిస్టియన్ మెడికల్ కాలేజీ హాస్పిటల్ సర్జరీలో లెక్చరర్‌గా కెరియర్ ప్రారంభించారు. ఆ తరువాత చెన్నై రైల్వే ఆస్పత్రి వైద్యుడిగా, మద్రాస్ మెడికల్ మిషన్ సహా అనేక ప్రైవేటు, ప్రభుత్వ భాగస్వామ్య ఆస్పత్రుల్లో సేవలు అందించారు.

దేశవిదేశాల్లో అభ్యసన

దేశ ప్రజలకు మరిన్ని వైద్యసేవలు అందించేందుకు విదేశాల్లో వైద్య విద్య అభ్యసించిన తొలితరం వైద్య నిపుణుల్లో చెరియన్ ఒకరు. సీనియర్ రిజిస్ట్రార్ (చాలా ప్రత్యేక శిక్షణ పొందుతున్న వైద్యులకు ఇచ్చే ఒక హోదా)గా ఆస్ట్రేలియాకి వెళ్లారు. వైద్యశాస్త్రంలో నైపుణ్యం కోసం ఆయన చేసిన అన్వేషణ ప్రపంచ ప్రసిద్ధ వైద్య విశ్వవిద్యాలయం అలబామా వరకు దారితీసింది. కార్డియాక్ చికిత్సలో ప్రపంచంలోనే అత్యుత్తమ వైద్యం అందించే యూనివర్శిటీ అది.

చెరియన్ అందిపుచ్చుకున్న వైద్య నైపుణ్యంతో తమ దేశాల్లో సేవ చేయమని విదేశాల నుండి ఆఫర్లు వచ్చాయి. కానీ ఆయన వాటన్నింటినీ సున్నితంగా తిరస్కరించారు. దేశ ప్రజలపై ఉన్న మమకారంతో, భారత్‌కి తిరిగివచ్చి ఇక్కడే స్థిరపడ్డారు.

వైద్య సేవలు

మొట్టమొదటి కరోనరీ ఆర్టరీ బైపాస్ సర్జరీ చేసిన వైద్యుడు ఆయన. అంతేకాదు, దేశంలోనే తొలి గుండె మార్పిడి, గుండె–ఊపిరితిత్తుల మార్పిడి, పిల్లల గుండె మార్పిడి చికిత్సలు నిర్వహించిన ఘనత ఆయనకే దక్కుతుంది.

కెరీర్ మొత్తంలో, ఎన్నో ప్రశంసలు అందుకున్న చెరియన్, భారతదేశ కార్డియోథొరాసిక్ సర్జరీ రంగంలో అనేక ప్రథమాలకు ప్రసిద్ధి చెందారు.

- 1976లో జూదీ+ విధానంలో ఇంటర్నల్ మామరీ ఆర్టరీ గ్రాఫ్ట్‌ను ఉపయోగించిన మొదటి వ్యక్తి.
- 1979లో రెండేళ్ల శిశువులో సెన్నింగ్ టెక్నిక్‌ని ఉపయోగించి గ్రేట్ వెసెల్స్ ట్రాన్స్‌పోజిషన్ మొదటి దిద్దుబాటు.
- 1985లో మొదటి విజయవంతమైన బైలేటరల్ ఇంటర్నల్ మామరీ గ్రాఫ్ట్.
- 1995లో బ్రెయిన్ డెత్ చట్టం తర్వాత భారతదేశంలో మొదటి గుండె మార్పిడి.
- 1997లో మొదటి ద్విలేటరల్ ఊపిరితిత్తుల మార్పిడి.
- 1999లో మొదటి ఆటో ట్రాన్స్‌ప్లాంట్.
- 2011లో పీడియాట్రిక్ ట్రాన్స్‌ప్లాంట్.
- గుండె మార్పిడికి వారధిగా ఎడమ జఠరిక సహాయక పరికరం 2011.

మద్రాస్ మెడికల్ మిషన్ స్థాపకుడు. 2004 నుండి పనిచేస్తున్న చెన్నైలోని ఫ్రాంటియర్ లైఫ్‌లైన్ హాస్పిటల్, కేరళలోని పరుమలలోని సెయింట్ గ్రిగోరియోస్ కార్డియో వాస్కులర్ సెంటర్ వ్యవస్థాపకుడు, ఛైర్మన్.

సిడ్నీలోని రాయల్ ఆస్ట్రలేషియన్ కాలేజ్ ఆఫ్ సర్జన్స్ నుండి కార్డియోథొరాసిక సర్జరీ ఫెలోషిప్ పొందాడు. న్యూజిలాండ్, యునైటెడ్ స్టేట్స్ ప్రసిద్ధ కార్డియాక్ సర్జన్లతో పనిచేసిన అనుభవం ఉంది.

చెన్నైలోని సదరన్ రైల్వే హెడ్ క్వార్టర్స్ హాస్పిటల్‌లో చేరిన స్వల్ప కాలంలోనే 1975లో భారతదేశ మొట్టమొదటి కరోనరీ ఆర్టరీ బైపాస్ గ్రాఫ్ట్ CABG సర్జరీని నిర్వహించారు.

స్వదేశీ శస్త్రచికిత్సా పరికరాలు, కుట్టు పదార్థాల ద్వారానే ఆ తరువాతి సంవత్సరాల్లో అనేక జూదీ+ సర్జరీలను విజయవంతంగా చేశారు. గుండె మార్పిడికి సిద్ధం కావడానికి అవసరమైన శస్త్రచికిత్స నైపుణ్యాలలో శిక్షణ పొందడానికి రైల్వే ఆసుపత్రి ప్రాంగణంలో ప్రయోగాత్మక కుక్క ప్రయోగశాలను స్థాపించారు.

ప్రశంసలు, అవార్డులు

1990 నుండి 1993 వరకు భారత రాష్ట్రపతికి గౌరవ శస్త్రచికిత్స నిపుణుడిగా పనిచేశారు. 1991లో భారత ప్రభుత్వంచే పద్మశ్రీ అందుకున్నారు. 2000లో కార్డియోథొరాసిక్ సర్జరీ రంగానికి చేసిన కృషికి గాను కస్తూర్బా మెడికల్ కాలేజీ నుండి జీవిత సాఫల్యపురస్కారం పొందారు. 2005లో హార్వర్డ్ మెడికల్ స్కూల్ నుండి ఎక్సలెన్స్ అవార్డు అందు కున్నారు. ఆయన అవార్డుల్లో మరో మైలురాయి కూడా ఉంది. ఆధునిక వైద్య పితామహుడిగా పరిగణింపబడే హిప్పోక్రేట్స్ జన్మస్థలం గ్రీస్‌లోని క్రోన్ ద్వీపంలోని ఒక రాతిపై చెక్కబడిన ఏకైక భారతీయ సర్జన్ చెరియన్.

వైద్య సంస్థలు

ఆయన మద్రాస్ మెడికల్ మిషన్ (ఎంఎంఎం) వ్యవస్థాపక ఉపాధ్యక్షుడు, డైరెక్టర్, పాండిచ్చేరి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (పిఐఎంఎస్) వ్యవస్థాపక ఛైర్మన్. భారతదేశంలో మొట్టమొదటి మెడికల్ సెజ్, మెడికల్ సైన్స్ పార్క్ అయిన ఫ్రాంటియర్ లైఫ్ లైన్ హాస్పిటల్, ఫ్రాంటియర్ మెడివిల్లే వ్యవస్థాపక ఛైర్మన్. చెరియన్ చారిటబుల్ ట్రస్ట్ కేరళలోని పారుమాలలో సెయింట్ గ్రిగోరియోస్ కార్డియో వాస్కులర్ సెంటరుని నిర్మించింది, ఆయన ఎడ్యుకేషనల్ ట్రస్ట్ పుదుచ్చేరిలో 'ది స్టడీ – లోకోల్ ఇంటర్నేషనల్' పేరుతో అంతర్జాతీయ సిబిఎస్ఇ పాఠశాలను నడుపుతోంది. కేరళలోని చెంగన్నూర్‌లో 2021 మార్చిలో డాక్టర్ కె.ఎం. చెరియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌ని ఏర్పాటు చేశారు.

ఫ్రాంటియర్ లైఫ్ లైన్ హాస్పిటల్, 100 పడకలతో కార్డియాక్ చికిత్సలు అందించే స్పెషాలిటీ హాస్పటల్‌గా నిర్వహించబడుతోంది. దేశంలోనే కాక, 21 ప్రపంచ దేశాల నుండి వచ్చే చిన్నారులకు అక్కడ వైద్యం అందిస్తున్నారు. గుండెజబ్బులను నయం చేయడం, ముఖ్యంగా వివిధ లోపాలతో జన్మించిన పిల్లల్లో గుండెజబ్బులను కనుగొని చెరియన్ నయం చేసేవారు. సవాళ్లతో కూడుకున్న ఎన్నో శస్త్రచికిత్సలు చేశారు.


అవయవమార్పిడి ఉద్యమంలో చెరియన్ చేసిన కృషి ఎంతో గొప్పది. కార్డియాక్ స్టెమ్ సెల్స్, బయోలాజికల్ వాల్వ్, బయోప్రోస్తెటిక్ వాల్వ్ చికిత్సలో నూతన సాంకేతికతతో తనను తాను నిమగ్నం చేసుకున్న వైద్యుడు ఆయన. చెరియన్ భార్య సెలియన్, సంజయ్, సంధ్య పిల్లలు. 2020లో సెలియన్ మరణించారు.

దేశవిదేశాల నుండి వచ్చిన ఎందరో వైద్యులు చెరియన్ దగ్గర శిక్షణ పొందారు. ప్రపంచ తొలి గుండె మార్పిడి శస్త్రచికిత్స వైద్యుడు డాక్టర్ క్రిస్టియాన్ బర్నార్డ్ చెన్నైని సందర్శించినప్పుడు చెరియన్‌తో 10 రోజులు కలిసివున్నారు. సమాజానికి ఆయన చేస్తున్న సేవను ప్రశంసించారు. 'వైద్య కళను ఎక్కడ ప్రేమిస్తారో అక్కడ మానవత్వం పట్ల ప్రేమ కూడా ఉంటుంది' అన్న హిప్పోక్రేట్స్ మాటలను చెరియన్ గట్టిగా విశ్వసించారు.



మా పెళ్లిళ్లు తిరుపతిలోనే : ఖుషీకపూర్

'నా అక్క, జాన్వీకపూర్ తిరుపతిలోనే పెళ్లి చేసుకుంటానంది. ఆమె తర్వాత కొన్నాళ్లకు నేను కూడా తిరుపతిలోనే పెళ్లి చేసుకోవాలని అనుకుంటున్నా. గ్రాండ్‌గా పెళ్లి చేసుకోవాలని నాకు చిన్నప్పటి నుంచి ఉన్న కల. మా పెళ్లి తర్వాత నాన్న బోనీకపూర్ మాతోనే ఉండాలని కోరుకుంటాను. మేము ఉండే భవనంలోనే మా నాన్న కూడా ఉండాలి. నేను, నా భర్త, ఇద్దరు పిల్లలు, చాలా పెంపుడు కుక్కలు... జీవితాన్ని ఎప్పుడూ ఇలా ఊహించుకుంటా' అని బాలీవుడ్ నటి ఖుషీకపూర్ అన్నారు. బాలీవుడ్ కథానాయిక జాన్వీకపూర్ సోదరి ఆమె. తన తాజా చిత్రం 'లవ్ యాపా' ప్రచారంలో భాగంగా ఆమె ఓ ఆంగ్ల మీడియాపై ఇచ్చిన ఇంటర్వ్యూలో తన పెళ్లి గురించి పై విధంగా వ్యాఖ్యానించారు.



రమేష్ స్టూడియో ప్రారంభం


హైదరాబాద్ మణికొండలోని ఓయూ కాలనీలో సంపూర్ణ సూపర్ మార్కెట్‌పైన నూతనంగా నిర్మించిన రమేష్ స్టూడియోను తెలంగాణా సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సోమవారం ప్రారంభించారు. డిఐ సూట్‌ను కూడా ఆయన ప్రారంభించారు. డబ్బింగ్ థియేటర్‌ను తెలుగు చిత్ర నిర్మాతల మండలి అధ్యక్షులు, ఫిలిం ఛాంబర్ సెక్రటరీ దామోదర్ ప్రసాద్, ఎడిటింగ్ రూమ్‌ను ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల బలయ్య, సెకండ్ సూట్‌ను తెలంగాణ ఫిలిం ఛాంబర్ సెక్రటరీ అనుపమ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మణికొండ మున్సిపల్ ఛైర్మన్ నరేంద్ర, ఫెడరేషన్ ప్రెసిడెంట్ వల్లభనేని అనిల్‌కుమార్; నల్గొండ డిసిఎంఎస్ ఛైర్మన్ బొల్లా వెంకటరెడ్డి, పలువురు నగర కౌన్సిలర్లు పాల్గొన్నారు.

బాలకృష్ణకు అల్లు అర్జున్ అభినందనలు




పద్మభూషణ్ అవార్డుకు ఎంపికైనందుకు టాలీవుడ్ కథానాయకుడు నందమూరి బాలకృష్ణకు జాతీయ ఉత్తమ నటుడు అల్లు అర్జున్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ అవార్డుకు పూర్తిగా అర్హుడంటూ తన ట్విట్టర్ ఖాతాలో పోస్ట్‌చేశారు. తెలుగు సినిమాకు అందించిన సేవలకు సరైన గుర్తింపు లభించిందని పేర్కొన్నారు. అజిత్‌కుమార్ సాధించిన విజయం ఎంతోమందికి స్ఫూర్తిదాయకమని ట్వీట్‌చేశారు. పద్మ అవార్డులకు ఎంపికైన శోభన, శేఖర్‌కపూర్, అనంత్‌నాగ్‌లకు అభినందనలు తెలిపారు.

3న 'కన్నప్ప' ప్రభాస్ ఫస్ట్‌లుక్



మంచు విష్ణు ప్రతిష్టాత్మక ప్రాజెక్టుగా తెరకెక్కుతున్న సినిమా 'కన్నప్ప'. ఇప్పటికే ఈ సినిమా షూటింగ్ దాదాపుగా పూర్తయ్యింది. ఈ సినిమాలో బాలీవుడ్ నటుడు అక్షయ్‌కుమార్, మోహన్‌లాల్, కాజల్ అగర్వాల్ లాంటి పలువురు నటిస్తున్నారు. ప్రభాస్ కూడా ఇందులో కనిపిస్తారు. ప్రభాస్ ఫస్ట్‌లుక్‌ను ఫిబ్రవరి మూడో తేదీన విడుదల చేస్తామని మేకర్లు ప్రకటించారు. ముకేశ్‌కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా నుంచి ఇప్పటికే టీజర్ విడుదలైంది. ఇందులో విష్ణు మంచు యాక్షన్ సీన్స్, యుద్ధ సన్నివేశాలు, అక్షయ్‌కుమార్, ప్రభాస్ క్లోజప్ షాట్స్, హై ప్రొడక్షన్ వాల్యూస్, స్టన్నింగ్ విజువల్స్ ఆకట్టుకుంటున్నాయి. యూట్యూబ్‌లో ఇప్పటివరకు అన్ని భాషల్లో కలిపి 30 మిలియన్లకుపైగా వ్యూస్ సాధించింది.

బాబీ డియోల్ ఫస్ట్‌లుక్ విడుదల



పవన్‌కళ్యాణ్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న సినిమా 'హరిహర వీరమల్లు'. క్రిష్, జ్యోతికృష్ణ దర్శకత్వంలో పీరియాడికల్ యాక్షన్ అడ్వెంచర్ మూవీగా ఇది సిద్ధమవుతోంది. ప్రతినాయకుడిగా బాబీడియోల్ నటిస్తున్నారు. సోమవారం నాడు ఆయన పుట్టినరోజును పురస్కరించుకొని చిత్ర యూనిట్ కొత్త పోస్టర్‌ను విడుదల చేసింది. అందులో రాజులకాలం నాటి దుస్తుల్లో బాబీ కత్తి పట్టుకుని యుద్ధానికి సిద్ధమవుతున్నట్లుగా కనిపించారు. రెండు భాగాలుగా రానున్న ఈ మూవీ తొలిభాగం 'హరిహర వీరమల్లు పార్ట్ 1 : స్వార్డ్ వర్సెస్ స్పిరిట్' పేరుతో మార్చి 28న విడుదల కానుంది. అనుపమ్‌ఖేర్, బాబీడియోల్, నిధి అగర్వాల్, నోరాహి ఫతేహి, విక్రమ్‌జీత్, జిషుసేన్‌గుప్తా కీలకపాత్రలు పోషిస్తున్నారు.

వన్డే క్రికెటర్ ఆఫ్ ది ఇయర్‌గా మందాన

2024 ఏడాదికి ఐసిసి ఉత్తమ టెస్టు ఆటగాడిగా జస్ప్రీత్ బుమ్రా



దుబాయ్: భారత మహిళా బ్యాటర్ స్మృతి మందానకు 2024 ఐసిసి వన్డే క్రికెటర్ ఆఫ్ ద ఇయర్ అవార్డు దక్కింది. గత ఏడాది వన్డే క్రికెట్‌లో మందాన అద్భుతమైన ప్రదర్శన ఇచ్చింది. 2024లో ఆమె రన్‌మెషీన్‌లా స్కోర్ చేసింది. కేవలం 13వన్డేల్లో 747 పరుగులు చేసింది. భారత జట్టు విజయాల్లో బ్యాటర్ మందాన కీలక పాత్ర పోషించింది. జూన్‌లో దక్షిణాఫ్రికాతో జరిగిన సిరీస్‌లో ఇండియా 3–0 తేడాతో గెలవడంలో కీలకంగా నిలిచింది. అక్టోబర్‌లో న్యూజిలాండ్‌తో జరిగిన సిరీస్‌లో.. తుది వన్డేల్లో సెంచరీతో చెలరేగింది. డిసెంబర్‌లో ఆస్ట్రేలియాతో పెర్త్‌లో జరిగిన మ్యాచ్‌లో సెంచరీ చేసి తన సత్తా చాటిందామె. మహిళ వన్డే అంతర్జాతీయ క్రికెట్‌లో .. మందానా కొత్త స్టాండర్డ్‌ను నెలకొల్పింది. ఓ క్యాలెండర్ ఇయర్‌లో అత్యధిక పరుగులు చేసిన క్రికెటర్‌గా నిలిచింది. 2024లో ఆమె 13మ్యాచుల్లో 747 రన్స్ చేసింది. దీంతో మహిళల వన్డేల్లో లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్ మందానా.. టాప్ స్కోరర్‌గా నిలిచింది. లౌరా వోల్వార్డ్ 697, టమ్మీ బీమౌంట్ 554, హేలే మాథ్యూస్ 469 రన్స్‌తో ఆ తర్వాత స్థానాల్లో ఉన్నారు. మందానా 57.86 సగటు, స్ట్రయిక్ రేట్ 95.15గా ఉంది. గత ఏడాది మందానా.. నాలుగు వన్డే సెంచరీలు నమోదు చేసింది. మహిళల క్రికెట్‌లో ఇదో కొత్త రికార్డు. 2004లో వన్డేల్లో వందకుపైగా బౌండరీలను బాదింది. వీటిల్లో 95ఫోర్లు, ఆరు సిక్సర్లు ఉన్నాయి.

జస్ప్రీత్ బుమ్రాకూ ఐసిసి అవార్డు...

టీమిండియా పేస్ గుర్రం జస్ప్రీత్ బుమ్రా 2024 ఏడాదికి ఐసిసి టెస్ట్ క్రికెటర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు గెలుచుకున్నాడు. ఐసిసి ట్విటర్(ఎక్స్)లో ఈ విషయాన్ని వెల్లడించింది. గతేడాది టెస్ట్‌ల్లో విశేషంగా రాణించినందుకు గానూ బుమ్రాను 'టెస్ట్ క్రికెటర్ ఆఫ్ ది ఇయర్' అవార్డు వరించినట్లు అందులో పేర్కొంది. బుమ్రా గతేడాది టెస్ట్‌ల్లో 14.92 సగటుతో 71 వికెట్లు తీశాడు. గతేడాది టెస్ట్‌ల్లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ బుమ్రానే. బుమ్రా తర్వాత ఇంగ్లండ్ పేసర్ గస్ అట్కిన్సన్ గతేడాది 11 మ్యాచ్‌ల్లో 52 వికెట్లు తీశాడు. ఈ జాబితాలో బుమ్రా, అట్కిన్సన్ తర్వాత షోయబ్ బషీర్ (49), మ్యాట్ హెన్రీ (48), రవీంద్ర జడేజా (48) ఉన్నారు.

2024 ఏడాదికి ఐసిసి అవార్డు విజేతలు..

- టెస్ట్ క్రికెటర్ ఆఫ్ ది ఇయర్ : జస్ప్రీత్ బుమ్రా
- వన్డే క్రికెటర్ ఆఫ్ ది ఇయర్ : అజ్మతుల్లా ఒమర్‌జాయ్
- టి20 క్రికెటర్ ఆఫ్ ది ఇయర్ : అర్ష్‌దీప్ సింగ్
- ఎమర్జింగ్ క్రికెటర్ ఆఫ్ ది ఇయర్ : కమిందు మెండిస్
- అసోసియేట్ క్రికెటర్ ఆఫ్ ది ఇయర్ : గెర్హార్డ్ ఎరాస్మస్
- అంపైర్ ఆఫ్ ది ఇయర్ : రిచర్డ్ ఇల్లింగ్‌వర్త్
- మహిళా వన్డే క్రికెటర్ ఆఫ్ ది ఇయర్ : స్మృతి మంధన
- టి20 క్రికెటర్ ఆఫ్ ది ఇయర్ : మేలీ కెర్
- ఎమర్జింగ్ వుమెన్స్ క్రికెటర్ ఆఫ్ ది ఇయర్: అన్నెరీ డెర్క్‌సెన్
- అసోసియేట్ క్రికెటర్ ఆఫ్ ది ఇయర్ : ఈషా ఓఝా

సిరీస్‌పై టీమిండియా కన్ను

నేడు ఇంగ్లండ్‌తో మూడో టి20 రాత్రి ● 7.00గం॥ల నుంచి



రాజ్‌కోట్: టి20 ఫార్మాట్‌లో అద్భుత ఫామ్‌లో ఉన్న టీమిండియా.. ఇంగ్లండ్‌తో సిరీస్‌లోనూ వరుస విజయాలతో దూసుకెళ్తోంది. ఐదు మ్యాచుల సిరీస్‌లో భాగంగా కోల్‌కతా, చెన్నై మ్యాచుల్లో ఘన విజయం సాధించిన టీమిండియా.. ఇక సిరీస్‌పై కన్నేసింది. ఈ మ్యాచ్‌లోనూ విజయం సాధించి.. సిరీస్‌ను కైవసం చేసుకోవాలనే కృతనిశ్చయంతో మూడో టి20కి సిద్ధమైంది. మరో వైపు ఇంగ్లాండ్ జట్టు మూడో టి20లోనైనా నెగ్గాలని చూస్తోంది. ఈ రెండు మ్యాచుల్లో బౌలింగ్‌లో భారత్ ఆకట్టుకుంది. ఇంగ్లాండ్ బ్యాటర్స్ భారీ స్కోర్ చేయకుండా కట్టుదిట్టంగా బౌలింగ్ చేసి పరుగులు చేయకుండా నిరోధించగలిగింది. అయితే, టీమిండియాకు కెప్టెన్ సూర్యకుమార్ ఫామ్ ఆందోళనకరంగా మారింది. గతేడాది సూర్యకుమార్ టీమిండియా టి20 జట్టు కెప్టెన్సీ బాధ్యతలు స్వీకరించిన సమయంలో బ్యాటింగ్‌తో అలరించాడు. కానీ, కెప్టెన్‌గా బాధ్యతలు స్వీకరించాక పరుగులు తీయడంలో ఇబ్బందిపడుతున్నాడు. టి20ల్లో అత్యుత్తమ బ్యాటర్స్‌లో ఒకడైన సూర్యకుమార్.. 17 ఇన్నింగ్స్‌లో 26.18 సగటుతో 429 పరుగులు చేశాడు. ఇంతకు ముందు రాజ్‌కోట్‌లో టీమిండియా ఐదు టీ20లు ఆడగా.. అందులో నాలుగింట్లో గెలిచి.. ఇక మ్యాచ్‌లో ఓడిపోయింది. ఈ మైదానంలో ఈ ఫార్మాట్‌లో ఇప్పటి వరకు ఇంగ్లండ్‌తో ఆడలేదు. ఇరుజట్లు టి20 మ్యాచ్‌లో ఆడుతుండడం ఇదే తొలిసారి. దాంతో మ్యాచ్‌లో పరుగుల వరద పారే అవకాశం ఉందని అంచనా. ఇక తొలుత బ్యాటింగ్ చేసిన జట్టుకే విజయ అవకాశాలు ఉన్న దృష్ట్యా టాస్ కీలకం కానుంది.

జట్లు(అంచనా): భారత్: సూర్యకుమార్(కెప్టెన్), సంజు(వికెట్ కీపర్), అభిషేక్, తిలక్ వర్మ, హార్దిక్, అక్షర్, సుందర్, జురెల్/రమణ్‌దీప్, అర్ష్‌దీప్, బిష్ణోయ్, వరుణ్ చక్రవర్తి.

ఇంగ్లండ్: బట్లర్(కెప్టెన్), డకెట్, సాల్ట్(వికెట్ కీపర్), బ్రూక్, లివింగ్‌స్టోన్, స్మిత్, ఓవర్టన్, కర్సే, ఆర్చర్, రషీద్, వుడ్.

ఢిల్లీ రంజీ జట్టులో కోహ్లి

- కర్ణాటకకు కెఎల్ రాహుల్
- సౌరాష్ట్రకు ఆడనున్న జడేజా

ముంబయి: టెస్టుల్లో పేలవఫామ్‌తో నిరాశపరుస్తున్న టీమిండియా స్టార్ క్రికెటర్లు రంజీట్రోఫీలో తమ తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. రోహిత్, జైస్వాల్, శ్రేయస్, శార్దూల్ తదితర ఆటగాళ్లు ఇప్పటికే రంజీట్రోఫీలో అరంగేట్రం చేయగా.. తాజాగా లెజెండరీ క్రికెటర్ విరాట్ కోహ్లి ఢిల్లీ తరపున రంజీట్రోఫీలో ఆడేందుకు సిద్ధమయ్యాడు. గ్రూప్–డిలో ఉన్న ఢిల్లీ సోమవారం ప్రకటించిన 20మంది ఆటగాళ్ల జాబితాలో కోహ్లికి చోటు దక్కిం ది. ఢిల్లీ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్(డిడిసిఎ) అధ్యక్షులు రోహన్ జెట్లీ ఈ విషయాన్ని వెల్లడించారు. 12ఏళ్ల తర్వాత కోహ్లి ఢిల్లీ తరపున రంజీట్రోఫీ బరిలో దిగనున్నట్లు ఆయన తెలిపారు. గురువారం నుంచి ఢిల్లీ–రైల్వేస్‌ల మధ్య రంజీట్రోఫీ లీగ్ మ్యాచ్ జరగనుంది.

కర్ణాటక జట్టులో కెఎల్ రాహుల్..

32ఏళ్ల కెఎల్ రాహుల్ కర్ణాటక తరపున రంజీట్రోఫీలో బరిలోకి దిగనున్నాడు. కర్ణాటక జట్టు ఈనెల 30నుంచి పంజాబ్‌తో రెండో లీగ్ మ్యాచ్ ఆడనుంది. కర్ణాటక చీఫ్ సెలెక్టర్ అభిరామ్ సోమవారం ఓ ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడిం చారు. 32ఏళ్ల కెఎల్ రాహుల్ 2020లో బెంగాల్–కోల్‌కతాల మధ్య జరిగిన రంజీమ్యాచ్‌లో చివరిసారిగా ఆడాడు. ఇక సౌరాష్ట్ర తరపున టీమిండియా సీనియర్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా బరిలోకి దిగనున్నాడు.

ఢిల్లీ జట్టు: బడోని(కెప్టెన్), కోహ్లి, సంఘ్వాన్, అర్పీత్, యశ్ ధుల్, జాంటీ సిద్ధు, హిమ్మత్ సింగ్, నవ్‌దీప్ సైనీ, మోనీ గ్రేవెల్, హర్ష్ త్యాగి, సిద్ధాంత్ శర్మ, శివమ్ శర్మ, ప్రణవ్ రాజ్‌వంశీ, వైభవ్ కంఢ్‌పాల్, మయాంక్ గుసైన్, గగన్ వట్స్, సుమిత్ మాథుర్, రాహుల్ గల్లాట్, జితేశ్ సింగ్, వంశ్ బేడీ.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68